# తెలంగాణ సంక్షిప్త చరిత్ర




సహాచర ప్రచురణలు
హైదరాబాద్

954.840732
98461

# తెలంగాణ సంక్షిప్త చరిత్ర


**కొత్త సునిత**

ముకురాల, పాలమూరు జిల్లా



**సహాచర ప్రచురణలు**

బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

తెలంగాణ సంక్షిప్త చరిత్ర

కొత్త సునిత

ముకురాల,, పాలమూరు జిల్లా

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2006

ప్రతులు : 1000

954. 840732
L.19652

వెల : 30/-

డి.టి.పి. : మంజీర గ్రాఫిక్స్, హైదరాబాద్
సెల్: 9989206397

ముద్రణ : సహచర బుక్‌మార్క్
ఎ.పి.హెచ్.బి.హెచ్.ఐ.జి. (ఓ.జి),
బ్లాక్ నెం.5, షాప్ నెం.29,
సుందరయ్య పార్కు పక్కన,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 044

18836

సర్వహక్కులు : రచయిత్రివి

ప్రతులకు : సహచర బుక్‌మార్క్,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్
ఫోన్ : 040 - 66103382
సెల్ : 98483 48173

సుందరయ్య గ్రంథాలయ ట్రస్టు
ACC No 98461
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500032.

# విషయసూచిక


| విషయం | పేజీ. నెం. |
|---|---|
| తెలంగాణ చారిత్రక నేపథ్యం | 1 |
| వివిధ ఉద్యమాలు (ముల్కి, తెలంగాణ, జైఆంధ్రా) | 12 |
| వివిధ రంగాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలు | 19 |
| తెలంగాణపై వివిధ రాజకీయ పార్టీలు | 46 |
| వై.ఎస్.ఆర్. పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలు | 53 |
| సందేహాస్పద అంశాల విశ్లేషణ | 57 |
| ప్రస్తుత కర్తవ్యం | 73 |
| సమైక్య రాష్ట్రంలో తెలంగాణను చక్కబరచుకునే అవకాశం ఉందా? | 79 |

# తెలంగాణ కంటే చిన్న రాష్ట్రాలు

| క్రమ సంఖ్య | రాష్ట్రం | విస్తీర్ణం (000చ.కి.మీ) | జనాభా (2001లెక్కలు) | జనసాంద్రత (ప్రతిచ.కి.మీ ) |
|---|---|---|---|---|
| 0 | తెలంగాణ | 114 7 | 3,09,73,019 | 227 |
| 1 | అరుణాచల్‌ప్రదేశ్ | 84 | 10,91,117 | 10 |
| 2 | అస్సాం | 78 | 2,66,38,407 | 286 |
| 3. | ఛత్తీస్‌గఢ్ | – | 2,07,95,956 | – |
| 4 | గోవా | 4 | 13,43,998 | 316 |
| 5. | హర్యానా | 44 | 2,10,82,989 | 372 |
| 6. | హిమాచల్‌ప్రదేశ్ | 56 | 60,77,248 | 93 |
| 7 | జమ్ము & కాశ్మీర్ | – | 1,00,69,917 | – |
| 8. | జార్ఖండ్ | – | 2,69,09,917 | – |
| 9. | మణిపూర్ | 22 | 23,88,634 | 82 |
| 10 | మేఘాలయ | 22 | 23,06,069 | 79 |
| 11 | మిజోరమ్ | 21 | 8,91,058 | 33 |
| 12 | నాగాలాండ్ | 17 | 19,88,636 | 73 |
| 13 | పంజాబ్ | 50 | 2,42,89,296 | 403 |
| 14 | సిక్కిమ్ | 7 | 5,40,493 | 57 |
| 15 | త్రిపుర | 10 | 31,91,168 | 263 |
| 16 | ఉత్తరాంచల్ | – | 84,79,562 | – |
| 17 | కేరళ | 39 | 3,18,38,613 | 749 |
| 18 | పశ్చిమబెంగాల్ | 89 | 8,02,21,171 | 776 |
| | కేంద్రపాలిత ప్రాంతం | | | |
| 19 | అండమాన్ & నికోబార్‌దీవులు | 8 | 3,56,265 | 34 |
| 20 | చండీగఢ్ | – | 9,00,914 | 5632 |
| 21 | దాద్రా&నగరీ హవేలి | – | 2,20,451 | 282 |
| 22 | డమన్ & డయూ | 4 | 1,58,059 | 907 |
| 23 | ఢిల్లీ | – | 1,37,82,976 | 6352 |
| 24 | లకద్వీప్ | – | 60,595 | 1616 |
| 25 | పాండిచ్చేరి | – | 9,73,829 | 1642 |

# నామాట

పుట్టిన నేల కన్నతల్లికన్న గొప్పదని భారతీయ సంస్కృతి తెలియజేస్తున్నది అందుకే **"నా తెలంగాణ ఈ భూ ప్రపంచంలోనే కాదు, ఈ విశ్వంలోనే నాకు అత్యంత ప్రీతిపాత్రమైనది"** అని సగర్వంగా చెప్పుకుంటున్నాను.

తెలంగాణాకు అన్యాయం జరిగిందని ప్రాంతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా అందరూ అంగీకరిస్తున్నారు. కానీ సరిచేయడానికి మాత్రం ఎవ్వరూ ప్రయత్నించడం లేదు అవమానం జరుగుతున్నపుడు నిలదీయకపోవడం 'పౌరుషం' అనిపించుకోదు 'ఒక చెంపమీద కొడితే మరోచెంప చూపించే' కాలం కాదు యిది దేశానికి అవసరమైతే రాష్ట్రాన్ని, రాష్ట్రానికి అవసరమైతే జిల్లాను, జిల్లా బాగుకొరకు గ్రామాన్ని, గ్రామం బాగు కొరకు కుటుంబాన్ని, కుటుంబం కొరకు ఆత్మత్యాగాన్ని చేయడానికి వెనుకాడరాదని అనుభవజ్ఞులు సెలవిచ్చారు. తెలంగాణ తల్లికి అనునిత్యం అవమానం జరుగుతున్నందున "నేను సహితం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అన్న సందేశాన్ని ప్రాతిపదికగా తీసుకొని నా కర్తవ్యంగా భావించి 'కుంభకర్ణుని నిద్ర'లో ఉన్న తెలంగాణ ప్రజలను మేల్కొలుప వలసిన ఆవశ్యకత ఎంతైనా వుందని గుర్తించి ఈ పుస్తక రచనకు పూనుకోవడమైంది

మీడియా మొత్తం ఆంధ్రుల చేతుల్లోనే ఉన్నందున తెలంగాణ కష్టాలు, నష్టాలు సాధారణ ప్రజల దృష్టికి రాలేకపోతున్నాయి దినపత్రికలు, టీవీఛానల్లు, సినిమాలు తెలంగాణ కష్టాలను ప్రభుత్వం దృష్టికి తేవడానికి కూడా ప్రయత్నించడం లేదు. ఇప్పటికిప్పుడు మీడియాలో ఆంధ్రుల ఆధిపత్యాన్ని తగ్గించే పరిస్థితులు లేవు అందుకే తెలంగాణ వాసులే ఒక పధకం ప్రకారం సాహిత్యాన్ని తయారుచేసి, తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ ప్రజలకు వివరించాల్సిన అవసరం వుంది. తెలంగాణ సాహిత్యాన్ని ఇతోధికంగా పెంచాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యమవ్యాపితకి ఉడతా భక్తిగా తోడ్పడాలనే సదుద్దేశ్యంతో అందుబాటులో ఉన్న తెలంగాణ సాహిత్యాన్ని చదివి, జీర్ణించుకొని, మేధావుల అభిప్రాయాలను క్రోడీకరించి నా శైలిలో ఈ చిన్ని పుస్తకాన్ని మీకందిస్తున్నాను.

పుస్తకంలో జరిగిన పొరపాట్లు తెలియజేస్తే సవరించుకోవడానికి ఎల్లవేలలా సిద్ధంగానే ఉన్నాని మనవి చేసుకుంటూ, తప్పులేమైనా వుంటే క్షమించమని యావన్మందిని ప్రార్థిస్తూ, పుస్తకంలోని అభిప్రాయాలు ఎవరికైనా బాధ కలిగిస్తే మన్నించగలరని వేడుకుంటూ సెలవు

ఇట్లు
కొత్త సునిత

# ముందుమాట

తెలంగాణలో సకల సంపదలున్నాయట! కానీ తెలంగాణా ప్రజలు అష్టదరిద్రులేనట!! రైతుల ఆత్మహత్యలతో, పసిపిల్లల అమ్మకాలతో, బ్రతుకుతెరువు కొరకు వలసలతో, ఫ్లోరైడ్ నీటిని త్రాగి రోగాలతో, ఎడతెగని అప్పులతో తెలంగాణ ప్రజలు దిక్కుదోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పనులులేక పల్లెలు పొమ్మంటున్నాయి పంటలులేక, పంటలకు ధరలులేక రైతులకు పురుగుమందులు తోడున్నామంటున్నాయి అన్నదాతగా బిరుదును పొంది రైతన్న అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలే శరణ్యం అంటున్నాడు కంటినిండా నిద్రలేక కడుపునిండా తిండిలేక, కాపాడే నాధుడులేక తెలంగాణ ప్రజల్లో రోజురోజుకూ జీవితాలపై ఆశలు నశిస్తున్నాయి నీటిబొట్టు కొరకు చకోరపక్షిలా, పనుల కొరకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. దారం తెగిన గాలిపటంలా కన్నవారిని, ఉన్న ఊళ్ళను విడిచి దిక్కులు తెలియని ప్రాంతాలకు పొట్టలు చేతబట్టుకుని వలసలు పోతున్నారు ఈ క్రమంలో తల్లికి పిల్లలు, పిల్లలకు తల్లి దూరమవుతున్న పరిస్థితులు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి

అయినా రాజభోగాలలో మునిగితేలుతున్న రాజకీయ నాయకులకు ఇవేవీ పట్టడం లేదు. తెలంగాణ ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపడంలో రాజకీయ పార్టీలన్నీ పోటీ పడుతున్నాయి. సమైక్య రాష్ట్రంలో 'ఆంధ్ర' శరవేగంతో ముందుకు వెళుతుంటే, అదే వేగంతో 'తెలంగాణ' వెనుకకు వెళ్ళడం దురదృష్టం. దీనికి ప్రధాన కారణం పాలకుల దోపిడీ విధానాలే అని చెప్పుకోక తప్పదు. ఎంత సహకరిద్దామన్నా పాలకుల వివక్ష తగ్గడం లేదు. పైగా 'వివక్ష' పాలకుల 'లక్షణం' అయిపోయింది పాలకుల పక్షపాత పాలన కారణంగా తెలంగాణ ప్రజలు యమ యాతనను అనుభవిస్తున్నారు పులి తన పిల్లలను తానే తింటుందన్న విషయం నిజమో కాదో కాని, కన్నతల్లులు తమ పిల్లలను అమ్ముకోవడం తెలంగాణలో సత్యమై, నిత్యకృత్యమైపోయింది.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు సమానంగా లేకపోయినా సంతోషంగానైనా లేరు. ఉన్నతస్థాయికి చేరుకోలేకపోయినా, ఉన్న స్థాయినైనా నిలుపుకోలేకపోయారు. ఈ పరిస్థితులలో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడమే తెలంగాణలోని సర్వరోగాలకు చక్కని ఔషధం. ఎంతకాలం వేచివున్నా పాడిందానికి, విన్నదానికి సరిపోయి, తలూపిన దానికి తంబూర అప్పగించాల్సిన పరిస్థితులే తెలంగాణకు మిగిలేలా కనిపిస్తున్నాయి. ఇంకేమాత్రం ఆలస్యం చేసినా తెలంగాణ మరో ఏడారిగా మిగలక తప్పదు కాబట్టి ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పరచుకోవాల్సిన ఏకైక లక్ష్యం ఎదురు చూస్తున్నది తెలంగాణ ప్రజలను చైతన్యపరిచే క్రమంలో సముద్రంలో నీటిబొట్టులా ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాం.

'జై తెలంగాణ'

ప్రచురణ కర్తలు

# ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం

| ఆంధ్ర | తెలంగాణ |
|---|---|
| పాలకులు | పాలితులు |
| అధికారులు | అటెండర్‌లు |
| ఉద్యోగాలు | నిరుద్యోగులు |
| ప్రాజెక్టులు | ఎత్తిపోతలు |
| పరిశ్రమలు | కాలుష్యం |
| నక్సల్స్ పితామహులు | సాధారణ నక్సలైట్‌లు |
| లొంగుబాటులు | ఎన్‌కౌంటర్లు |
| పలకా-బలపం | పలుగు-పార |
| ధనధాన్యాలు | ఆకలిచావులు |
| ప్రభుత్వ విద్యాసంస్థలు | ప్రైవేటు విద్యాసంస్థలు |
| నూతన సంస్థల | రాకడఉన్న సంస్థల పోకడ |
| నదీజలాలు | నదుల దారులు |
| హిల్స్ | గుట్టలు |
| (బంజారాహిల్స్,జూబ్లిహిల్స్) | (జగద్గిరిగుట్ట, అడ్డగుట్ట) |
| కాలనీలు | మురికివాడలు |
| అపార్ట్‌మెంట్‌లు | పూరిగుడిసెలు |
| ఎన్‌క్లేవ్‌లు | ఫుట్‌ఫాత్‌లు |
| ఎ.సి.గదులు | కూలి అడ్డాలు |
| సినిమా స్టుడియోలు | తోపుడు బండ్లు |
| ఎకరాల్లో నివాసాలు | గజాలల్లో నివాసాలు |
| ధనం కొరకు వలసలు | బ్రతుకు కొరకు వసలు |
| రియల్ ఎస్టేట్ వ్యాపారులు | భూముల అమ్మకాలు |
| నికర లాభం | నికర నష్టం |
| (సమైక్య రాష్ట్రం) | (సమైక్య రాష్ట్రం) |

| | |
|---|---|
| ఆంధ్రులకు చిక్కాయి భోగాలు | ఆంధ్రులకు హక్కుల రక్షణ |
| తెలంగాణకు దక్కాయి రోగాలు | తెలంగాణ ఆస్తుల భక్షణ |
| ఎప్పటికీ వారికేనా యోగాలు | అందులోనే పాలకులకు శిక్షణ |
| ఇంకెన్నాళ్ళని మన ఈ త్యాగాలు | మన పది జిల్లాలు వారికి దక్షిణ |

విశాలాంధ్రలోనే ప్రజారాజ్యస్థాపనకు పోరాటం చేస్తామంటున్న కమ్యూనిస్టులు బెంగాల్‌లో ఏపాటి అభివృద్ధిని సాధించగలిగింద్రు? తెలంగాణ వారైతే సుత్తి మొత్తనంటున్నదా? కొడవలి అడనంటున్నదా? తెలంగాణ వేరైతే మీ పోరాటానికి అడ్డేమిటి?

– కాళోజి


| | |
|---|---|
| విశాలాంధ్రే ముద్దన్నారు | తెలంగాణ కూడా రాష్ట్రంలో భాగమేనట |
| ఉపముఖ్యమంత్రి రద్దన్నారు | అభివృద్ధిలో చూస్తే ఎంతో దూరమేనట |
| అధికార పీఠం వారి జిద్దన్నారు | నిధులు కేటాయించాలంటే మాత్రం భారమేనట |
| నీటి దారలు మనకు వద్దన్నారు | ఇదేమిటి అని ప్రశ్నిస్తే నేరమేనట |

# తెలంగాణ సంక్షిప్త చరిత్ర

"తెలంగాణ బిడ్డ ఆవేశపరుడు. అంతర్ముఖత్వం, తిరగబడేతత్వం - రెండూ సమపాళ్లలో ఉంటాయి. తెలంగాణ మనిషిలో భోళాతనం, లౌక్యం తెలియని అమాయకత్వం, మ[illegible]హాటితనం, సంపదకోసం అంగలార్చకపోవటం, ధర్మాగ్రహం వంటి గుణగణాలు ఇక్కడి సాదామనిషి ఆత్మను పట్టిస్తాయి. వ్యక్తిగతంగా చూసినా, సామాజికంగా చూసినా న్యాయమైన పోరాటాలు ఈ గడ్డమీద తప్ప ఇంకోచోట వచ్చే అవకాశం లేదు."

- దాశరథి రంగాచార్య.

## దేశ స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ



తెలంగాణ పురాతన సంస్కృతికి తార్కాణం ఈ గోల్కొండ కోట

వందల సంవత్సరాల నైజాం పాలనలో హైదరాబాదు రాష్ట్రం 16 జిల్లాలు కలిగి మూడు భాషల ప్రజలతో ఉండేది. (8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడ జిల్లాలు, 3 కర్నాటక జిల్లాలు). ఈ మూడు భాషల ప్రజలు వారివారి భాషలు, అచార వ్యవహారాలు వేరైనా ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సహజీవనం సాగిస్తూ వచ్చారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలంగాణ 1724 నుండి 1948 వరకు 224 సంవత్సరాలు నిజాంపాలనలో ఉండేది. నిజాం నుండి విముక్తి కలిగించడానికి ఇక్కడి ప్రజలు ఎన్నెన్నో కష్టాలు పడాల్సి వచ్చింది. లెక్కలేనంత మంది ప్రాణాలను కూడా అర్పించారు. నిజాం నిరంకుశత్వాన్ని పారద్రోలడానికి మదరాసు రాష్ట్రంలో భాగమైన ఆంధ్రులు కించిత్ సహకరించిన దాఖలాలు లేవు. అంతేకాదు, తెలంగాణ ప్రజలు కూడా తెలుగు మాట్లాడే వారేనని కాని, తమవారేననికాని ఏనాడూ చింతించిన పాపాన పోలేదు. ఆనాడే తుఫానులతో అల్లకల్లోలమై పొట్టచేత పట్టుకొని ఇక్కడికి వచ్చిన ఆంధ్రులను తెలంగాణ ప్రజలు సాదరంగా ఆహ్వానించి, తోచిన సాయమందించిన సందర్భాలు కోకొల్లలు. స్వాతంత్ర్యానికి

పూర్వమే ఆంధ్రులు తండోపతండాలుగా తెలంగాణకు వలస వచ్చి, ఇక్కడి ఉద్యోగాలలో తిష్టవేశారు

## దేశ స్వాతంత్ర్యం నాటి స్థితి

ఆగస్టు 15, 1947న దేశ ప్రజలంతా స్వాతంత్ర్య వేడుకల్లో మునిగిపోయారు ఆంధ్రులు భాగంగా ఉన్న మదరాసు రాష్ట్రానికి కూడా ఆంగ్లేయుల నుండి విముక్తి కలిగినందున వారు కూడా ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు కాని నిజాం నిరంకుశత్వం నుండి విముక్తి లభించనందున తెలంగాణ ప్రజలు మాత్రం నిరాశా నిస్పృహల్లో మునిగిపోయారు ఆ కాలంలో తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించడానికి ఆంధ్రులు ఎటువంటి ఉద్యమాన్ని నడుపలేదనేది ఇక్కడ గుర్తుంచుకోతగ్గ అంశం

## హైదరాబాదు రాష్ట్ర స్వాతంత్ర్యానికి ముందు స్థితి



వద్దంటే గద్దె యెక్కి పెద్దరికం చేస్తావా?
మూడు కోట్ల చేతులు
నీ మేడను పడదోస్తాయి - మెడనే విడదీస్తాయి
నీకు నిలుచు హక్కు లేదు - నీకింకా దిక్కులేదు - దాశరథి

నిజాం నవాబుపై నిరసనగా వ్రాసిన పై కవిత నేటి పాలకులకు సహితం సరిగ్గానే అతికింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాకే నిజాం నిరంకుశత్వం మరింత పెరిగిపోయింది. తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని ఉక్కుపిడికిలితో అణిచివేయాలని నిర్ణయించడంతో తెలంగాణ ప్రజల కష్టాలు తారాస్థాయికి చేరుకున్నాయి పానకంలో పుడకల్లాగా ఖాసిం రజ్వీ నాయకత్వంలోని రజాకారుల అమానుష చర్యలు తెలంగాణ ప్రజలను దిక్కులేని పక్షుల్లాగా మార్చివేశాయి. దోపిడీలకు, హత్యాకాండకు, అత్యాచారాలకు రజాకారులు పాల్పడడంతో ఇక్కడి ప్రజలు తలదాచుకోవడానికి ఎక్కడికి పడితే అక్కడికి వలసవెళ్ళాల్సి వచ్చింది. వారి వికృత చర్యలుప్రపంచంలోనే అతి భయంకరమైనవిగా గుర్తించబడ్డాయి. ఆ సమయంలో తలదాచుకోవడానికి ఆంధ్రా ప్రాంతాలకు పోయిన తెలంగాణ ప్రజలకు కనీస మర్యాద దక్కకపోగా ఆపదలోనున్న తెలంగాణ ప్రజలను అందినకాడికి దోచుకోవడంలో ఆంధ్రులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారని చెబుతుంటారు. అదే సమయంలో నాగపూర్ లాంటి తెలుగేతర ప్రాంతాలకు వెళ్ళిన తెలంగాణ ప్రజలకు మాత్రం అపూర్వమైన ఆదరణ లభించిందట.

**నదీనదాల దారులు మనవి - నదీజలాల దారల్లు శాశ్రితి**

## హైదరాబాదుకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు

నైజాం ప్రాంత ప్రజల ఎడతెగని పోరాటాల వలన, భారత ప్రభుత్వ చర్యల వలన, సర్దార్‌పటేల్ చాకచక్యం వలన నిజాంపై వత్తిడి పెరిగింది. 1948 సెప్టెంబర్ 1న హైదరాబాద్‌పై పోలీసు చర్య ప్రారంభమైంది. సెప్టెంబర్ 17న చివరి నిజాం. మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగిపోయారు. దీనితో హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి కలిగి, ఇక్కడి ప్రజలకు స్వాతంత్ర్యం లభించింది అంటే దేశానికి స్వాతంత్ర్యం లభించిన మరో సంవత్సరం తర్వాత మాత్రమే ఇక్కడి ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని గమనించాలి అంటే హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యంలో ఆంధ్రుల పాత్ర లేనేలేదని తెలుస్తూనే ఉన్నది కదా!

హైదరాబాద్ రాష్ట్రానికి నిజాం నుండి విముక్తి కలిగినప్పటికి స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా దాదాపు నాలుగు సంవత్సరాల పాటు అంటే 1952లో ఎన్నికలు జరిగి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యేంత వరకు ప్రజా ప్రభుత్వానికి ఇక్కడి ప్రజలు నోచుకోలేదు. కొంతకాలం మిలిటరీ అధికారి జె ఎన్ చౌదరి పరిపాలన, మరికొంత కాలం సివిల్ అధికారి యం.కె వెలోజీ నాయకత్వాన పరిపాలన కొనసాగింది వీరి పాలనా కాలంలో ఆంధ్రుల వలసలు విపరీతంగా పెరిగిపోయి, ఇక్కడి ఉద్యోగావకాశాలను ప్రాంతేతరులు చేజిక్కించుకున్నారు.

## ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు

ఇదిలా ఉండగా గుంటూరు కోర్టులో ఏదో ఒక చిన్న ఉద్యోగాన్ని ఆంధ్రునికి దక్కనీయకుండా తమిళునికి కట్టబెట్టారనే చిన్న వివాదంతో ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి నడుంబిగించారు పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కొరకు 1952లో అక్టోబరు 19న ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. రాజధాని సమస్యతోపాటు, ఆర్థిక సమస్యలు ఎదురవుతాయని ఊహించినప్పటికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది కాని మదరాసు నగరంలో భాగం యివ్వాలని కోరుతూ తన నిరాహారదీక్షను కొనసాగించి 63వ రోజున అంటే డిసెంబర్ 15నన పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారు దీంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తీవ్రరూపం దాల్చింది కేంద్ర ప్రభుత్వందిగివచ్చి 1953 అక్టోబరు 1న మదరాసు రాష్ట్రంలో నుండి ఆంధ్రులను విడదీసి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడమైనది. అంటే మదరాసు రాష్ట్రం నుండి ఆంధ్రులను వేరుచేయాలనే ఏకైక లక్ష్యంతో మాత్రమే 1952లో పొట్టిశ్రీరాములు ఆత్మత్యాగాన్ని చేయగా, విశాలాంధ్ర ఏర్పాటు కొరకు ప్రాణత్యాగం చేసినట్లుగా నేటి నాయకులు వర్ణించడంలో అర్థమేలేదు.

## ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందున్న పరిస్థితులు

1948లో హైదరాబాదు రాష్ట్రం, 1953లో ఆంధ్రరాష్ట్రం వేరువేరుగా ఏర్పాటైన తరువాత ఆంధ్రులు భాషాప్రయుక్త రాష్ట్రాల పల్లవిని అందుకున్నారు కరువుకాలంలో ఒల్లనని పంపించిన మొగడు, పంటకాలంలో పంపించమని అడిగినట్లు నిజాం నుండి స్వాతంత్ర్యాన్ని పొందడంలోకాని, రజాకారుల అరాచకాల నుండి రక్షించడంలోకాని పట్టించుకోని ఆంధ్రులు. భాషా ప్రయుక్త రాష్ట్రాల పల్లవితో "అందరిదీ తెలుగే"నని, తెలంగాణ ప్రజలు కూడా తమవారేనని కపటప్రేమను ఒలకబోశారు తెలుగు మాట్లాడే వారందరికి ఒకే రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే బూటకపు నినాదాన్ని ముందుకు తెచ్చారు విశాలాంధ్ర ఏర్పాటును తెలంగాణవాసులు వ్యతిరేకిస్తూనే వచ్చారు ఇదే సమయంలో కమ్యూనిస్టులు కూడా విశాలాంధ్ర ఏర్పాటుకు తందాన పలకడంతో ఆంధ్రానాయకత్వం యొక్క వాదానికి మరింత బలం చేకూరింది అంతేకాకుండా స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన రాష్ట్రాలలో కూడా అక్కడక్కడ భాషాప్రయుక్త రాష్ట్రాల వాదం ముందుకు వచ్చింది. దీంతో ఆనాటి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జి ఫజల్ అలీ అధ్యక్షతన 1953లో ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు అధ్యయనానికై ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది అదే మొదటి ఎస్.ఆర్ సి (స్టేట్ ఆర్గనైజేషన్ కమీషన్) దేశంలోని వివిధ భాషలు మాట్లాడే ప్రాంతాలను పర్యటించి, భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలు ఏర్పరచడానికి తగిన సూచనలు-సలహాలు ఇవ్వాలన్నదే ఈ కమిషన్ ప్రధాన బాధ్యత. అందులో భాగంగానే ఈ కమిషన్ హైదరాబాదు రాష్ట్రంలో పర్యటించి తెలంగాణ ప్రజల, రాజకీయ నాయకుల అభిప్రాయాలను సేకరించి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది ఆ నివేదికలో హైదరాబాదు రాష్ట్రంలోని 8 తెలుగు మాట్లాడే జిల్లాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచాలని దానికి హైదరాబాదు రాష్ట్రం అని నామకరణం చేయాలని సూచించింది ఈ ఏర్పాటును అయిదు సంవత్సరాలు పరీక్షించి, ఆ తరువాత ఒకవేళ హైదరాబాదు రాష్ట్ర శాసనసభలో మూడింట రెండువంతుల మంది అంగీకరిస్తే అప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో విలీనం కావచ్చునని కూడా తెలిపింది హైదరాబాదు-ఆంధ్ర రాష్ట్రాల ప్రజల మనోభావాలను పరిశీలించిన ఫజల్ అలీ కమిషన్ కూడా స్థూలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగానే తన నివేదికను 1955లో సమర్పించింది.

### విలీనానికి వ్యతిరేకంగా ఫజల్అలీ కమిషన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు

★ ఎక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతంతో, తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాన్ని కలపడం సమర్థనీయం కాదు.

సమైక్య రాష్ట్రంతో దగా - లేకుండా పోయింది జాగా

- లోటు బడ్జెట్‌తో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంతో కలిపితే హైదరాబాద్ రాష్ట్రం నష్టపోక తప్పదు
- బ్రిటీష్ పాలనలో పుట్టి పెరిగిన ఆంధ్రులకు విద్యావకాశాలు అధికంగా ఉన్నందున, నిజాం కాలంలో ఉర్దూ నేపథ్యంలో అరకొర చదువులు చదివిన తెలంగాణ వారితో కలపడం వలన ఉద్యోగాలన్నింటినీ ఆంధ్రులే దక్కించుకునే అవకాశం వుంది
- లోతట్టు ప్రాంతంగా ఉన్న ఆంధ్ర ప్రాంతానికే నదీ జలాలన్నీ వినియోగించబడే అవకాశమున్నందున తెలంగాణకు నీటి వనరులలో న్యాయం జరుగదు

## విలీనానికి అనుకూలంగా ఫజల్‌అలీ కారణాలు

- ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని సమస్య ఉన్నందున హైదరాబాద్ ఇప్పటికే అభివృద్ధి చెందిన ఉన్నందున రెండు రాష్ట్రాల విలీనంతో ఆంధ్ర రాష్ట్రానికి ఉన్న రాజధాని సమస్య పరిష్కారమవుతుంది
- తెలంగాణలో ఖనిజ వనరులు విరివిగా ఉన్నప్పటికి ఆహార సమస్య వుంది ఆంధ్రలో ఆహారానికి కొరత లేనప్పటికి ఖనిజ వనరుల కొరత వుంది రెండు ప్రాంతాల విలీనంతో ఇరుప్రాంతాల సమస్యలు పరిష్కారమవుతాయి
  (తెలంగాణ ఖనిజ వనరులు ఆంధ్రులకు ఉపయోగపడ్డాయే తప్ప, ఆంధ్రుల ఆహార ధాన్యాలు మాత్రం తెలంగాణకు దక్కలేదు)

ఫజల్‌అలీ కమిషన్ ఊహించినట్టే నీటి వనరులలో, ఉద్యోగాల్లో తెలంగాణ పూర్తిగా నష్టపోయింది. ఆంధ్ర రాష్ట్ర రాజధాని సమస్య తీరిపోయింది. ఆనాటి దేశ రాజకీయ నాయకులుగానీ, తెలంగాణ పెద్దలుగానీ ఫజల్‌అలీ కమిషన్‌కు ఏ మాత్రం విలువ ఇచ్చివున్నా ఈనాడు తెలంగాణ ఇన్ని కష్టనష్టాలకు లోనై వుండేది కాదు.

## పెద్దమనుషుల ఒప్పందం

| | |
|---|---|
| విలీలానికి పెద్ద మనుషుల ఆమోదం | కలిసుండాలంటే ఆంధ్రులకే ఇంపు |
| కోస్తాంధ్రకు కలిగింది ప్రమోదం | వారికొరకే తెలంగాణవాసుల ముంపు |
| తెలంగాణకు మిగిలింది విషాదం | ఎంతకాలం కలిసున్నా తప్పదు కంపు |
| ఇంకా కొనసాగిస్తే తప్పదుప్రమాదం | అందుకే ప్రత్యేక రాష్ట్రానికై చేయాలి తెంపు |

ఓవైపు ఫజల్‌అలీ కమిషన్ రెండు ప్రాంతాలను కలిపే పరిస్థితులు లేవని తేల్చిచెప్పగా, మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా ఏం చేయాలో తేల్చుకోలేని

మాటల్లో మనమంతా అన్నదమ్ములు-చేతల్లో చూశాంగా ఉన్న దమ్ములు

డోలాయమాన స్థితిలో వుండగా ఆంధ్ర రాజకీయ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి కేంద్రాన్ని సమ్మతింపజేసే ప్రయత్నాలలో వుండగా ఉన్నట్టుండి ఆంధ్ర నాయకుల ప్రలోభాలకు తెలంగాణ పెద్దలు లొంగిపోయి 'పెద్దమనుషుల ఒప్పందం' పేరుతో గాలి కబుర్లతో, గారడీ విద్యలతో విలీనానికి అంగీకరించి కసాయి చేతికి కత్తి అందిచ్చినట్లు తెలంగాణను ఆంధ్రుల చేతుల్లోకి బలవంతంగా నెట్టారు.

1956 ఫిబ్రవరి 20న ఢిల్లీలో హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల ముఖ్యమంత్రుల అధ్యక్షతన కుదుర్చుకున్న ఒప్పందంలో ఆంధ్ర రాష్ట్రం తరపున బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతులచ్చన్నలు పాల్గొనగా; తెలంగాణ పెద్దలుగా బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, మర్రిచెన్నారెడ్డి, జె.వి.నర్సింగరావులు సంతకాలు చేశారు.

## ఒప్పందంలోని ప్రధాన అంశాలు - ఉల్లంఘనలు

★ ఒక ప్రాంతానికి ముఖ్యమంత్రి పదవి లభిస్తే మరో ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి పదవి దక్కాలి. హోం, ఆర్థిక, రెవెన్యూ, ప్రణాళిక, వాణిజ్యం, పరిశ్రమల శాఖల్లో ఏవేని రెండు శాఖలను తెలంగాణావారికి అప్పగించాలి.
(ఆంధ్రకు చెందిన సంజీవరెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కగా, తెలంగాణకు దక్కాల్సిన ఉపముఖ్యమంత్రి పదవిని రద్దుచేశారు )

★ తెలంగాణలో మద్యపాన నిషేధాన్ని తెలంగాణ శాసనసభ్యులు కోరిన విధంగా అమలుచేయాలి.
(తెలంగాణలో మద్యపానం అమలుచేయడం, ఆంధ్రలో నిషేధాన్ని విధించడంతో తెలంగాణ నుండి అందిన ఆదాయం సమైక్య రాష్ట్రంలో భాగమైపోయింది.)

★ పాలనా వ్యయాన్ని ఆంధ్ర-హైదరాబాద్‌లు 2:1 నిష్పత్తిలో భరించాలి. మిగిలిన తెలంగాణ ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికే వినియోగించాలి.
(లోటు బడ్జెట్‌తో విలీనమైన ఆంధ్రరాష్ట్రం సమైక్య రాష్ట్రంలో తనవంతు వాటానే సమకూర్చలేకపోయినందు వలన హైదరాబాదు ప్రాంత మిగులు ఆంధ్ర ప్రాంతపు పాలనా వ్యయం వాటాక్రిందే ఖర్చయింది.)

★ విశాలాంధ్రను ఏర్పాటు చేసేటప్పుడు ఒకవేళ ఉద్యోగులను తొలగించాల్సి వస్తే తగిన నిష్పత్తిలోనే తొలగించాలి.
(తొలగించే పరిస్థితి తలెత్తనందున, కొత్తగా తీసుకునే ఉద్యోగాల్లో దొంగ సర్టిఫికెట్లతో ఆంధ్రులే నియమించబడ్డారు.)

- ★ ఉద్యోగుల నియామకాల్లో జనాభా నిష్పత్తిని ప్రాతిపదికగా తీసుకోవాలి
- ★ తెలంగాణలోని సాధారణ పరిపాలన, న్యాయ విభాగాల్లో ఉర్దూ భాషకున్న ప్రస్తుత స్థానాన్ని మరో అయిదేళ్ళు కొనసాగించాలి ఉద్యోగ నియామకాలకు తెలుగు భాషా జ్ఞానాన్ని తప్పనిసరి అర్హతగా నిబంధన పెట్టకూడదు ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకు నిర్వహించే తెలుగు పరీక్షలో మాత్రం ఉత్తీర్ణుడవ్వాలి.
- ★ హైదరాబాదు రాష్ట్రంలోని విద్యావకాశాలను ఇక్కడి విద్యార్థులకే దక్కేలా చూడాలి. తెలంగాణలోని సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశం ఇక్కడి విద్యార్థులకే పరిమితం చేయాలి ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రం మొత్తం మీద ఉన్న విద్యా సౌకర్యాలలో తెలంగాణ విద్యార్థులకు మూడింట ఒకవంతుకు తగ్గకుండా చూడాలి ఈ రెండింటిలో తెలంగాణకు ఏది ఇష్టమైతే దానిని ఎంచుకోవచ్చు

  (తప్పుడు ముల్కీ సర్టిఫికెట్ల (తెలంగాణ నివాసి అని ధృవపరిచే పత్రం)తో ఆంధ్రులే అధికంగా ఇక్కడి విద్యావకాశాలను వినియోగించుకున్నారు.)
- ★ ఉద్యోగాలలో 2 : 1 నిష్పత్తిని పాటించాలి

  (ఇక్కడివారికి సరియైన తెలుగు రాదని, అన్ని శాఖలలో ఆంధ్రులనే నింపారు)
- ★ ఉద్యోగ నియామకాలకు 12 సంవత్సరాల నివాసం తప్పనిసరిగా పాటించాలి.

  (నిబంధనను పర్యవేక్షించాల్సిన వారంతా ఆంధ్రులే అయినందున తప్పుడు నివాస పత్రాలను సమర్పించినా అడిగినవారు లేరు )
- ★ తెలంగాణ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేయాలి

  (రాజ్యాంగపరమైన హక్కులుగాని, చట్టబద్ధతగానీ కల్పించనందున ఈ మండలి సలహాలను ఏ ముఖ్యమంత్రి కూడా లెక్కలోకి తీసుకోలేదు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ మండలి కూడా రద్దయింది )
- ★ తెలంగాణలోని వ్యవసాయ భూములను ఆంధ్రులు కొనుగోలు చేయరాదు.

  (నీటి పారుదల వసతి ఉన్న భూములు, నల్లరేగడి నేలలు మొత్తం ఇప్పటికే ఆంధ్రుల అధీనంలోకి వెళ్ళాయి )
- ★ క్యాబినెట్ మంత్రుల నియామకం 3.2 నిష్పత్తిలో జరగాలి తెలంగాణకు చెందిన మంత్రుల్లో ఒకరు ముస్లీం మతస్తుడు ఉండాలి

మా భూములు చిన్నబోయాయి తడారి-చూస్తూపోతే త్వరలోనే మరో ఎడారి



ఆంధ్రుల స్వభావాన్ని ముందుగానే పసిగట్టిన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూగారు "భవిష్యత్‌లో ఆంధ్రులతో తెలంగాణ వాసులు కలిసి వుండడానికి ఏనాడు ఇష్టపడకపోతే ఆనాడు విడాకులు తీసుకున్నట్లుగా విడిపోచ్చునని" సూచించారు అంతేగాక కర్నూలులో 1953 అక్టోబర్‌లో ఒక పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ "విశాలాంధ్ర ఏర్పాటులో సామ్రాజ్యవాదం ఇమిడి వుంద"ని కూడా అభిప్రాయపడ్డారు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు

1948లో హైదరాబాదు రాష్ట్రం, 1953లో ఆంధ్రరాష్ట్రం వేరువేరుగా ఏర్పాటైన తర్వాత ఆంధ్రులు భాషాప్రయుక్త రాష్ట్రాల పల్లవినందుకున్నారు 'కరువు కాలంలో ఒల్లనని పంపించిన మొగడు, పంటకాలంలో పంపించమని అడిగినట్లు' నిజాం నుండి స్వాతంత్ర్యాన్ని పొందడానికిగానీ, రజాకారుల అరాచకాల నుండి రక్షించడంలో కాని పట్టించుకోని ఆంధ్రులు భాషాప్రయుక్త రాష్ట్రాల పల్లవితో 'అందరిదీ తెలుగే'నని, తెలంగాణ ప్రజలు కూడా తమవారేనని కపటప్రేమను ఒలకబోశారు. తెలుగు మాట్లాడే వారందరికి ఒకే రాష్ట్రాన్ని ఏర్పరచాలనే బూటకపు నినాదాన్ని ముందుకు తెచ్చారు. ఈ ప్రతిపాదనలోని మోసకారితనాన్ని పసిగట్టలేక తెలంగాణ నాయకులు ఆంధ్రులు పన్నిన వలలో చిక్కుకున్నారు 'పెద్దమనుషుల ఒప్పందం' పేరుతో ఆంధ్రుల ప్రతిపాదనలోని మోసాన్ని పసిగట్టలేని తెలంగాణ పెద్దల తొందరపాటు నిర్ణయంతో ఆంధ్రులు పన్నిన వలలో చిక్కుకుని ఇష్టంలేకున్నా తెలంగాణను బలవంతంగా ఆంధ్ర ప్రాంతంతో కలిపి 1956 నవంబర్ 1న దేశంలోనే మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పరచారు. ఫలితంగా ఆంధ్రుల కుత్సితపు రాజకీయాలకు పట్టాభిషేకం దక్కగా, తెలంగాణ వాసులకు మాత్రం మరోసారి పరాయిపాలనే దక్కింది.

1952 నుండి 1956 వరకు మాత్రమే ప్రజాస్వామ్య పాలనలో తెలంగాణవాసులు పూరిత స్వాతంత్ర్యం అనుభవించారు. 1956లో సమైక్య రాష్ట్రంలో భాగం కావడంచేత తెలంగాణకు పరాయిపాలన బతుకులే మళ్ళీ ఎదురయ్యాయి. సమైక్య రాష్ట్రంగా ఏర్పడి ఉండకపోతే ప్రజలు హాయిగా జీవితాలను వెళ్ళబుచ్చగలిగి ఉండేవారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఈ విలీనం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదు. ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకై నియమించబడిన ఫజల్‌అలీ కమిషన్‌కు ఇష్టంలేదు. తెలంగాణ ప్రజలకు ఇష్టం

లేదు. అయినా పెద్దమనుష్యుల ఒప్పందం పేరుతో, గాలి కబుర్లతో, గారడీ విద్యలతో మసిబూసి మారేడుకాయను చేసిన విధంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

## ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతోనే తెలంగాణకు ప్రారంభమైన అవమానాలు

**రాష్ట్రం పేరులో మోసం :** రాష్ట్రం పేరు నిర్ణయించడంలోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. ఆంధ్ర రాష్ట్రం-హైదరాబాద్ రాష్ట్రాలను విలీనం చేస్తే ఆంధ్ర అనే పదం ఉనికి కోల్పోకుండా హైద్రాబాద్ అనే పదానికిగాని, తెలంగాణ అనే పదానికిగాని ఆనవాలే లేకుండా చేసి 'ఆంధ్రప్రదేశ్' అనే పేరు స్థిరీకరించారు. 'ఆంధ్ర-తెలంగాణ' రాష్ట్రం అనే ప్రతిపాదనను ఇరుప్రాంతాల నాయకులు ముందు అంగీకరించినా కోస్తా నాయకుల కుత్సిత రాజకీయాల వల్ల తెలంగాణ అనే పదం కనుమరుగైపోయింది.

**ఒకే రాష్ట్రంలో రెండు విధాన నిర్ణయాలు :** ఒకే రాష్ట్రంలో భాగమైన తెలంగాణ ప్రాంతంలో మద్యపానం అమలులో వుండగా, ఆంధ్ర ప్రాంతంలో మద్యనిషేధాన్ని పాటించారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయంలో తెలంగాణ నుండి అందిన 'మిగులు' ఆదాయాన్ని ఆంధ్ర ప్రాంత అభివృద్ధికి వెచ్చించారు

**ఉపముఖ్యమంత్రి పదవిలో మోసం :** పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం ఒక ప్రాంతానికి ముఖ్యమంత్రి పదవి లభిస్తే మరో ప్రాంతానికి ఉపముఖ్యమంత్రి పదవి దక్కాలి. సమైక్య రాష్ట్రం మొదటి మంత్రివర్గంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన నీలం సంజీవరెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కగా, తెలంగాణకు దక్కాల్సిన ఉపముఖ్యమంత్రి పదవిని రద్దుచేశారు.

**మంత్రి పదవులలో మోసం :** ఒప్పందం ప్రకారం తెలంగాణకు మంత్రి పదవులలో 2:1 నిష్పత్తి ప్రకారం 6 మంత్రి పదవులు దక్కాల్సి ఉండగా 5 పదవులనే ఇచ్చి మొదటి మంత్రివర్గంలోనే మొండిచేయి చూపించారు. ఆనాడు ప్రారంభించిన పక్షపాతం నేటికీ కొనసాగుతుండడమే దురదృష్టకరమని చెప్పుకోకతప్పదు.

**తెలంగాణ రక్షణల ఉల్లంఘన :** పెద్దమనుషుల ఒప్పందంలో తెలంగాణలో కల్పించిన రక్షణలన్నింటికి మంగళం పాడారు. ముందే ఉద్యోగాలలో ఆంధ్ర అధికారులు అధికంగా ఉన్నందున తదుపరి నియమించిన ఉద్యోగాలలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. అంతేకాక తెలంగాణ భూములను తెలంగాణేతరులు కొనుగోలు చేయరాదనే రక్షణను ఉల్లంఘిస్తూ తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తెలంగాణేతరులు ఇబ్బడిముబ్బడిగా భూములను కొనుగోలు చేశారు. తెలంగాణ ప్రాంతానికి కల్పించిన మరో రక్షణ ముల్కి నిబంధనలను పాటించినట్లు ఏనాడు కన్పించలేదు.

పంచాయితీ ఎలక్షన్లొచ్చే - మనకు బూటకపు గ్యాస్ కనెక్షన్లొచ్చె

**తెలంగాణ మిగులును మింగేశారు :** విలీనం రోజున హైదరాబాద్ రాష్ట్రానికి అప్పులే లేవు పైగా మిగులు ఉండేది. అప్పులతో, లోటు బడ్జెట్‌తో సతమతమవుతున్న ఆంధ్ర రాష్ట్రం హైదరాబాద్‌లో విలీనం అయ్యింది. మిగులు బడ్జెట్ ఉన్న హైదరాబాద్‌తో లోటు బడ్జెటు ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని విలీనం చేయడంవల్ల సహజంగానే తెలంగాణకు అన్యాయం జరిగింది.

**చేసిన బాసలు వృధా :** సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఐదు సంవత్సరాలలో తెలంగాణను ఆంధ్రతో సమానంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చినా, 5 దశాబ్దాలు గడిచిన తర్వాత పరిశీలిస్తే నూరేళ్ళయినా సమానం చేయలేని స్థితి ఏర్పడింది. వేర్వేరు రాష్ట్రాలుగా ఉండి ఉన్నా లేదా ఇచ్చిన హామీలను అమలు చేసివున్నా 5 సంవత్సరాలు కాకపోయినా కనీసం పది సంవత్సరాలకైనా సమానం అయ్యేదే! ఇప్పుడు విడిపోయినా ఎన్నటికో ఒకనాటికి ఆంధ్రతో సమానంగా తెలంగాణ రూపుదిద్దుకుంటుందనటంలో సందేహం లేదు సమైక్య రాష్ట్రంలో వెయ్యేళ్ళున్నా అంతరాలు పెరుగుతాయే తప్ప సమాంతరంగా అభివృద్ధి చెందలేం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడంలో ఆలస్యం అయ్యేకొద్దీ తెలంగాణ అభివృద్ధికి ఎక్కువ సంవత్సరాలు కావలసి వస్తుందని తెలంగాణ వాసులు గుర్తిస్తే మంచిది. ఆంధ్ర, రాయలసీమ వనరులను కేటాయించి తెలంగాణను అభివృద్ధి పర్చాల్సిన అవసరం ఈనాటికీ లేదు.

## తెలంగాణ నాయకుల చరిత్ర మాయం

విలీనానికి అంగీకరించిన తెలంగాణ పెద్దలకు చరిత్రలో ఆనవాలే లేకుండా పోయింది. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలను త్యాగం చేసిన పొట్టి శ్రీరాములుకు తెలంగాణాపై అడుగడుగునా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి పేరు ఆంధ్రప్రదేశ్ చరిత్రలోకి ఎక్కించడంలో విజయం పొందారు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గులరామకృష్ణారావు గారిని అనామకుడ్ని చేయగలిగారు.

## సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రజల స్థితిగతులు

బ్రిటీష్ పాలన ముగిసిపోతే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయని దేశవాసులు భావించినట్లే, నిజాం పాలన అంతమైతే తమ బ్రతుకులు బాగుపడతాయని, బానిసత్వం, నిరంకుశత్వం నశించి సమానత్వం లభిస్తుందని, చదువులతోపాటు కొలువులు సమకూరుతాయని, పొలాలకు సాగునీరు లభిస్తుందని, కూడు, గూడు, నీడలకు లోటుండదని తెలంగాణ వాసులు కూడా ఎన్నెన్నో కలలు కన్నారు. కానీ అ కలలన్నీ పగటి కలలేనని మూన్నాళ్ళ ముచ్చటే నని అర్థం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. సరిచేసుకోవడానికి మాత్రం ఇంతకాలానికి కూడా వీలు కాలేదు

**పాలించారు ఆంధ్రులు ఏభై ఏళ్ళు - విడువక తప్పలేదు మనం ఊళ్ళు**

'రామేశ్వరం పోయినా శనేశ్వరం పోలేదన్నట్లు' నిజాం నవాబు పోయాడే కాని నిరంకుశత్వం పోలేదు, పేదరికం పోలేదు, మోసాలు తగ్గలేదు. పైగా మరిన్ని రెట్లు పెరిగాయి. సామ్రాజ్యవాదపు రాచరికాన్ని చవిచూసిన ఆంధ్రులు కల్లబొల్లి కబుర్లతో తెలంగాణపై పెత్తనం చేయసాగారు. వీరి పాలనతో తెలంగాణ వాసుల బ్రతుకులు పెనంమీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సమైక్య రాష్ట్ర ఏర్పాటుతో 'ఆగభోగాలు ఆంధ్రులకు దక్కగా, పొలికేకలు మాత్రం తెలంగాణకు దక్కాయి'. హిట్లర్ దురహంకారాలు, దక్షిణాఫ్రికా తెల్లజాతివారి వివక్ష, జర్మనీ నాజీల వికృత చర్యలను ఆంధ్రా పాలకులు మళ్లీ తెరపైకి ఎక్కించారు. ఆంధ్రా పాలకుల ఆగడాల ముందు నిజాం నవాబు నియంతృత్వం కూడా చాలా చిన్నదైపోయింది. రాజుల పాలన, తెల్లదొరల పరోక్ష పాలన, నిజాం ప్రత్యక్ష పాలన, రజాకర్ల అమానుష చర్యల లాంటివాటి నన్నింటిని మేళవించి ఆంధ్ర పాలకులు తమ పాలన ద్వారా రుచి చూపిస్తున్నారు. వేల సంఖ్యలోని ఆంధ్రపాలకుల, అధికారుల ఆగడాల ముందు కోట్ల సంఖ్యలోని తెలంగాణ వాసులు బలియై పోతున్నారు.

'గొర్రెలు తినేవాడు పోయి బర్రెలు తినేవాడు వచ్చినట్లు' నిజాం స్థానంలో ఆంధ్ర పాలకులు వచ్చారు. 'కసాయికన్నా కనికరం ఉంటుందేమో' కాని అపాటి కనికరం కూడా వీరికి లేదు. తెలుగుజాతి ఒక్కటైతే ఆ జాతికే నిండుదనం వస్తుందని, మాయమాటలు చెప్పి మాయ చేశారు. దోపిడీదారులుగా వారు, దోపిడీపీడితులుగా మనం మిగిలిపోయాం. వాములు మేసేవారికి పచ్చగడ్డి ఫలహారం అన్నట్లు ఆంధ్రా పాలకుల అవినీతికి తెలంగాణ కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు పంటిక్రిందికే చాలడం లేదు.

విలీనం తర్వాత ఒక ప్రాంతం కోటీశ్వరులకు నిలయంగా మార. . , మరో ప్రాంతం ఆకలి చావులకు కేంద్ర బిందువయింది చుట్టంగా వచ్చిన తెలంగాణేతరులు చట్టం చాటున బరితెగించి ప్రవర్తిస్తూ తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా, పట్టపగలే దోచుకుంటున్నారు ఆంధ్రులు జలవనరులున్న భూస్వాములు, వ్యాపారులు, ఉద్యోగులు అని మూడు ముఖ్యమైన వర్గాలుగా స్థిరపడగా, తెలంగాణ వాసులు మాత్రం ప్రకృతిపై ఆధారపడిన రైతులు, కూలీలు, నిరుద్యోగులుగా బ్రతుకులను వెళ్ళదీస్తున్నారు.

విశాలాంధ్ర ఏర్పాటు తెలంగాణ విషాదానికే దారితీసింది. తెలంగాణ ప్రజల్లో వ్యాపార దృక్పథం లేకపోవడం, మాటకారితనం లేకపోవడం, మొహాలకు చిరునవ్వులు పులుముకోలేకపోవడం, నటించడం చేతకాలేకపోవడం, ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టే స్వభావం లేకపోవడం లాంటివన్నీ ఆంధ్రుల దోపిడీలను పెంచడానికే దోహదపడ్డాయి నీటిసౌకర్యం లేక, విద్యుచ్ఛక్తిలేక, ఉన్న చెరువులకు మరమ్మతులు లేక తెలంగాణలోని ఒకప్పటి మాగాణి భూములు మెట్టభూములుగా, మెట్టభూములు బీడుభూములుగా, బీడుభూములు ఎడారులుగా మారిపోతున్నాయి. ఫలితంగా కన్నకూతుళ్ళనే అమ్ముకునే స్థితి ఓవైపు, ప్రేమతో పెంచుకున్న పశువులను కసాయిలకు అమ్ముకునే దుస్థితి మరోవైపు ఎదురైంది

అందరినీ సమానం చేస్తామని ఒట్టు-ఎక్కించారు ఇంతకాలం మునగచెట్టు

# వివిధ ఉద్యమాలు

## ముల్కి ఉద్యమం

ముల్కి ఉద్యమానికి బహుకాల చరిత్ర ఉన్నా స్వాతంత్ర్య కాలంకన్నా పూర్వపు చరిత్రలో మనకు సంబంధం లేదు. ప్రస్తుత తెలంగాణ విద్యావంతుల నోటికాడ బుక్కను లాక్కున్న ఆంధ్రుల ఆధిపత్యాన్ని ప్రశ్నించడానికి మాత్రమే తెలంగాణ వాసులు నడిపించిన ముల్కి ఉద్యమాన్నే ప్రస్తుతం గుర్తు చేసుకోవాల్సి ఉన్నది


నిజాం నుండి తెలంగాణకు విముక్తి లభించిన తర్వాత 1948 నుండి 1952వరకు నాలుగేళ్ళపాటు ప్రజాప్రభుత్వం ఏర్పడనందున మిలిటరి, సివిల్ అధికారుల పాలన కాలాన్ని సంధికాలంగా చెప్పుకోవాలి. ఈ సంధి కాలంలోనే మదరాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతానికి చెందిన అనేకమంది ఇక్కడకు వచ్చి ఉద్యోగాలను దక్కించుకున్నారు. సివిల్, మిలిటరీ అధికారుల పాలనలో వలసలు నిరాటంకంగా కొనసాగాయి. తెలంగాణ వారికి ఇంగ్లీషు రాదన్న కుంటిసాకుతో పాలకులు విచక్షణారహితంగా ఆంధ్రులతో ఉద్యోగాలను నింపారు ఒకసారి ఉద్యోగంలో నియమించబడ్డ ఆంధ్రులు తమవారిని పిలిపించుకొని మరిన్ని ఉద్యోగాలను తమవారికే కట్టబెట్టారు. ఇది నేటికి కొనసాగుతున్న తంతే పొట్టచేతపట్టుకొని ఇక్కడకు వచ్చిన ఆంధ్రులు కొద్దికాలంలోనే ఉద్యోగాలలో స్థిరపడి ఇక్కడి ప్రజలపై అధికార గర్వాన్ని ప్రదర్శించడం మొదలుపెట్టారు పైగా ఇక్కడి ప్రజల వేషభాషలను, ఆహార విహారాలను బాహాటంగానే ఈసడించడం మొదలుపెట్టారు. తమను తాము సంఘసంస్కర్తలుగా వర్ణించుకొని నిరక్షరాస్యత, పేదరికంతో మగ్గుతున్న తెలంగాణ ప్రజలపై ఆధిక్యతను ప్రదర్శించి వారిని లొంగదీసుకున్నారు. తమ ఆత్మగౌరవానికి భంగం ఏర్పడిందని గుర్తించినప్పుడల్లా ఉద్యమాలు చేయడం తెలంగాణ ప్రజలకు కొత్తకాదు. ముల్కి నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ ఆంధ్రులు దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను దక్కించుకోవడం ఇక్కడి మేధావులు త్వరగానే పసిగట్టారు ఫలితంగా గైర్ గోబ్యాక్ ఉద్యమం పుట్టుకొచ్చి, తీవ్రరూపం దాల్చింది ఇడ్లీ సాంబార్ గోబ్యాక్, గోంగూర పచ్చడి గోబ్యాక్ లాంటి నినాదాలు ఈ ఉద్యమంలోంచే పుట్టుకొచ్చాయి. ఈ ఉద్యమంలో విద్యార్థుల నిరసన జ్వాలల్లో నాటి ముఖ్యమంత్రి బూర్గుల కారే దహనం చేయబడిందంటే సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే తెలంగాణవాసులపై ఆంధ్రుల మోసాలు ఎంత తీవ్రంగా ఉండినాయో అర్థం చేసుకోవచ్చు.

గైర్ ముల్కి గోబ్యాక్ ఉద్యమాన్ని గూర్చి పూర్తిగా తెలుసుకున్న నాటి ప్రధాని నెహ్రూ విశాలాంధ్ర వాదాన్ని ముందుకు తెచ్చిన సందర్భంలో వ్యాఖ్యానిస్తూ విశాలాంధ్ర ఏర్పాటువాదం వెనుక దురాక్రమణతో కూడిన సామ్రాజ్యవాదం దాగి ఉందని వ్యాఖ్యానించారు.

## ప్రత్యేక తెలంగాణ ఉద్యమం - 1969

1956 నుండి 1969 వరకు తెలంగాణ ప్రాంతంలో ఆంధ్రులు పెద్ద స్థాయిలో వ్యవసాయ భూములను కొనుగోలు చేయడం, వ్యాపారాలన్నింటిని హస్తగతం చేసుకోవడం, పట్టణాలలో ఇళ్ళస్థలాలను గుండు గుత్తగా చేజిక్కించుకోవడం, ఉద్యోగాలన్నింటిలో పెద్దవాటా దక్కించుకోవడం, ప్రత్యేక కాలనీలను ఏర్పాటు చేసుకోవడం లాంటి వాటిలో తమ కుతంత్రాలను ప్రదర్శించారు. ఎప్పటికప్పుడు మోసాలను పసిగట్టిన తెలంగాణవాసులు అడపా దడపా నిలదీస్తున్నప్పటికి 1969లో పుట్టిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమమే చెప్పుకోదగింది

1969 ఉద్యమంగా పేరుగాంచిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వాస్తవానికి 1968 డిసెంబర్ 6న హైదరాబాద్ వివేకవర్ధని కళాశాల నుండి ఊరేగింపుతో ప్రారంభమైంది. ఊరేగింపును చెదరగొట్టడానికి చేసిన లారీఛార్జిలో అనేకమంది విద్యార్థులు గాయపడటంతో ఉద్యమం జిల్లాలకు విస్తరించింది ఉద్యమానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు సంయుక్తంగా తలపెట్టిన సమావేశానికి నిరసన తెలిపే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు పోలీసుల కాల్పుల్లో మరణించడంతో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది 1969 మే 1న రాజ్‌భవన్‌కు ర్యాలీ నిర్వహించడం ఉద్యమ చరిత్రలోనే పెద్ద మలుపు. ప్రభుత్వం ఆ ర్యాలీని నిషేధించినా ఉద్యమ నాయకులు ధైర్యంతో ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కొండా వెంకట రంగారెడ్డి "బానిస బ్రతుకుకంటే చావే మంచిది" అని ఇచ్చిన సందేశం ఉద్యమకారుల మీద మంత్రంలా పనిచేసింది ఫలితంగా రక్తం చిందించైనా ర్యాలీని నిర్వహించాలనిప్రాణాలకు తెగించి ఎంతోమంది ముందుకు వచ్చారు. ఊహించినట్లుగానే తెలంగాణ వీరులు రక్తాన్ని చిందించాల్సి వచ్చింది ఉద్యమం నడిచిన తీరును ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే.. .



అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పాలమూరు శిల్పి ఎక్కా యాదగిరి రావు చెక్కిన తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం

ఉద్యమం ప్రారంభమైన తర్వాత ఆరు నెలలకు మే 21న ఉద్యమంతో సంబంధమేలేని చెన్నారెడ్డి

మదన్‌మోహన్ నుండి సారధ్యాన్ని స్వీకరించాడు. చెన్నారెడ్డికి పగ్గాలప్పజెప్పడం తెలంగాణ ఉద్యమానికి 'శల్య సారధ్యం'లాంటి దౌర్భాగ్యమని ఆనాడే కొందరు బహిరంగంగా ప్రకటించారు. చెన్నారెడ్డి అధ్యక్షతన 1971 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో తెలంగాణ ప్రజాసమితి ఘనవిజయం సాధించి 11మంది పార్లమెంటు సభ్యులను గెలిపించుకొన్నది. కానీ, విచిత్రంగా తెలంగాణ ప్రజాసమితిని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడంతో విద్యార్థులు సమితి కార్యాలయాన్ని ముట్టడించారు. చెన్నారెడ్డి ప్రాణభయంతో తప్పించుకొని పారిపోవాల్సి వచ్చింది. ముందే కొందరు పెద్దలు ఊహించినట్లుగా తెలంగాణ ప్రజాసమితిని చెన్నారెడ్డి కాంగ్రెస్‌లో కలపడం ఆయన తెలంగాణకు చేసిన అతి పెద్ద ద్రోహం. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించలేకపోయినప్పటికి ప్రజాసమితిని కాంగ్రెస్‌లో కలపకుండా ఉండివుంటే కనీసం గౌరవమైనా దక్కివుండేది. అదృష్టవశాత్తు ముల్కి నిబంధనలపై తెలంగాణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడటం, జై ఆంధ్ర ఉద్యమం పుంజుకోవడం చెన్నారెడ్డి చేసిన ద్రోహాన్ని తొందరగా మరచిపోయేలా చేశాయి.

ఈ ఉద్యమంలో గాంధీజీ అనుచరులమని గొప్పలు చెప్పుకునే నాయకులే కాంగ్రెస్ నీడలో తెలంగాణ ఉద్యమంలో నెత్తుటేరులు పారించారు. నాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి నిరంకుశ పాలనకు సుమారు 400మంది ఉద్యమకారులు ప్రాణాలర్పించారు. లక్షలాది తెలంగాణవాసులను జైళ్ళలో నింపారు. తెలంగాణ జైళ్ళు కిక్కిరిసి పోవడంతో రాజమండ్రి, విశాఖపట్నం లాంటి ఆంధ్ర జైళ్ళకు కూడా తరలించారు. 400 మంది తెలంగాణ అమరవీరులందరికి కలిసి మదరాసు రాష్ట్రానికి వ్యతిరేకంగా పోరాడిన పొట్టిశ్రీరాములుకు దక్కిన గౌరవంలో ఒక్కశాతం గౌరవం కూడా దక్కలేదు. నాటి ఉద్యమ నాయకుడు డా॥చెన్నారెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర నాయకుల కుయుక్తులకు తలొగ్గి, తెలంగాణ జాతి తల నరికి బంగారు పళ్ళెంలో పెట్టి కేంద్రానికి సమర్పించి, ఆంధ్రులకు బంగారు పళ్ళాన్ని అందించాడని అంటుంటారు. ఫలితంగానే నజరానా రూపంలో గవర్నర్ పదవి దక్కిందంటారు కానీ, నేటి తెలంగాణ ప్రజలు అనాడున్నంత అమాయకులుగా లేరు. అవసరమైతే తమ తల నరకడానికొచ్చే ఉద్యమ నాయకుల తలనైనా నరికి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకునేంత రాటుదేలి ఉన్నారు.

| | |
|---|---|
| కలిసుందామని ఆనాడు మొక్కులు<br>సరి చేసుకుందామని అన్నీ లెక్కలు<br>తెరిచి చూపలేదు ఈనాటికీ బుక్కులు<br>ఎంతైనా తెలివిలో వారే నక్కలు | కోస్తాంధ్ర పైనే పాలకుల భక్తి<br>తెలంగాణ ప్రజలకు లేదు భూమి<br>ఆంధ్రాపాలకులదంతా కుయుక్తి<br>కావలసిందే మనకు విముక్తి |

ఆర్థికం : అగ్రభాగాన కుప్పం - తెలంగాణకు తప్పదు మరింత కష్టం

## అఖిలపక్ష ఒప్పందం

ఉద్యమ తీవ్రతను గమనించిన ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి జనవరి 19న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కు పంపిస్తామని, తెలంగాణ మిగులు నిధులను తేల్చడానికి సీనియర్ అధికారిని నియమిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించినా, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ వాటిని కొట్టేస్తూ ప్రత్యేక రాష్ట్రమే తమ ఏకైక లక్ష్యమని ప్రకటించారు. ఈ అఖిలపక్ష సమావేశంలో కుదిరిన ఒప్పందం ఫలితంగా తేల్చిన లెక్కల్లో ఆనాటివరకు పనిచేస్తున్న 4500గైర్ ముల్కీలను వెనక్కు పంపించే జీ.వో, విడుదల చేయగా ఆ జీవోను హైకోర్టు, సుప్రీంకోర్టులు తప్పు పట్టినందున, ఆ నష్టాన్ని పూడ్చేందుకు కొత్తగా 2000 ఉద్యోగాలను తెలంగాణ వారికి కల్పించారు. ఇక తెలంగాణ మిగులు నిధులు 34 10కోట్లుగా తేలినా ఆ నివేదిక ప్రచురణకు నోచుకోలేదు.

***అఖిలపక్ష ఒప్పందం ఉల్లంఘనలు***

1 నిబంధనలకు వ్యతిరేకంగా చేరినవారిని ఉద్యోగాల నుండి తొలగించాలి (ఇప్పటివరకు ఒక్కరిని కూడా తొలగించలేదు.)

2. తప్పుడు ముల్కి సర్టిఫికెట్‌లను సమర్పించిన వారిని విచారించి, శిక్షించాలి. (విచారించిందే లేనప్పుడు శిక్షించడమెక్కడిది?)

3 స్థానిక సంస్థలకు ముల్కి నిబంధనలను విస్తరించాలి. (ప్రభుత్వ సంస్థలలోనే దిక్కులేదంటే స్థానిక సంస్థలలో వేరే చెప్పాలా?)

4. సీనియారిటినీ నిర్ణయించడంలో న్యాయస్థానాల తీర్పులను గౌరవించాలి. (న్యాయస్థానాలను సంప్రదించారేగాని తీర్పులను గౌరవించలేదు)

5. ఆంధ్ర ప్రాంతానికి వెచ్చించిన తెలంగాణ నిధులను లెక్కించి, రాబోయే కాలంలో తెలంగాణకు కేటాయించాలి.

(తెలంగాణ మిగులునే తేల్చలేదు. అందుకే కేటాయించే ప్రశ్న ఉదయించలేదు)

6. రాజధాని నగరంలో విద్య వసతులను పెంచాలి.

(ప్రభుత్వ రంగంలో పెంచలేకపోయారుకాని ప్రైవేటురంగంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి)

**ఆంధ్రుల పాలన తీరు తీరు - ప్రజల రాతలు తారుమారు**

ఎలాగైతేనేమి తెలంగాణ ఉద్యమం సద్దుమణిగింది. 1971లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించి, తెలంగాణ ప్రత్యే రాష్ట్ర నినాదంతో ఎన్నికల బరిలో దిగిన తెలంగాణ ప్రజాసమితికి బ్రహ్మరథం పడుతూ 10 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించారు. దీనితో తెలంగాణ ప్రజలంతా ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నారని లోకానికి వెల్లడైంది దురదృష్టవశాత్తు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రజల తీర్పును కాలరాశారు ఆంధ్రనాయకుల గారడీ విద్యలకు ఆమె లొంగిపోవడంతో ఆంధ్రా కాంగ్రెస్ మాత్రమే మోసం చేస్తున్నదని భావించే స్థానాన్ని మొత్తం కాంగ్రెస్ పార్టీయే మోసం చేసిందని చెప్పుకునేలా చేసింది. ప్రజాసమితి పేరుతో గెలిచిన ఎంపీలను ఎరవేసి కాంగ్రెస్ పార్టీలో కలుపుకొని ఆ పార్టీ దగా చేసింది ఆ ఉద్యమంలోంచి పుట్టుకొచ్చి, రాజకీయ నాయకులుగా ఎదిగిన వారంతా నేడు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి శల్య సారథ్యం వహిస్తున్నారు,

**జై ఆంధ్ర ఉద్యమం 1972 :** జరిగే వరకు జయభేరి, జరగకపోతే రణభేరి అన్నట్లు జరిగినంత కాలం తెలంగాణ వనరులను విజయవంతంగా కొల్లగొట్టారు. ముల్కి నిబంధనల చెల్లుబాటులో సుప్రీంకోర్టు తెలంగాణకు అనుకూలంగా తీర్పునివ్వటంతో తమ దోపిడీకి అడ్డు తగిలినట్టు భావించిన ఆంధ్రులు 'జై ఆంధ్ర' ఉద్యమంతో రణభేరి మోగించారు. ముల్కి నిబంధనలు చెల్లుబాటయ్యేటట్లయితే ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని ఆంధ్రులు ఉద్యమించారు. తెన్నేటి విశ్వనాథం, గౌతులచ్చన్న నాయకత్వంలో జై ఆంధ్ర ఉద్యమం ఊపందుకోవడంతో రెండు వేర్వేరు రాష్ట్రాలను ఏర్పరిచే ఉద్దేశంతో సంయుక్త కమిటీనొకదానిని ఏర్పరిచారు. కానీ తెలంగాణకు కల్పించిన రక్షణలన్నీ తొలగిస్తున్నట్లు కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో జై ఆంధ్రా ఉద్యమ నాయకులు వెనకకు తగ్గారు అరు సూత్రాల పథకాన్ని ముందుకు తేవడంతో తెలంగాణ ఉద్యమ నాయకులు కూడా వెనకకు తగ్గారు.

తెలంగాణ ఉద్యమంలో ఎందరినో పొట్టన పెట్టుకున్న పాలకులు జై ఆంధ్రా ఉద్యమానికి సహకరించినందువలన రక్తపు బొట్టు చిందకుండా అనుకున్నవన్నీ సాధించగలిగారు. ఈ ఉద్యమంలో ఆంధ్రులు చనిపోలేదు కాని, కోస్తాలో స్థిరపడిన ఇద్దరు తెలంగాణ వారిని సజీవ దహనం చెయ్యడం ఆంధ్రుల దుష్టత్వాన్ని ఎత్తిచూపింది ఇక్కడ ఎంతోమంది ఆంధ్రులు స్థిరపడినా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఏ ఒక్క ఆంధ్రునికి అపకారం తలపెట్టకపోవడం గమనార్హం.

కాని సుప్రీం కోర్టు ముల్కి నిబంధనలు చెల్లుబాటేనని చారిత్రాత్మకమైన తీర్పు ఇవ్వడంతో ఆంధ్రులలో కలకలం బయలుదేరింది. ముల్కి నిబంధనలు చెల్లుబాటు అయ్యేటట్లు అయితే ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని జైఆంధ్ర ఉద్యమాన్ని చేపట్టారు. ఈ ఉద్యమానికి ఆంధ్రులంతా సమైక్యంగా అండగా నిలబడ్డారు. ఆఖరికి ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్యగారు కూడా ఈ ఉద్యమానికి మద్దతునిచ్చారు. రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడులు ఆ ఉద్యమంలో పుట్టుకువచ్చి, నాయకులుగా ఎదిగినవారే. ఆ ఉద్యమాన్ని చల్లబరచడానికి ఆనాటి కేంద్ర ప్రభుత్వం అరుసూత్రాల పథకాన్ని ప్రకటించింది. ఆరుసూత్రాల పథకంతో జైఆంధ్ర ఉద్యమం ఆగిపోయింది కాని, తెలంగాణ మాత్రం చెప్పలేనంత నష్టపోయింది.

మూడు నెలలపాటు నడిచిన జైఆంధ్ర ఉద్యమం మూడు సంవత్సరాలు నడిచిన తెలంగాణ ఉద్యమం కంటే వైషమ్యాలను ఎక్కువగా పెంచింది. ఈ ఉద్యమంలో భాగంగా నాటి ప్రభుత్వంలోని 9మంది ఆంధ్ర ప్రాంతపు మంత్రులు రాజీనామాలు చేశారు. పార్లమెంటు సభ్యుడు టి.పాపిరెడ్డి 'గుంటూరు రైల్వేస్టేషన్‌ను తగులబెట్టలేకపోతే మరో చిన్న రైల్వేస్టేషన్‌నైనా తగులబెట్టండ'ని ఉద్బోధించాడు. ఆంధ్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ తెలంగాణ ప్రాంతానికి బియ్యం ఎగుమతులను ఆపివెయ్యాలని నిర్ణయించారు. స్వతంత్ర పార్టీ అగ్రనాయకుడు గౌతులచ్చన్న 'ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వకపోతే 600మైళ్ళ పొడవుగల సముద్ర తీరంతో భారత యూనియన్‌తో సంబంధంలేని స్వతంత్ర అంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరుచుకుంటాము' అని వాచ్చరించాడు. కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీలో ఏర్పరిచిన సమావేశాన్ని ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు బహిష్కరించారు.

ఈ ఉద్యమ సందర్భంగా మాజీ ప్రధాని, నాటి జనసంఘ్ ప్రధాన నేత అటల్ బిహారీ వాజ్‌పాయి ఆనాడు స్పందిస్తూ, "పంజాబును విడదీయడానికి, ఈశాన్య రాష్ట్రాలను ఏర్పాటు చేయడానికి సహకరించిన కమ్యూనిస్టులు ఆంధ్రప్రదేశ్‌లో సమైక్య రాష్ట్రాన్ని కోరడం బూటకమే" అని చెబుతూ "హిందీ మాట్లాడే ప్రజలు పలు రాష్ట్రాలను ఏర్పాటు చేసుకొని ఎటువంటి వైషమ్యాలు లేకుండా జీవనాన్ని వెల్లదీస్తుండగా, ఆంధ్రప్రదేశ్ విడిపోవడం వల్ల కూడా ఎటువంటి నష్టం జరుగదని వ్యాఖ్యానించడం గమనార్హం.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాలను చల్లబర్చడానికి ఆరుసూత్రాల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆరు సూత్రాల పథకంతో ఉద్యమాలు ఆగిపోయాయి కానీ, తెలంగాణ మాత్రం చెప్పలేనంత నష్టపోయింది.

## వేర్పాటువాదంపై బాబు యుద్ధం-జై అంధ్ర ఉద్యమంలో వేర్పాటుకే సిద్ధం

## ఆరుసూత్రాల పథకం వల్ల తెలంగాణకు జరిగిన నష్టాలు

★ ముల్కి నిబంధనలు రద్దు.

★ తెలంగాణ ప్రాంతీయ కమిటీ రద్దు.

★ హైదరాబాద్‌పై తెలంగాణ ప్రజలు పట్టుకోల్పోవడం.

★ నివాస పరిమితిని పదిహేను సంవత్సరాల నుండి నాలుగు సంవత్సరాలకు తగ్గించడం

ఆంధ్ర, తెలంగాణలకు చెందిన ఆదాయ వ్యయాలను విడిగా చూపే పద్ధతిని రద్దు చేయడం

ఈ పథకంలోని ఆంధ్రులకు అనుకూలమైన నిబంధనలన్నీ పొల్లుపోకుండా కాలయాపన లేకుండా అమలు చేయబడగా, తెలంగాణకు అనుకూలంగా ఉన్న నిబంధనలు అమలుకు నోచుకోలేదు. విశాలాంధ్ర ఏర్పాటు తర్వాత కుదుర్చుకున్న ఒప్పందాలలోకెల్లా ఆరుసూత్రాల పథకమే ఆంధ్రులకు అత్యధికంగా మేలును చేకూర్చగా తెలంగాణకు కష్టనష్టాలు పెంచింది.




భాషకు యాస శ్వాసవంటిది. ఆ యాసను నొక్కిపడితే శ్వాస ఆగిపోదా? చాయ్ అంటే తప్పు - టీ అంటే రైటా? సిలిసిలా అంటే తప్పు - సీరియల్ అంటే రైటా? దరఖాస్తు అంటే తప్పు - అప్లికేషన్ అంటే రైటా?

- కాళోజి నారాయణరావు

# వివిధ రంగాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలు

## విద్యారంగంలో లోటుపాట్లు

ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్సుకాలేజి



రాష్ట్ర జనాభాలో 40శాతం జనాభా ఉన్న తెలంగాణలో 25% మాత్రమే విద్యా సంస్థలున్నాయి. ఇక్కడ రెండు మెడికల్ కాలేజీలే ఉన్నాయి. ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 15% మాత్రమే ఉన్నాయి 72 ఐ టి.ఐ.లలో 26, 91 పాలిటెక్నిక్‌లలో 20 మాత్రమే ఉన్నాయి. 1956 నుండి ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలకు ఖర్చుచేసిన 1150కోట్లలో తెలంగాణకు 10.43% దక్కగా, ఆంధ్రకు 73.71% దక్కడం పక్షపాతమే. ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఖర్చులో ఆంధ్రకు 62 71% దక్కగా, తెలంగాణకు కేవలం 9 45% మాత్రమే.

పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, నర్సింగ్ స్కూల్‌లు మొదలగు వాటినన్నింటిని స్థాపించడంలో తెలంగాణను మోసమే చేశారు. ఈ మోసాల ఫలితంగా దేశంలోనే అక్షరాస్యతలో అట్టడుగున ఉన్నదని చెప్పుకుంటున్న బీహార్ రాష్ట్రంకన్నా తెలంగాణ వెనుకబడిపోయి ఉన్నది. ప్రభుత్వ ఖర్చుతో నడిచే విద్యాసంస్థలన్నీ ఆంధ్రా, రాయలసీమలలో ఉండగా, వ్యాపారాత్మక దృష్టితో నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు తెలంగాణ అంతటా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

రాష్ట్రంలో ప్రాంతీయ పరిధి కలిగిన ఆరు విశ్వవిద్యాలయాలలో కోస్తా ఆంధ్రలో రెండు, రాయలసీమలో రెండు, తెలంగాణలో ఒకటి, రాజధానిలో ఒకటి ఉన్నాయి హైదరాబాదును ఫ్రీజోన్‌గా ప్రకటించినందున ఇక్కడి సంస్థలను తెలంగాణ ఖాతా క్రింద జమకట్టడానికి వీలులేదు. ఇవిగాక రాష్ట్రవ్యాప్త పరిధిగల విశ్వవిద్యాలయాలలో మహిళా విశ్వవిద్యాలయం, ద్రావిడ భాషల విశ్వవిద్యాలయాలు రాయలసీమలో ఉండగా, ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం విజయవాడలో ఉన్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలైన సంస్కృతి విశ్వవిద్యాలయం, సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలు కూడా రాయలసీమలోనే ఉన్నాయి ఇవిపోను మిగిలిన అన్ని విశ్వవిద్యాలయాలు, ఆ స్థాయి సంస్థలు, ఒక్క కాకతీయ విశ్వవిద్యాలయం తప్ప, రాజధాని నగరంలోనే ఉన్నాయి. వరంగల్‌లో స్థాపించిన సాంకేతిక

**విశ్వ విద్యాలయాలు మనవైతే – వైస్ ఛాన్సలర్‌లు వారు**

విశ్వవిద్యాలయాన్ని రాజధానికే తరలించారు. నల్గొండలో స్థాపించాలని శంకుస్థాపన చేసిన సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని కూడా రాజధానికే తరలించారు. ఒక్కమాటలో చెప్పాలంటే విశ్వవిద్యాలయాలు, ఆ స్థాయికి చెందిన మొత్తం 21 సంస్థలలో ఆంధ్ర రాయలసీమల్లో 10, రాష్ట్ర రాజధానిలో 10, తెలంగాణలో 1 మాత్రమే ఉన్నాయి. ఇటీవలే మరో మూడు విశ్వవిద్యాలయాలను స్థాపించాలని దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంలో కూడా పక్షపాతమే దాగిఉన్నది. ఆంధ్ర రాష్ట్రం నుండి వచ్చి కలిసిన కోస్తాంధ్ర రాయలసీమ ప్రాంతాలను రెండు ప్రాంతాలుగా చూపించి రెండు విశ్వవిద్యాలయాలను అక్కడ స్థాపించాలని నిర్ణయించగా 4 జిల్లాల రాయలసీమతో తెలంగాణను జమకడుతూ, ఇప్పటికే అక్కడ ఉన్న అధిక విశ్వవిద్యాలయాలను పరిగణనలోకి తీసుకోకుండా తెలంగాణకు ఒక విశ్వవిద్యాలయాన్ని మాత్రం కేటాయించారు.

ఇక్కడి సంస్థలలోని వైస్-చాన్స్‌లర్‌లు, ప్రిన్సిపాల్‌లు, అధికారులు, ఉద్యోగులలో అధిక భాగం ఆంధ్రులే కాగా, అక్కడి సంస్థలలో తెలంగాణ వారికి కనీసం అటెండర్‌లాంటి పోస్టులు కూడా దక్కలేదు. ఇక్కడ కూడా మనవారికి దక్కింది స్వీపర్లు, అటెండర్‌లు, క్లర్కులు లాంటి ఉద్యోగాలే. అందులో కూడా ఆంధ్రులు లేరని చెప్పలేం. రాజధానిలో ఉన్న, రాష్ట్రవ్యాప్త పరిధి కలిగిన యూనివర్సిటీలలో తెలంగాణకి చెందినవారు 10శాతంలోపే ఉండగా తెలంగాణేతరులు 90శాతంపైగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రా, రాయలసీమలలోని విశ్వవిద్యాలయాలలో ఆ ప్రాంతానికి చెందినవారే 99శాతం కాగా, ఒక్కశాతం కూడా తెలంగాణ వారు ఉన్నట్లు దాఖలాలు లేవు.

ఆంధ్ర ప్రాంతంలో లక్షమంది జనాభాకు, రాయలసీమలో 70వేల జనాభాకు ఒక జూనియర్ కళాశాల ఉండగా, తెలంగాణలో మాత్రం ఆరులక్షల జనాభాకు ఒక జూనియర్ కళాశాలను ఏర్పర్చడం దోపిడీ విధానంలో భాగమే. లక్షా డెబ్బైవేల మందికి ఒక డిగ్రీ కళాశాల ఆ రెండు ప్రాంతాలలో ఉండగా, మూడు లక్షల డెబ్బై వేల మందికి ఒక డిగ్రీ కళాశాల తెలంగాణలో ఉన్నది. వెయ్యి జనాభాకే ఒక్క ప్రాథమిక పాఠశాల అక్కడ ఉండగా, రెండువేల జనాభాకు ఒకటి ఇక్కడ ఉన్నది.

సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాత 1976లో గుంటూరులో నాగార్జున యూనివర్సిటీ, 1978లో అనంతపూర్‌లో కృష్ణదేవరాయ యూనివర్సిటీ, 1983లో తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, 1985లో తిరుపతిలో సంస్కృతి విశ్వవిద్యాలయం, 1986లో విజయవాడలో వైద్య, ఆరోగ్య శాస్త్రాల యూనివర్సిటీ, 1981లో అనంతపూర్‌లో సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ, ఈమధ్యే కుప్పంలో (చిత్తూరు) ద్రావిడ భాషల విశ్వవిద్యాలయాలు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో స్థాపించారు. 1976లో వరంగల్‌లో స్థాపించిన కాకతీయ విశ్వవిద్యాలయం తప్ప

మరే విశ్వవిద్యాలయం తెలంగాణ జిల్లాల్లో స్థాపించలేదు. హైదరాబాద్‌లో 1964లో వ్యవసాయ విశ్వవిద్యాలయం, 1982లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, 1974లో సెంట్రల్ యూనివర్సిటీ, 1985లో తెలుగు విశ్వవిద్యాలయం, 1962లో ఫారిన్ లాంగ్వేజస్ సంస్థలు స్థాపించడమైనది. సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏకంగా 8 విశ్వవిద్యాలయ స్థాయి సంస్థలను ఆంధ్ర, రాయలసీమల్లో నెలకొల్పగా, రాష్ట్ర రాజధానిలో కూడా 4 లేదా 5 సంస్థలకన్న మించలేదు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ శాఖలు బాపట్లలో 1, తిరుపతిలో 1 ఉండగా, సాంకేతిక విశ్వవిద్యాలయ శాఖలు కాకినాడలో 1, తిరుపతిలో 1 ఉన్నాయి. ఇలాంటి శాఖలు తెలంగాణ జిల్లాల్లో అసలే లేవు. ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న 9 వైద్య కళాశాలల్లో కోస్తా-ఆంధ్రలో 4, రాయలసీమలో 2, రాజధానిలో 2, తెలంగాణలో 1 ఉన్నాయి. ప్రభుత్వరంగంలో ఉన్న 3 నర్సింగ్ కళాశాలల్లో కోస్తాంధ్రలో ఒకటి, రాయలసీమలో ఒకటి, రాజధానిలో ఒకటి ఉన్నాయి.

మొత్తం ఎయిడెడ్ విద్యాసంస్థలలో 87శాతం కోస్తా రాయలసీమల్లో ఉండగా 13శాతం మాత్రమే తెలంగాణలో ఉన్నందున కేటాయింపుల్లో ఆంధ్రకు అధికంగా చెందాయని చెప్పవచ్చు.

## వైద్యరంగంలో పక్షపాతం



సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే ఇక్కడ ఉస్మానియా, గాంధీ, నిజాం, నీలోఫర్, కోరంటి, యునాని, ప్రసూతి ఆసుపత్రులు నిర్మించబడి ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడ్డాయి. అయితే విశాలాంధ్ర ఏర్పాటు తర్వాత క్రమక్రమంగా పాలకుల వివక్షవల్ల ఈ వ్యవస్థను నాశనం చేశారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాతే వైద్యవ్యవస్థకు గ్రహణం పట్టింది. నిజాం ఆసుపత్రిని పేదలకు అందని ద్రాక్షపండులా మార్చగా, మిగతా ఆసుపత్రులన్నింటిని ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. సామాన్యులకు అందుబాటులో లేని అపోలో, సిడిఆర్, కామినేని, యశోద లాంటి కార్పోరేట్ ఆసుపత్రులు ఇబ్బడిముబ్బడిగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మధ్యతరగతి వారికే అందుబాటులో లేని ఈ ఆసుపత్రులు బీదవారికి గొడ్డుటావులే. నిరంకుశుడైన నిజాం నవాబు ప్రజారోగ్యంపై చూపించినంత శ్రద్ధ, ప్రజాస్వామ్య ప్రభుత్వంగా చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వాలు చూపించలేకపోయాయి.

ప్రభుత్వాసుపత్రులు మనవైతే - డాక్టర్లు వాళ్ళు

ఎంతోకాలం నుండి సేవలందిస్తూ వస్తున్న ఆసుపత్రులన్నింటిని నిధుల లేమికి గురిచేసి, ప్రభుత్వ ఆసుపత్రుల స్థానంలో కార్పొరేట్ రంగానికి పట్టం కట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులుండవు డాక్టర్లుండరు వసతులుండవు. చివరికి వీటిని కేవలం పోస్టుమార్టం ఆసుపత్రులుగా మాత్రమే మిగిల్చారు ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులను నరకకూపాలుగా సామాన్య జనం చెప్పుకుంటున్నారు ప్రభుత్వ ఆసుపత్రులు వైద్యసేవలను అందించలేకపోవడం, స్టార్ ఆసుపత్రుల విపరీతమైన ఖర్చులను భరించలేకపోవడం మధ్యన సామాన్య జనం దేవునిపై భారం వేసి రోగాలతో కుమిలిపోతున్నారు కొంతమంది తాహతుకు మించి అప్పులు చేసి కార్పొరేట్ ఆసుపత్రులవైపు పరుగెత్తి, అప్పుల్లో మునిగి జీవచ్ఛవాలుగా బ్రతుకులను వెళ్ళదీస్తున్నారు విచిత్రమేమంటే కార్పొరేట్ ఆసుపత్రులన్నీ ఆంధ్రులకు చెందినవే కాగా, ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా డాక్టర్లు, ప్రధాన సిబ్బందిలో ఎక్కువశాతం ఆంధ్రులే

పేదలకు రెండు రూపాయలకు ఒక కిలో బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేసిన ఈ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులకు మాత్రం కార్పొరేట్ ఆసుపత్రుల వైద్య ఖర్చులను భరించడానికి ముందుకు రావడం విడ్డూరం. 1956 నుండి తెలంగాణలో ఒక్క జనరల్ ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేయలేదు తెలంగాణకు కేటాయించిన నిధుల నుండి ఉమ్మడి ప్రాంతాల ప్రజల అవసరాలను నెరవేరుస్తున్న ఉస్మానియా, గాంధీలాంటి ప్రభుత్వ ఆసుపత్రులకు అరకొర నిధులను అందజేస్తున్నారు వీటికి ఏయేటికాయేడు కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఇదే సమయంలో కార్పొరేట్ ఆసుపత్రులకు, నర్సింగ్ హోమ్‌లకు సబ్సిడీ ధరల్లో స్థలాలు, జాతీయ బ్యాంకుల ద్వారా ఋణాలు కల్పిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తున్నారు. ఉదాహరణకు అపోలో ఆసుపత్రికి ఎకరానికి మూడు లక్షల రూపాయల మార్కెట్ ధర ఉన్న భూమిని కేవలం ఎకరానికి ఎనిమిది వేల నాలుగు వందల రూపాయల (రూ. 8,400/-) చొప్పున 3 ఎకరాల భూమిని కేటాయించడం ద్వారా సుమారు కోటి రూపాయాలను కట్టబెట్టినట్లయ్యింది

ఏనాటినుండో ఉన్న ఇక్కడి ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలను విజయవాడలోని వైద్య విధాన పరిషత్‌కు అనుబంధ సంస్థలుగా మార్చారు. విజయవాడ, తిరుపతిలలో ఆరోగ్య శాస్త్రాల సంస్థలను స్థాపించడం వల్ల అక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి కాని, తెలంగాణలోని ఏ ఒక్క జిల్లా కూడా ఈ అదృష్టానికి నోచుకోలేదు.

| ఆసుపత్రులు | ఆంధ్ర | రాయలసీమ | తెలంగాణ |
|---|---|---|---|
| హోమియో ఆసుపత్రులు | 139 | 56 | 50 |
| స్త్రీ, శిశు ఆసుపత్రులు | 5 | 2 | 2 |
| ఆయుర్వేద ఆసుపత్రులు | 392 | 195 | 128 |
| వెటర్నరీ ఆసుపత్రులు | 120 | 50 | 90 |

## కోర్టులు మనవైతే - జడ్జీలు వాళ్ళు

## ఉద్యోగులలో ఆంధ్రుల గుత్తాధిపత్యం

వీరోచిత పోరాటాలకు, విప్లవోద్యమాలకు మారుపేరైన తెలంగాణ యువత నేడు నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయింది. ఆకలికేకలతో అలమటిస్తున్నది. రాష్ట్రంలోని ఉపాధి అవకాశాలన్నింటిలో కోస్తా, రాయలసీమవారి హడావిడే తప్ప తెలంగాణ వాసుల ఊసే వినిపించడం లేదు ఆరుసూత్రాల పథకం పేరున ముల్కి నిబంధనలను కాలరాసి, ఉద్యోగాలన్నింటిని గుండుగుత్తగా ఆంధ్రులే చేజిక్కించుకుని, తెలంగాణకు నిరుద్యోగాన్ని మిగిల్చారు.

ఆరుసూత్రాల పథకం రాకముందే తెలంగాణ వాసులకు దక్కాల్సిన 22వేల ఉద్యోగాలలో తెలంగాణేతరులు నియమించబడ్డారు. సెక్రటేరియట్ యేర్పాటు చేసినప్పుడు మరో 50వేల మందిని దిగుమతి చేసుకున్నారు. తెలంగాణ వారికి తెలుగు రాదని ఇంకో లక్ష ఉద్యోగాలను ఆంధ్ర-రాయలసీమ వారితో నింపారు. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పోరేషన్‌లను ముల్కితో నిమిత్తం లేకుండా తెలంగాణేతరులతో నింపేశారు.

తెలంగాణకు చెందిన విద్యావంతులంతా కేవలం ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజిలలో పేర్ల నమోదుకే పరిమితమైనారు. పరిశ్రమలలో పనిచేస్తున్నవారు కూడా రెండున్నర లక్షలమంది ఆంధ్రులేకాగా, లక్షలోపు మాత్రమే తెలంగాణ వారున్నారు. దినసరివేతనంతో కంపెనీలలో పనిచేసేవారిలో సహితం 67% ఆంధ్రులే కాగా 17% మాత్రం తెలంగాణకు చెందినవారు ఉన్నారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే ఉన్న పరిశ్రమల్లో దాదాపు 1,60,000 మంది తెలంగాణేతరులు పనిచేస్తున్నట్లు అంచనా.

| | |
|---|---|
| ఉద్యోగ నిరుద్యోగ పంపకాలు | పాలకుల పక్షపాత నాటకాలు |
| ఉద్యోగాలలో వారి పెంపకాలు | తెలంగాణకు శాశ్వత కాటకాలు |
| నిరుద్యోగంలో మన ముంపకాలు | కారణమే ఆంధ్రా కీటకాలు |
| కాదంటే చిరుద్యోగంలో నింపకాలు | కలిసుండాలనేది వట్టి బూటకాలు |

నిజాం కాలంలోని తెలంగాణ ఉద్యోగులు పదవీ విరమణ చేసినపుడు ఆ ఖాళీలన్నీ ఆంధ్రులతో నింపారు. హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా మార్చిన తరువాత ఉద్యోగాలన్నీ ఆంధ్రులతోనే నింపారు. ప్రస్తుతం సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులలో 87% ఆంధ్రులే ఉండడాన్ని బట్టి తెలంగాణకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని అంచనా వేసుకోవచ్చు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు తెలంగాణ ప్రాంతంపై చూపించిన వివక్ష, మదరాసు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రులపై చూపించిన వివక్షకన్న ఎన్నోరెట్లు అధికమని తెలుస్తున్నది. ముల్కీ నిబంధనలకు అర్థమే లేకుండా

అభివృద్ధి పథాన ఆంధ్రా జోరు - అన్ని రంగాలలో వారిదే నోరు

పోయింది. ఎంతోకాలం నుండి తెలంగాణలో తిష్టవేసిన వారంతా నివాస ధృవపత్రాలలో తెలంగాణ వారిగానే చూపిస్తున్నారు. స్థిరపడిన ఆంధ్రులు నాలుగు సంవత్సరాలలోనే తెలంగాణ వారిగా పరిగణించబడుతున్నారు. ఈ లెక్కన ముఖ్యమంత్రులు కూడా అందరూ తెలంగాణ వారే అన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇంతకుముందు ఉద్యోగులే వచ్చారు. తర్వాత కాలంలో వ్యాపారులు వచ్చారు, ప్రస్తుతం రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వస్తున్నారు. వీరంతా తెలంగాణలో స్థిరపడుతున్నందున తెలంగాణ అవకాశాలు సహజంగానే తగ్గిపోతున్నాయి.

### *610 జీవో పూర్వాపరాలు*

తెలంగాణాకు ఉద్యోగాలలో అన్యాయం జరిగిందని పూర్తిగా నమ్మిన నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 30-12-1985న జారీ చేసినదే '610 జీవో'. తెలంగాణ వారికి బదులుగా ఉద్యోగాలను పొందిన ఆంధ్రులను వారి ప్రాంతాలకే బదిలీ చేసి ఆ స్థానంలో తెలంగాణ వారినే నియమించాలనేది ఈ జీవో ముఖ్యోద్దేశం వాస్తవానికి ఈ జీవో 31-3-1986నాటికే అమలు చేయాల్సిందిగా కాల వ్యవధిని నిర్ణయించారు. కానీ 20 సంవత్సరాలు గడిచినా పాలకుల వివక్ష వలన, అధికారులు తెలంగాణను సవతితల్లి సంతానంగా భావిస్తున్నందువల్ల నేటికీ అమలుకు నోచుకోలేదు. ఫలితంగా తెలంగాణకు చెందిన విద్యావంతులు రోడ్లవెంబడి తిరగడమో, అడవులపాలు కావడమో అనవాయితీగా మారింది.

### *ఇంతకుముందే ఇలాంటి జీవోతో మోసం*

1956లో సమైక్య రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి 1968 నాటికే తెలంగాణకు చెందాల్సిన 25వేల ఉద్యోగాలను ఆంధ్రులు చేజిక్కించుకున్నట్లు భావించి ఇప్పుడు 610 జీవోను విడుదల చేసినట్లుగానే 21-1-1969న నాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి జీవో 36ను జారీ చేశారు. ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దీనిని బాహాటంగా వ్యతిరేకించి నందున ఆ జీవో అమలుకు నోచుకోలేదు. 16-10-1972న ముల్కి నిబంధన లపై సుప్రీంకోర్టు తెలంగాణకు సానుకూలంగా తీర్పునిచ్చినందున జైఆంధ్ర ఉద్యమానికి దారితీసింది. ఫలితంగా తెలంగాణ ముఖ్యమంత్రి పి.వి.నర్సింహా రావు సంవత్సరానికే అర్ధాంతరంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తర్వాతి కాలంలో ఈ జీవోను అమలు చేయకుండా 32వ రాజ్యాంగ సవరణతో చట్టబద్ధత కల్పించారు. దీనిని అమలు చేసే దిశలో 18-10-1975న రాష్ట్రపతి ఒక ఉత్తర్వును జారీ చేశారు. ఈ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌తో అంతకుముందు జరిగిన

నల్గొండలో కటకట త్రాగునీరు - పాలమూరులో పత్తాలేదు సాగునీరు

అవకతవకలను క్రమబద్ధీకరించినందున 1975 నుండి 85వరకు జరిగిన అక్రమాలను సరిచేసే ఉద్దేశ్యంతో 610జీవోను జారీ చేయడమైనది.

### *610 జీవోలోని ప్రధాన అంశాలు*

1. నిబంధనలకు వ్యతిరేకంగా నియమించబడిన వారిని వారివారి స్వస్థలాలకు 31-3-1986లోగా పంపించాలి.
2. జూరాల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల క్రింద నియమించబడిన నాన్‌గజిటెడ్ కేడర్ ఉద్యోగాలకు చెందిన వార్ని వారివారి జోన్‌లకు బదిలీ చేయాలి.
3. సెక్రటేరియట్, శాఖాధిపతుల కార్యాలయాలలో లోకల్ వారికి తగిన న్యాయం జరగాలి.
4. లోకల్ క్యాండిడేట్లుగా బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను పొందినవారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి.
5. అక్రమ నియామకాలు, ప్రమోషన్లకు సంబంధించి తెలంగాణ అభ్యర్థులు చేసుకునే అప్పీల్లన్నింటిని 31-3-1986లోగా పరిష్కరించాలి.
6. ప్రసిడెన్సియల్ ఆర్డర్ తర్వాత జరిగిన నియామకాలు, ప్రమోషన్లన్నింటిని పరిశీలించి 30-6-1986లోగా రాష్ట్ర సచివాలయంలోని అన్ని విభాగాలు తెలంగాణ ఉద్యోగులతో పూర్తి చేయాలి.

610 జీవో జారీ అయ్యేనాటికే 59వేల తెలంగాణకు చెందిన ఉద్యోగాలను స్థానికేతరులు దక్కించుకున్నట్లు అంచనా. అయితే వాటిని సవరించకపోగా నేటికి ఆ సంఖ్య రెండున్నర లక్షలు దాటిందని తెలంగాణ ప్రముఖులు అంటున్నారు

### *610 జీవో - అధికారుల, రాజకీయ నాయకుల బాధ్యతా రాహిత్యం*

చండశాసనుడిగా పేరుగాంచిన ఎన్టీఆర్ తానే విడుదల చేసిన 610 జీవోను అమలు చేయకుండా నాలుగేళ్ళపాటు పదవీకాలాన్ని వెళ్ళబుచ్చారు. 1989-94 మధ్య కాంగ్రెస్ అధికారంలో వున్నా ఈ జీవోను అమలు చేయలేకపోయింది. 1995 నుండి 2006 వరకు అధికారంలో వున్న చంద్రబాబు ఈ జీవోను అమలుచేయలేదు. తెలుగుదేశానికి కొంతకాలం మిత్రపక్షంగా, మరికొంతకాలం శత్రుపక్షంగా ఉన్న కమ్యూనిస్టులు ఈ విషయంలో మూగబోయారు. తెలంగాణలో మాత్రమే ఉనికిని కలిగి ఉన్న బిజెపి ప్రస్తుతం తెలుగుదేశానికి మిత్రపక్షంగా ఉండికూడా ఏమీ సాధించలేకపోయింది.

ప్రైవేట్ కళాశాలలు వారివైతే - విద్యార్థులు మనం

అసలు విషయానికొస్తే 610 జీవో ఉన్నట్లే తెలంగాణ రాజకీయ నాయకులకు తెలియకపోవడం సిగ్గుచేటు. తెలుగుదేశాన్ని ధిక్కరించి తెలంగాణ రాష్ట్రసమితిని స్థాపించిన చంద్రశేఖర్‌రావు చెప్పేవరకు ఈ జీవో అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. ఈ జీవోను అమలు చేసే పరిస్థితులే తలెత్తితే మరోసారి జైఆంధ్ర ఉద్యమం పుట్టుకొచ్చి తీరుతుందని గత చరిత్ర తెలియజేస్తున్నది. కాబట్టి ఉద్యమాన్ని 610 జీవో కొరకే పరిమితం చెయ్యకుండా ప్రత్యేక రాష్ట్రమే లక్ష్యంగా ఎంచుకోవడం మంచిది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 610 జీవో కూడా ఓ భాగమేతప్ప పూర్తిగా అదే ప్రధానాంశం కాదు.

ప్రభుత్వ ఉత్తర్వులను అధినేతలే అమలు చేయకుంటే అడిగేదెవరిని? అమలు చేయలేమని తెలిసి ఉత్తర్వులను ఎందుకు జారీ చేసినట్లు? ఈ జీవోను అమలు చేయకపోవడంతో జారీ చేసిన రామారావు, ఆయన తరువాత వచ్చిన ముఖ్యమంత్రులందరినీ అసమర్థులకిందే చెప్పుకోవాలి. ఇంతవరకు జీవో అమలుకు నోచుకోలేకపోవడానికి బాధ్యులెవరో గుర్తించిందీ లేదు, శిక్షించిందీ లేదు. తెలంగాణకు అన్యాయం జరిగే జీవోలన్నీ అక్షరం పొల్లుపోకుండా ఆగమేఘాల మీద అమలవుతుండగా, తెలంగాణకు ప్రయోజనం చేకూర్చే ఈ జీవో మాత్రం అమలుకాలేదంటే పాలకుల పక్షపాతం ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతోంది.

ఈ జీవో గురించి 29-12-2001న శాసనసభలో జరిగిన చర్చలో పాల్గొంటూ చంద్రశేఖరరావు "సమైక్య రాష్ట్ర ఏర్పాటు తెలంగాణకు మరణ శాసనంగా పరిణమించింది. గిర్‌గ్లానీ కమిషన్ సమర్పించిన మధ్యంతర నివేదిక ఈ శతాబ్దపు జోక్. రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు అడ్వకేట్ జనరల్‌గా తెలంగాణకు చెందినవారిని ఒక్కసారి కూడా నియమించలేకపోయారు. రాష్ట్ర పరిపాలనకు కేంద్ర బిందువయిన సెక్రటేరియట్‌లో కేవలం 4% ఉద్యోగులు మాత్రమే తెలంగాణ వాసులు. అందులో కూడా ఎక్కువగా లిఫ్టుబాయిలు, అటెండర్ వంటి పోస్టులలో మాత్రమే వున్నారు. తెలంగాణలో ఒకరిద్దరు పోలీసు సూపరింటెండెంట్లుతప్ప మిగతా ఎస్పీలు, కలెక్టర్లు అందరూ స్థానికేతరులే" అని అన్నారు.


చర్చలో అసదుద్దీన్ ఒవైసీ పాల్గొంటూ "తెలంగాణకు చెందినవారు ఎంతమంది ఆంధ్రలో పనిచేస్తున్నారో చెప్పాలి. రాష్ట్రంలో 139 డిపార్ట్‌మెంట్లుండగా గిర్‌గ్లానీ కమిషన్ 11విభాగాల సమాచార్నే సేకరించడం దురదృష్టకరం. సీఎం పేషీలో సైతం తెలంగాణవారు ఒక్కరు కూడా లేరు" అని విమర్శించడం గమనార్హం.

ప్రైవేట్ ఆసుపత్రులు వారివైతే - రోగులు మనం

## కొల్లగొట్టబడిన తెలంగాణ నీటి వనరులు

బంగారు గనుల్లో బంగారాన్ని బయటకు తీస్తే వచ్చే ఆదాయం కన్న - భూమికి నీటి వసతి కలిపిస్తే వచ్చే ఆదాయం ఎక్కువ

- సర్ అర్థర్ కాటన్



కృష్ణా, గోదావరి వంటి నదులకు దారులిచ్చిన తెలంగాణ వాస్తవానికి రాష్ట్రంలోనే కాదు దేశంలోనే అగ్రస్థానంలో వుండాల్సిన ప్రదేశం. పాలకుల వివక్ష వల్ల అయితేనేమి, తెలంగాణ రాజకీయ నాయకుల అసమర్థత వల్ల అయితేనేమి దేశంలోని వెనుకబడిన ప్రాంతంగా మన తెలంగాణ గుర్తింపు పొందింది. తెలంగాణకు సాగునీరు అందకపోవడమేగాక, కనీసం త్రాగునీటికి కూడా నోచుకోలేకపోయింది. కృష్ణానదికి స్వాగతం పలుకుతున్న పాలమూరుకు సాగునీరు లేదు. వీడ్కోలు పలుకుతున్న నల్గొండకు త్రాగునీరు లేదు. నాగార్జున సాగర్ నిర్మాణానికి నల్గొండ జిల్లా 21 గ్రామాలను కోల్పోయింది. ఆ జిల్లా వాసులకు ఫ్లోరైడ్ నీరే దిక్కు కావడం వల్ల ఫ్లోరోసిస్ వ్యాధికి గురవుతున్నారు. తెలంగాణ వెనుకబాటుకు అసలైన కారణాలలో నీటి వనరులలలో జరిగిన మోసమే ప్రధానమైనది.

వైశాల్యంలో, సాగుభూమిలో తెలంగాణయే పెద్దది కాగా జల వనరులలో తదనుగుణంగా వాటా పొందలేకపోయింది. పంటకాల్వల ద్వారా 4% మాత్రమే సాగవుతున్నది. బచావత్ అవార్డుకు పూర్వం భారీ వాటాను పొందే హక్కును కలిగివున్న తెలంగాణ, బచావత్ అవార్డు తరువాత తనకున్న నీటిహక్కును కోల్పోయింది. కృష్ణా నదిలో ఆంధ్రకు 378 టిఎంసిలు, రాయలసీమకు 123 టిఎంసిల నీటిని కట్టబెట్టి తెలంగాణకు మాత్రం 267 టిఎంసిలు మాత్రమే వెచ్చించారు. రాష్ట్ర మొత్తం జలవనరులలో తెలంగాణ ప్రాంతానికి కేటాయించబడిన 1153 టిఎంసిలలో నేటివరకు కేవలం 380 టిఎంసిలు మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. నీటి వనరులకు చేసిన మొత్తం ఖర్చులో తెలంగాణకు 15% మాత్రమే దక్కగా కోస్తాంధ్రలో 76% ఖర్చు చేశారు. గత 48 ఏళ్ళలో తెలంగాణలో 5% మాత్రమే నీటిని అదనంగా తెచ్చారు.

పరిశ్రమలు వారివైతే - కాలుష్యం మనకు

| | |
|---|---|
| తెలంగాణకేమో రాళ్ళొచ్చే | కృష్ణా గోదావరుల జలాలు |
| ఆంధ్రాకైతే నీళ్ళొచ్చే | ఆంధ్రులకే అందిస్తున్నాయి ఫలాలు |
| ఎడతెగని మోసాలకు ఏళ్ళొచ్చే | తెలంగాణ వెనుకబాటుకివే మూలాలు |
| అందుకే ప్రత్యేక రాష్ట్రానికి కాళ్ళొచ్చే | ఎలుగెత్తి చాటాల్సిందే మన కలాలు |

రాష్ట్ర ధాన్యాగారంగా పేరెన్నికగన్న కోస్తా జిల్లాలకు సాగునీటిని అందజేస్తున్న కృష్ణా, గోదావరి నదులు రెండు కూడా తెలంగాణ ప్రాంతంలోనే ప్రవేశించి ఈ ప్రాంతవాసులను వెక్కిరిస్తూ, ఈ ప్రాంత ప్రజల కన్నీటిని కూడా తమలో కలుపుకొని కోస్తాంధ్ర భూములను తడుపుతున్నాయి.

***కృష్ణానది***

మహబూబ్‌నగర్‌లో ప్రవేశిస్తున్న ఈ నది 69% పరీవాహక ప్రాంతాన్ని తెలంగాణలోనే కలిగి వున్నది. కేవలం 13% పరీవాహక ప్రాంతం కలిగివున్న కోస్తాంధ్రకు 65% నీటిని వినియోగిస్తుండగా, 18% పరీవాహక శాతం కలిగివున్న రాయలసీమకు 20% నీటిని వినియోగిస్తున్నారు ఈ నష్టాన్ని సరిచేయాలంటే గోదావరి నదిలో మన రాష్ట్రానికి కేటాయించిన మొత్తం 1480 టిఎంసిల నీటిని తెలంగాణకే కేటాయించినా సరిచేయలేము.

***నాగార్జున సాగర్***

1930లో ప్రాణం పోసుకున్న ఈ ప్రాజెక్టుకు సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే 1952లో నిజాం నవాబు శ్రీకారం చుట్టగా, ఉమ్మడి ప్రాజెక్టుగా నిర్మించడానికి మదరాసు రాష్ట్రం వ్యతిరేకించిన ఫలితంగానే ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమించి సఫలీకృతులయ్యారు. అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతానికి గొడ్డుటావులా మారిపోయింది. నల్గొండ జిల్లాలో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు కుడి, ఎడమ కాల్వల ద్వారా సమాన నీటిని అందించే ఒప్పందంతో ప్రారంభమైంది. కానీ, నేడు కుడికాలువ ద్వారా ఆంధ్ర ప్రాంతానికి 20లక్షల ఎకరాలకు పైగా సాగు నీరందుతుండగా, ఎడమకాల్వ ద్వారా కేవలం 5లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతున్నది. ఈ 5లక్షల ఎకరాలలో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా వలసవాదులు చేజిక్కించుకున్న భూములు కలిసే వున్నాయి. మొదటి ఒప్పందం ప్రకారం కృష్ణా, గుంటూరు జిల్లాలకు మాత్రమే నీటిని అందించాల్సి ఉండగా తదుపరి కాలంలో ఉభయ గోదావరి జిల్లాలకు కూడా అందించే విధంగా నిర్ణయించారు.

**కాంట్రాక్టర్లు వారైతే - కూలీలు మనం**

ప్రాజెక్టులో ముంపుకు గురైంది తెలంగాణ ప్రాంతం ప్రాజెక్టు నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు తెలంగాణ వాసులు. ప్రాజెక్టు నిర్మాణమైంది తెలంగాణలోనే. అయినా ఈ ప్రాజెక్టు తెలంగాణ వాసులకు మొండిచెయ్యిని చూపడంతో లక్షలాది తెలంగాణ ప్రజలు నిరాశ్రయులైనారు. గ్రామాలకు గ్రామాలే వలస వెళ్ళాల్సి వచ్చింది. తట్ట, పార గురించి తెలిసినంతగా పలకా, బలపాల గురించి తెలియని పాలమూరు లేబర్ రాత్రింబవళ్ళు కష్టించి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశారు. ఇంతకష్టపడ్డా పాలమూరుకు దక్కిందేమీ లేదు.

### శ్రీశైలం

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణకు చెందిన 117 గ్రామాలు ముంపుకు గురైనాయి. రెండున్నర లక్షల మంది నిరాశ్రయులైనారు. ఇక్కడి కుడికాలువ రాయలసీమకు కొంతవరకు ఉపయోగపడిందేకాని, ఎడమకాలువ తెలంగాణకు మాత్రం చుక్క నీటిని కూడా అందించలేకపోయింది. నాగార్జున సాగర్‌కు ఇది బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గాను, విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుగాను పనిచేస్తున్నదేతప్ప తెలంగాణ కొరకు నిర్ణయించిన ఎత్తిపోతల పథకాలు మాత్రం కంటికి కనిపించడం లేదు ఇప్పటివరకు శ్రీశైలం కుడికాల్వకు 2వేల కోట్లకు పైగా ఖర్చుచేయగా, ఎడమకాలువకు అందులో నాలుగోవంతు కూడా ఖర్చు చేయలేదు.

1981లో 1,060 కోట్ల ఖర్చుతో రూపకల్పన చేసిన ఎడమ కాలువకు నిధుల కేటాయింపులో వివక్ష చూపించారు. మూడుసార్లు అఖిలపక్ష కమిటీ, మూడుసార్లు నిపుణుల కమిటీ, మూడుసార్లు ప్రపంచ బ్యాంకు టెండర్లు, పదిసార్లు కేంద్రంతో సమాలోచనలు, 32సార్లు జీవోల విడుదల లాంటి పనులతో కాలం వెల్లబుచ్చారేతప్ప కేంద్ర జలవనరుల శాఖ, అటవీశాఖ, పర్యావరణశాఖ, కేంద్ర జలసంఘం లాంటి 16శాఖల అనుమతి లభించినా ఎడమకాలువకు అడ్డంకులు తొలగలేదని సాకులు చెబుతున్నారు. ఎడమకాలువకు కేటాయించిన నిధులను వినియోగించకుండా 1983లో 1,075కోట్లతో తెలుగుగంగ ప్రాజెక్టును ప్రతిపాదించి మొత్తం పనులను పూర్తిచేశారు. ప్రతిపాదించిన దానికంటే ఎక్కువే ఖర్చు చేశారు. 1996 వరకు ఎడమకాలువకు కేటాయించింది కేవలం 76 కోట్లు మాత్రమే. ఇందులో కూడా భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంగా చెల్లించిందే అధికం. ఈ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తికి ప్రధానమైనది. అయినా దీని నుండి సుమారు 7 ప్రాజెక్టులకు నీరు కేటాయిస్తున్నారు.

**ఎత్తుకు పోవడాలు వారివైతే - ఎత్తిపోతలు మనకు**

**జూరాల**

1956కు ముందే ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును 1962లో ప్రకటించి, 1980 మార్చి 7న ప్రారంభించారు. ముందుగా 28.20 టిఎంసిల నీటిని కేటాయించి, తరువాత 17.84 టిఎంసిలకు తగ్గించారు. నేటికి కూడా ఈ ప్రాజెక్టు పనులలో సగం కూడా పూర్తి కాలేదంటున్నారు. 1986 నాటికే పూర్తి పనులు కావలసి వుండగా ఈ గడువును పెంచుతూ పోతున్నారు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతుండటంతో కేటాయిస్తున్న నిధులు పెరుగుతున్న వ్యయానికి కూడా సరిపోవడం లేదు. ప్రస్తుత పరిస్థితులను బట్టి మరో 15 సంవత్సరాలైనా ఈ ప్రాజెక్టు పూర్తి కాదని తెలుస్తున్నది. అయినా నిర్మాణం పూర్తికాకముందే ప్రాజెక్టును ప్రారంభించి చేతులు దులుపుకున్నారు.

**భీమా ప్రాజెక్టు**

1932లో నిజాం ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా ఈ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం 27టిఎంసిల నీటిని కేటాయించింది గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టుకు సంవత్సరానికి కేవలం 10లక్షలు మాత్రమే కేటాయిస్తున్నందున ప్రాజెక్టు ముందుకు సాగడం లేదు. 1996-97లో ఈ ప్రాజెక్టుకు కేటాయింపులే లేకుండా చేశారు. ప్రణాళికలో లేని సీలేరు ప్రాజెక్టుకు 30కోట్లు, వలిగొండకు 25కోట్లు కేటాయించి భీమా ప్రాజెక్టుకు కేటాయించకపోవడం దళారీ పాలకుల వివక్షతకు పరాకాష్ట.

ప్రారంభానికే నోచుకోని ఈ ప్రాజెక్టును మొదటి దశ ఎత్తిపోతల కార్యక్రమంగా, రెండోదశ ఎత్తిపోతల కార్యక్రమంగా సాగదీస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికై ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని 1989లో జూరాల ప్రాజెక్టు కార్యాలయంలో కలిపారు.

**రాజోలిబండ 'డైవర్షన్' స్కీమ్**

'పేరులోనే అర్థాన్ని ఇమిడించుకున్న (డైవర్షన్) ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్‌కు 85వేల ఎకరాలకు నీరందాల్సి ఉండగా సుంకేసుల ఆనకట్ట ద్వారా రాయలసీమకు 'మళ్ళించడం' (డైవర్షన్)తో కేవలం 50వేల ఎకరాల లోపు మాత్రమే అతికష్టంమీద అందుతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 16 టిఎంసిల నీటిని వాడుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు అనుమతి ఉన్నా పూర్తి స్థాయిలో

వినియోగించుకోవడానికి ముందుకు రాకపోవడం పక్షపాత పాలనలో భాగమే. ఇది చాలదన్నట్లు రాజోలిబండకు దిగువన వున్న సుంకేసుల ఆనకట్ట నుండి కర్నూలు–కడప కాలువ (కె.సి.కెనాల్) ఏర్పాటు పాలమూరుకు పెనుగండమైంది.

*కోయల్‌సాగర్ 'ఎత్తిపోతల' పథకం*

416కోట్ల రూపాయల అంచనాతో ప్రతిపాదించబడిన ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలోని 127 గ్రామాలకు సాగునీరు, పాలమూరు పట్టణ ప్రజలకు త్రాగునీరు లభించాల్సి వుండగా కారణం లేకుండా 'ఎత్తివేతల' పథకంగా తయారైంది.

*కల్వకుర్తి 'ఎత్తిపోతల' పథకం*

రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని 1975లో ప్రతిపాదించిన ఈ పథకాన్ని 1991 వరకు కూడా ప్రారంభించలేదు. 1991లో కూడా డివిజనల్ ఆఫీసును తెరిచి 1992లో ఓ అధికారిని నియమించారు. 1993లో ఫీల్డ్ స్టాఫ్‌ను సమకూర్చి కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం అరకొర నిధుల కేటాయింపుతో దీర్ఘకాలంలో పూర్తయిన ఎత్తిపోతల పథకంగా ప్రపంచరికార్డుకు చేరువ కాబోతున్నది.

*నెట్టెంపాడు 'ఎత్తిపోతల' పథకం*

1980లో ప్రతిపాదించబడిన ఈ పథకం 13.42 టిఎంసిల నీటి వినియోగంతో రూపుదిద్దుకోవాల్సి వుండగానే నేటికీ ప్రతిపాదించబడిన ఎత్తిపోతల పథకం క్రింది 148 గ్రామాల భూములు బీడుభూములుగా దర్శనమిస్తున్నాయి.

*పెద్దమర్రూరు 'ఎత్తిపోతలు'*

శ్రీశైలం రిజర్వాయర్ నుండి ఎత్తిపోతల ద్వారా కరువు ప్రాంతాలైన కొల్లాపూర్, వనపర్తి, నాగర్‌కర్నూలు పరిసర ప్రాంతాలకు రెండున్నర లక్షల ఎకరాలకు సాగు నీరందించాలని ప్రతిపాదనలు చేసి 'శెనగలు తిని చేతులు కడుక్కున్నట్లు' శంఖుస్థాపనతోనే చేతులు దులుపుకున్నారు.

*తుంగభద్ర*

1948లో నిజాం నవాబు ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నుండి మహబూబ్‌నగర్‌కు 120 టిఎంసిల నీటిని ఇవ్వాల్సి వుండగా, 1956 తరువాత మాత్రం మహబూబ్‌నగర్ సరిహద్దు వరకు త్రవ్విన కాలువ అక్కడే ఆగిపోయింది.

హైదరాబాద్ - ఆంధ్ర రాష్ట్రాలు సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఫలితంగా తెలంగాణ జిల్లా మహబూబ్‌నగర్‌ను నిండా ముంచింది.

కృష్ణానగి మిగులు జలాలను ఆంధ్రా, తెలంగాణ సమంగా పంచుకోలని ఒప్పందంలో భాగంగా కాగా ఇందులో తెలుగుగంగకు, శ్రీశైలం కుడికాల్వకు, ఎడమకాల్వకు భీమా ఎత్తిపోతలకు నీటిని కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింద. అమలు విషయానికి వస్తే ఆంధ్రకు దక్కాల్సిన మిగులు నీటి వినియోగం కొరకు వేల కోట్ల రూపాయలను వెచ్చిచ్చి తెలుగుగంగను, శ్రీశైలం కుడికాల్వను పూర్తి చేశారు. శ్రీశైలం ఎడమకాల్వను, భీమ ఎత్తిపోతలను ముట్టుకోకుండా మీనమేషాలు లెక్కించి పుణ్యకాలం (2000సం॥) గడిచేదాకా మిన్నకున్నారు. ఫలితంగా తెలంగాణకు దక్కాల్సిన మిగులు జలాలు దక్కకపోగా, తెలంగాణ ప్రజల కన్నీరు కృష్ణానదిలో కలుస్తున్నది.

***పాలమూరు చేసిన పాపమేమిటి?***

జిల్లాలో నిర్మించాల్సి ఉన్న నెట్టెంపాడు, ఎగువ కృష్ణా, భీమా ప్రాజెక్టులకు నిధులను అందించకుండా ఆ ప్రాజెక్టులను పురిట్లోనే చంపేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాగితాలకే పరిమితమయింది. ప్రారంభించిన మూడు దశాబ్దాల తరువాత నేటి దాని స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడనన్నట్లే ఉన్నాయి. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులతో అక్కడక్కడ కాలువలను మాత్రం త్రవ్వుతూ దాన్నో పెద్దప్రాజెక్టుగా ప్రచారం చేయజూస్తున్నారు. బచావత్ నిర్ణయించిన గడువు మార్చి 31, 2000తో ముగిసినందున ఈ నదిమీద మహబూబ్‌నగర్‌కు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన చిన్న నీటితరహా ప్రాజెక్టులన్నీ గడిచిపోయిన చరిత్రగా మిగిలాయి. గుడ్డిలో మెల్లగా జూరాల ప్రాజెక్టు నిర్మించినా, దశాబ్దాలు గడుస్తున్నా నిధుల కొరతతో జిల్లాప్రజలకు ఆశించినంతగా ఉపయోగపడలేకపోయింది. పాలకుల పాపాలకు పాలమూరు బలైపోయింది. కరువు జిల్లాగా పేరుబడ్డ పాలమూరు నుండి ప్రతియేటా పది లక్షల మంది పనులకొరకు వలస వెళుతున్నారు. పాలమూరు లేబర్ ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందింది. పాలమూరును చంద్రబాబునాయుడుగారు దత్తత తీసుకున్నాని ఆర్భాటంగా ప్రకటించాడేకాని ఆదుకోలేకపోయాడు. ఎన్నెన్నో అభివృద్ధి ప్యాకేజీలు ప్రకటించినప్పటికీ వాటి అమలుకు చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేకపోయాడు. జిల్లా పరిస్థితి ఊరికుక్కకన్న పెంపుడుకుక్క బ్రతుకే దిగదుడుపు అన్నట్లు తయారయింది. తుఫానులొచ్చి రాష్ట్రం అంతా కొట్టుకుపోయే పరిస్థితులు

తటస్థించినప్పుడే పాలమూరు చెరువుల్లో నీరు కనిపిస్తాయని ఇక్కడి ప్రజలు అనుకుంటున్నారు అభివృద్ధిలో భాగం దక్కని ఈ జిల్లాకు వలసల జిల్లాగా పేరొందిన ఈ జిల్లాకు చెందిన జయపాల్‌రెడ్డిగారే జెండా పట్టే కార్యకర్తలు లేక. నల్గొండకు వలసపోకతప్పలేదు.

***గోదావరి నది***

గోదవారి నది యొక్క 79% పరీవాహక ప్రాంతం తెలంగాణలో వుండగా, 21% పరీవాహక ప్రాంతం మాత్రమే కోస్తా ఆంధ్రలో వుంది. గోదావరి జలాల నుండి రాష్ట్రానికి కేటాయించిన 1480 టిఎంసిలలో తెలంగాణకు 700టిఎంసిలను కేటాయించారని చెప్పారే కాని, నేటికి కేవలం 120 టిఎంసిల నీరు మాత్రమే వినియోగంలోకి వచ్చింది. ఇందులో కూడా సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే ఏర్పరచిన ప్రాజెక్టుల ద్వారా పొందిన 50 టిఎంసిలను తీసేస్తే గత 48 యేళ్ళ నుండి నికరంగా తెలంగాణకు దక్కింది 70 టిఎంసిల నీరు మాత్రమే.

***పోచంపాడు***

35 సంవత్సరాల క్రితం పోచంపాడు ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పాలకుల వివక్షవల్ల నేటికి కూడా పూర్తి కాలేకపోయింది. ఎన్నడో మొదలు పెట్టిన పోచంపాడు ఇంకా పూర్తికాలేదా? అనే అనుమానం ప్రజలకు వస్తుందనుకున్నారో ఏమో! దీనికి మధ్యలోనే శ్రీరాంసాగర్‌గా నామకరణం చేశారు. పరిశ్రమలకు నీరందించడమే ప్రధాన ధ్యేయంగా ఈ ప్రాజెక్టును నిర్మించారని దీనిక్రింద వున్న బీడు భూములు రుజువు చేస్తున్నాయి. ప్రతిపాదించిన 21 సంవత్సరాల తరువాత ప్రతిపాదనలకు విరుద్ధంగా కృష్ణాపురం వద్ద కాకుండా పోచంపాడు వద్ద నిర్మాణాన్ని ప్రారంభించారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే పనులు ప్రారంభించబడిన ఈ ప్రాజెక్టుకు విలీనం ద్వారా తీవ్ర నష్టం జరిగింది. ఇలా నష్టం జరుగుతుందేమోనని ముందుగానే అనుమానించి ఈ ప్రాజెక్టుకు ఎలాంటి మార్పులు చేయరాదని ముందుగానే ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ ఒప్పందాలన్నింటికి తిలోదకాలిచ్చి అసంపూర్తి ప్రాజెక్టుల లిస్టులో ఈనాటికీ కనిపించేలా ఈ ప్రాజెక్టును మిగిల్చారు.

1986 నుండి 91 వరకు ఈ ప్రాజెక్టు కొరకు ప్రపంచబ్యాంకు నుండి అందిన 450 కోట్ల నిధులలో 5% కూడా ఖర్చు చేయలేదు. ప్రపంచబ్యాంకు ఈ ప్రాజెక్టును 1990 లోపు పూర్తి చేయాలని నిబంధన పెట్టినా ఇప్పటివరకు సగం కూడా పూర్తి కాలేదు. నష్టపరిహారాలకు, కార్యాలయాలకు, రోడ్ల నిర్మాణాలకు, జీతభత్యాలకు వెచ్చిస్తున్న మొత్తాలను శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి

కేటాయిస్తున్నట్లు బడ్జెట్ కేటాయింపుల్లో చూపిస్తూ అసలు పనికి మాత్రం నిధులను కేటాయించడం లేదు. ఉదా. 1990లో కేటాయించిన 40కోట్ల జీతభత్యాలు 13కోట్లు, నష్టపరిహారం 12కోట్లు, యంత్రపరికరాల కొనుగోలుకు 3కోట్లు ఖర్చు చేసి మిగిలిన 13కోట్లను ఖర్చు చేయకుండానే మురగబెట్టారు.

*శ్రీరాంసాగర్ వరద కాలువ*

శ్రీరాంసాగర్ ప్రాజెక్టునే మరోభాగంగా చూపిస్తూ ఇంకో కొత్త ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు ఊకదంపుడు ప్రచారం చేస్తున్నారు శ్రీరాంసాగర్‌కన్నా పదింతలు పెద్దదైన నాగార్జునసాగర్‌ను ఎలాంటి భాగాలుగా చూపలేదు. కానీ, పోచంపాడు ప్రాజెక్టును మధ్యలో శ్రీరాంసాగర్‌గా మార్చి శ్రీరాంసాగర్‌ను మొదటి దశ, రెండవ దశగా చూపించి, ప్రస్తుతం వరద కాలువగా మరో అవతారమెత్తించి ఒక్కో పనిని ఒక్కో ప్రాజెక్టుగా చూపించడం కేవలం తెలంగాణలో ఎక్కువ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు మభ్యపెట్టడానికే సుమా!

*నిజాంసాగర్*

దీనికి 35 సంవత్సరాల క్రితం 35కోట్లు కేటాయించాలని లెక్కలు చూపించారు. ప్రతి సంవత్సరం ఒకటి లేదా రెండు కోట్లు కేటాయిస్తూ దీనిని 'తెలంగాణ భారీ నీటి ప్రాజెక్టుగా చూపిస్తున్నారు. దీన్ని నిజాం కాలంలోనే పది కోట్లతో నిర్మించగా సమైక్య రాష్ట్రంలో నేటికీ అండర్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టుగానే చెప్పుకోబడుచున్నది. నిజామాబాద్ జిల్లా పేద ప్రజల బలహీనతలను ఆధారం చేసుకొని ముంపుకు గురికాని భూములను వలసవాదులు చేజిక్కించుకున్నారు. తెలంగాణ జిల్లాల్లో అత్యధికంగా వలసవాదుల ఆధిపత్యం నడుస్తున్నది ఈ జిల్లాలోనే ఏకంగా వలసవాదులే కొన్ని స్థానాలలో శాసనసభ్యులు కాగలుగుతున్నారంటే వలసల తీవ్రతను అంచనా వేసుకోవచ్చు.

*సింగూరు ప్రాజెక్టు*

మంజీరా నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టును ఉమ్మడి ఆస్తిగా చెప్పుకునే రాజధాని నగర ప్రజలకు త్రాగునీరందించడానికే పరిమితం చేశారు. ఈ ప్రాజెక్టు క్రింద ఒక్క ఎకరానికి కూడా సాగునీరందించకపోగా, కనీసం చుట్టుపక్కల ఉన్న మెదక్ జిల్లాలోని గ్రామాల ప్రజలకు మంచినీటిని కూడా అందించడంలేదు. ఇలా వుండగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేసిన 250కోట్ల నిధులను తెలంగాణ వాటాగా చూపించారు.

ఒక నదీ పరీవాహన ప్రాంత అవసరాలను తీర్చకుండా ఆ నదీ జలాలను మరో నదీ పరీవాహక ప్రాంతానికి తరలించడం దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఉన్న జలవిధాన నియమాలకు విరుద్ధం. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో

వున్న మెదక్ జిల్లాకు నీరందించకుండా కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో వున్న జంట నగరాలకు నీటిని తరలించడం పరీవాహక ప్రజల హక్కులను హరించడమే.

*ఎల్లంపల్లి*

ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాలకు అందాల్సిన నీటినని రామగుండంలోని ఎన్టీపీసీకి తరలించడంతో 1.20లక్షల ఎకరాలు బీడుభూములుగా మారాయి. వ్యవసాయానికి అందాల్సిన నీరు పరిశ్రమలకు కేటాయించడం విడ్డూరం ఎన్టీపీసీకి నిరందిస్తున్నందువల్ల కేంద్ర ప్రభుత్వమే 100కోట్లు ఖర్చుచేసి ఎల్లంపల్లి వద్ద బ్యారేజి నిర్మించి సాగునీటిని అందిస్తారని 25 సంవత్సరాల క్రితం చేసుకున్న అగ్రిమెంట్లు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఇప్పటికే దవళేశ్వరం ప్రాజెక్టు ఆంధ్ర ప్రాంతానికి 12లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరందిస్తున్నది. గోదావరి నుండి పెద్దమొత్తంలో నీటిని ఆంధ్రాకు మళ్ళించడానికి ప్రాజెక్టులను రూపొందించే ప్రయత్నంలో ఉన్నారు. అందుకే కృష్ణానదితో గోదావరిని అనుసంధానం చేయాలని ఓ కొత్తవాదాన్ని ముందుకు తెస్తున్నారు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్న రాజధాని నగరానికి కృష్ణా నీటిని తేవాల్సి ఉండగా గోదావరి నుండి తేవడానికి కుయుక్తులు పన్నుతున్నారు.

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూరు, మంజీర లాంటి తెలంగాణ ప్రాజెక్టులన్నీ రాజధాని నగర అవసరాలను తీర్చడానికే పరిమితం చేశారు. దీనివల్ల మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులు ఎంతగానో నష్టపోయారు. పోచంపాడు నుండి రామగుండం థర్మల్ స్టేషన్‌కు నీరు అందిస్తున్నారు. ఇదే సమయంలో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుండి మాత్రం నీటిని ఇతర అవసరాలకు మళ్ళించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోచారం, డిండి, మానేరు, వైరా, నిజాంసాగర్ ప్రాజెక్టులన్నీ నిజాంకాలంలో నిర్మించబడ్డవే.

కర్ణాటక రాష్ట్రం ఆల్‌మట్టిడ్యాం ఎత్తును పెంచితే మన రాష్ట్ర ప్రభుత్వం గుండెలు రగిలి ఆందోళనలు చేపట్టింది. తెలుగుగంగ ద్వారా మద్రాస్‌కు నీళ్ళిస్తామంటే రాయలసీమ జిల్లాలు, నెల్లూరు జిల్లావాసులు ఉద్యమాలను నడిపారు. రాయలసీమ అవసరాలు తీరనిదే నెల్లూరుకు నీటిని ఇవ్వరాదని, మదరాసుకు నీటిని పంపరాదని కుండబద్దలు కొట్టినట్టు తేల్చిచెప్పారు. వాస్తవానికి వారు అడిగిందానిలో కూడా ఎటువంటి దోషం కనిపించదు. మరి కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ ప్రాంతంలో ప్రవేశించి 70% పరీవాహక ప్రాంతాన్ని కలిగివుండి, తెలంగాణకు ఉపయోగపడకుండా ముందుకు సాగడాన్ని తెలంగాణవాసులు తమ కడుపుమంటను వ్యక్తం చేయడం నేరమెలా అవుతుంది?

## ప్రజలొక్కటే కాని - పాలకులు వేరు

శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల ఎడమకాలువలను కుడికాలువలకు ధీటుగా ఎందుకు తీర్చిదిద్దలేకపోయారో నిలదీయాల్సిన అవసరమొచ్చింది. ప్రాజెక్టు సిబ్బందిలో మొత్తం ఆంధ్రులే ఎందుకు నియమింపబడ్డారో, బడ్జెట్ కేటాయింపులలో సింహభాగం ఆంధ్ర ప్రాంతానికే ఎందుకు కేటాయించారో ఇప్పటికైనా మన ప్రజలకు ప్రభుత్వం వివరించాలి. చేసిన తప్పులను సరిదిద్దకుండా, ప్రభుత్వం చెబుతున్న కాకిలెక్కలను నమ్మాల్సిన అవసరం అసలేలేదు

తెలంగాణ నీటివనరులు తెలంగాణ అవసరాలను తీర్చకుండా ఇతరుల అవసరాలను తీర్చడం ఏ న్యాయసూత్రాలు అంగీకరించవు మన జలాలను ఆంధ్ర ప్రాంతానికి మళ్ళించడంలో కృషిచేసిన కె ఎల్ రావును అపరభగీరధుడుగా వర్ణిస్తుంటే మనం తలలూపడంలో అర్థమే లేదు. ఏనాటినుండో ఉన్న చెరువులన్నీ ఎందుకు మాయమయ్యాయో మనం నిలదీయాలి.

## ఆత్మహత్యలకు దారితీస్తున్న తెలంగాణ వ్యవసాయం

తెలంగాణ వ్యవసాయం గురించి చెప్పాలంటే నీటి వనరులను గురించి ముందుగా చెప్పుకోక తప్పదు. నీటి పంపకాలలో జరిగిన అవకతవకలు తెలంగాణ వ్యవసాయాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. సాగునీరు అందకుండా ఇక్కడి వ్యవసాయాన్ని నాశనం చేశారు. కుంటలు, చెరువులకు మరమ్మతులు చేయకుండా మాగాణి భూములు మెట్టభూములుగా మారేందుకు కృషి చేశారు. ఫలితంగా రైతుల ఆత్మహత్యలు, రైతులు కూలీలుగా మారడం, రైతుల వలసలు ఊపందుకున్నాయి తెలంగాణ ప్రజలకు త్రాగడానికి గుక్కెడు నీళ్ళివ్వలేకపోయినా వ్యవసాయానికి ఆయువు పట్టయిన సాగునీరందించడంలో కూడా మోసమే చేశారు తెలంగాణలో మాగాణి పంట పెరిగిందని ప్రభుత్వం లెక్కలు చెబుతున్నది కాని ఈ పెరుగుదలకు బోరుబావులే కారణమన్న రహస్యాన్ని చెప్పడంలేదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందే తెలంగాణలో 33వేల చెరువులు, కుంటలు వుండేవి పాలకుల వివక్ష వల్ల చెరువులు కుంటలు పూడుకుపోయి, శిధిలమై వాటికింద సాగయ్యే సుమారు 12 లక్షల ఎకరాలు నేడు 5 లక్షల ఎకరాలకు పడిపోయాయి తెలంగాణలో వ్యవసాయం బావులపై ప్రధానంగా ఆధారపడి వుంది చిన్ననీటి తరహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించనందున వ్యవసాయం నానాటికి దిగజారిపోతున్నది. 1956కు పూర్వం బావుల ద్వారా విద్యుత్ మోటార్ల ప్రస్తావనే లేకుండా సుమారు 3లక్షల ఎకరాలకు సాగునీరు కల్పించుకున్నారు ఈమధ్య బోర్ల ప్రవేశంతో విద్యుత్ మోటార్ల ప్రవేశంతో సుమారు 20లక్షల ఎకరాలకు సాగునీరందుతున్నట్లు అంచనా.

ఆంధ్రకు సాగునీరందించే ప్రాజెక్టులలో కొన్ని తెలంగాణలో నిర్మించినందున ఇక్కడి వ్యవసాయ భూములు ప్రాజెక్టు నీటి ముంపునకు గురయ్యాయి తెలంగాణలో

నీటి పారుదలకు కనీసం 15% నిధులను కూడా ఖర్చు చేయనపుడు ఇక్కడ వ్యవసాయం ఎలా అభివృద్ధి చెందుతుంది? నీటి వనరులన్నీ కోస్తాంధ్రాకు మళ్ళించి తెలంగాణ వ్యవసాయం బాగుపడాలంటే ఎలా?

ఈనాటికీ తెలంగాణలో వ్యవసాయం కొనఊపిరితోనైనా బ్రతికి వుందంటే దానికి ప్రభుత్వ సహాయ సహకారాలు మాత్రం కాదనేది నిర్వివాదాంశం. భార్య మెడల్లోని పుస్తెలు తాకట్టుపెట్టి, భూములను కుదవపెట్టి తెచ్చిన అప్పులతో బోర్లను, మోటార్లను ఏర్పాటు చేసుకుంటూ కలో, గంజో తాగి బ్రతుకులను వెళ్ళదీస్తున్నారు ఈ కాస్తంత బ్రతుకుకు కూడా బోరుకు 20వేలు, మోటార్‌కు 20వేలు, విద్యుత్ కనెక్షన్‌కు వేలకు వేలు, విద్యుత్ బిల్లులకు కొంత మొత్తం, అధికారుల అవినీతికి లంచాలు, లోవోల్టేజి వల్ల కాలిపోయే మోటార్ల ఖర్చులు లాంటి త్యాగలెన్నో .. కలిసి వున్నాయి. ఇంతా చేస్తే ప్రభుత్వ లెక్కల్లో తెలంగాణలో సాగునీటి వనరుల క్రింద సాగవుతున్న భూమిగా ఈ మొత్తాన్ని చూపించడం బూటకమే.

ప్రాజెక్టుల ముంపుకు లక్షలాది ఎకరాల తెలంగాణ భూములు నష్టపోతున్నాయి. ప్రాజెక్టుల ముంపుకు గురికాని భూములలో అత్యధిక శాతం ఇప్పటికే ఆంధ్రుల వశమైనాయి. ఒక్క సింగరేణి కంపెనీ వల్లనే తెలంగాణ అరులక్షల ఎకరాల వ్యవసాయ భూమిని కోల్పోయింది రియల్‌ఎస్టేట్ క్రింద మూడు లక్షల ఎకరాల వ్యవసాయ భూమి అర్పించబడింది. ఆంధ్ర ప్రాంతంతో పోల్చినట్లయితే తెలంగాణలో నీటి వసతికిగాని, విద్యుత్ సబ్సిడీకిగాని చేసిన ఖర్చు చాలా తక్కువ ఈ ఒక్క విషయంలో గత 45 ఏళ్ళలో తెలంగాణకు లక్షలాది కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందట

మన రైతుల ఆత్మహత్యలు ప్రపంచాన్ని కదిలించినా, హైటెక్ పాలకులను కదిలించలేకపోయాయి. పురుగుమందులు రైతుల ప్రాణాలను తీయడానికే ఉపయోగపడుతున్నాయి. శాశ్వతమైన చర్యలు చేపట్టనందున ఆత్మహత్యల చరిత్ర ఇక్కడి రైతుల జీవనంలో భాగమైపోయింది.

తెలంగాణ ప్రాంతంలోని భూములను ఆంధ్రులు చేజిక్కించుకోరాదనే నిబంధనను అతిక్రమించి సారవంతమైన, నీటివనరులున్న భూములను ఆంధ్రులు తమ వశం చేసుకున్నారు. తుఫానులో కొబ్బరిచెట్లు కూలిపోయిన కోస్తా రైతులకు సహాయమందించడంలో ఏమరపాటు చేయలేదుకాని, ఇక్కడి రైతుల ఆత్మహత్యల విషయంలో మీనమేషాలు లెక్కించారు. మన ప్రాంతంలో అల్‌కబీర్ పశువధశాలను స్థాపించి మన పశుసంపదనంతా హరించుకుపోయేలా చేశారు.

**భూములొక్కటే కాని – ధరలు వేరు**

## విద్యుత్‌లో అన్యాయాలు

వ్యవసాయదారులకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీల గురించి పాలకులు జపంలా వల్లిస్తున్నారు. పారిశ్రామిక వేత్తలకు వివిధ రూపాలలో వేలకోట్ల రూపాయలు సబ్సిడీ ఇస్తున్నా దానిని వదలి వ్యవసాయ సబ్సిడీలనే ప్రధానంగా చూపిస్తున్నారు. సినిమాలకు, కార్పోరేట్ ఆస్పత్రులకు, ఉద్యోగులకు, ఫిలింసిటీలకు, ఎమ్మెల్యేలకు కాలనీలకు ఇలా ఎన్నెన్నో గుప్త సబ్సిడీలను అందజేస్తూ కేవలం వ్యవసాయదారులకు మాత్రమే సహాయం అందిస్తున్నట్లు నటిస్తున్నారు.

**రామోజీ ఫిలింసిటీ, అపోలో ఆస్పత్రి, జూబ్లీహిల్స్ బిల్డింగ్ సొసైటీలకు ఇచ్చిన సబ్సిడీలు నష్టం కానప్పుడు ప్రజలందరికీ ఆహారన్నందిస్తున్న అన్నదాతకిచ్చే సబ్సిడీ మాత్రమే నష్టమా?** తెలంగాణ ప్రాంత రైతాంగానికి విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చినా నష్టాన్ని పూడ్చలేము. నీటిని అందించడానికి ఆంధ్ర ప్రాంతంలో సగటున ఒక ఎకరానికి లక్ష రప్రాయలు ఖర్చు చేసినందున తెలంగాణ రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాల్సిందే.

తెలంగాణలో బావుల ద్వారా సాగవుతున్న భూమికే ప్రభుత్వం ఉచితంగా నీటిని ఇవ్వగలిగితే విద్యుత్ ఛార్జీలలో రాయితీలు అక్కర్లేదు. ఈ మొత్తానికి ప్రభుత్వమే నీరందించాలంటే సుమారు 30వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని నిపుణుల అంచనా. ఇందుకుగాను ప్రభుత్వం సంవత్సరానికి వడ్డీ క్రిందనే సుమారు 3,500కోట్లు చెల్లించాల్సి వుంటుంది. అలాంటప్పుడు వందలకోట్లలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడంలో తప్పేముంది? ప్రతి సంవత్సరం కాల్వల నిర్వహణ కొరకు ఆంధ్ర ప్రాంతంలో వందలకోట్ల రూపాయలను వెచ్చిస్తున్నట్లే తెలంగాణ రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించడానికి ప్రభుత్వం నిధులను కేటాయించాలి. ఈ నిమిత్తమై ప్రాజెక్టుల కింద నీటి తీరువాను పెంచినా, మరే రంగంమీదైనా భారాన్ని వేసినా ఫరవాలేదు. అన్ని ప్రాంతాలలో ఏకరీతిన విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడమనేది వెనుకబడిన ప్రాంతాలకు శాపం లాంటిదే.

తెలంగాణ ప్రాంతంలో మూడు విద్యుత్ కేంద్రాలున్నాయి. దేశంలో ఏ యూనిట్‌లో ఉత్పత్తి కానంత విద్యుత్తు రామగుండంలో జరుగుతున్నది. కొత్తగూడెం, నాగార్జునసాగర్‌లలో కూడా విద్యుత్ ఉత్పత్తి అధికంగానే వుంది. శ్రీశైలం జలవిద్యుత్ తక్కువ ధరలో తయారవుతున్నది. అయినా వ్యవసాయానికి సరిపడా విద్యుత్తును సరఫరా చేయలేనందున రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నది.

ఎన్టీపీసి మన రాష్ట్రంలో తలపెట్టిన సింహాద్రి, శంకర్‌పల్లి, రామగుండం యూనిట్లలో నక్సలైట్ల బూచీని చూపెట్టి తెలంగాణలోని శంకరపల్లి, రామగుండం యూనిట్లను ఇంతవరకు ప్రారంభించలేదు. శంకర్‌పల్లి యూనిట్‌ను తమిళనాడుకు తరలించగా, రామగుండం యూనిట్‌ను విరమించుకున్నారు. ఇదే సమయంలో ఆంధ్రకు చెందిన విశాఖలోని సింహాద్రి ప్రాజెక్టు పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. దీనికి నక్సలిజంకానీ, నిధుల కొరతగానీ అడ్డురాలేదు. నక్సలిజం కారణం చేతనే రామగుండం యూనిట్‌ను వాయిదా వేసివుంటే, ఇప్పటికే అక్కడ నడుస్తున్న యూనిట్లను గూడా మూసివుండాలి. విశాఖలో కూడా నక్సల్స్ ప్రాబల్యం బలంగా వుందని చెబుతున్నారు. అయినా అక్కడ పనులు ప్రారంభించి రామగుండంలో ఆపడం వివక్షతను ఎత్తి చూపుతున్నది.

రాష్ట్రంలోని నాలుగు థర్మల్ పవర్ ప్రాజెక్టులలో రెండు కోస్తాంధ్రలో, ఒకటి రాయలసీమ, ఒకటి తెలంగాణలో ఉన్నాయి. ఈ నాలుగింటికీ ముడిసరుకునందిస్తున్నది తెలంగాణ ప్రాంతమే. తెలంగాణలోని జలవిద్యుత్ కేంద్రాల ద్వారా 1250మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా అందులో 20% మాత్రమే తెలంగాణకు వినియోగిస్తున్నారు

అయినా వాస్తవానికి విద్యుత్ సబ్సిడీ కేవలం వ్యవసాయానికి మాత్రమే ఇవ్వడం లేదు. పరిశ్రమలకు కూడా కొంతవరకు సబ్సిడీలను ఇస్తూనే వచ్చారు. ఆమాటకొస్తే తెలంగాణ ప్రాంత రైతాంగానికి విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చినా జరిగిన నష్టాన్ని పూడ్చలేం. ఒక ఎకరానికి నీటిని అందించడానికి ఆంధ్ర ప్రాంతంలో సగటున ఒక లక్షరూపాయలు ఖర్చుచేశారు.

వ్యవసాయ సబ్సిడీకి చెబుతున్న లెక్కలలో పూర్తి వాస్తవం లేదు. విద్యుత్‌బోర్డు సిబ్బంది లాలూచీల వల్ల జరుగుతున్న నష్టాన్ని కూడా రైతులకిస్తున్న విద్యుత్ క్రిందే జమకడుతున్నారు. ఇతర రంగాలలో జరుగుతున్న విద్యుత్ చౌర్యాన్ని కూడా వ్యవసాయం మీదకే నెట్టివేస్తున్నారు. విద్యుత్‌బోర్డు అప్పులలో మునిగిపోయి, అది చెల్లిస్తున్న వడ్డీలలో వ్యవసాయ సబ్సిడీ ఏపాటిది? రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి విద్యుత్ కొరత ఒక కారణమేనని ప్రభుత్వం అంగీకరించకపోవడం విడ్డూరం. అయినా తెలంగాణ బొగ్గును, నీటిని వినియోగించుకుంటూ ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో నుండి తెలంగాణకు సబ్సిడీని కొనసాగించడంలో మీనమేషాలు లెక్కించాల్సిన అవసరమేముంది?

## రాష్ట్రం ఒక్కటే కాని - కష్టాలు వేరు

## పరిశ్రమలు తెలంగాణ పాలిట శాపాలు

పరిశ్రమలు ఆధునిక దేవాలయాలని అంటుంటారు. కానీ తెలంగాణ వారికి మాత్రం ఇవే పరిశ్రమలు వైద్యానికి లొంగని రాచపుండులా పరిణమించాయి తెలంగాణ ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు స్థాపించడంతో వాతావరణ కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మరోవైపు సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందు జీవనోపాధిని కల్పించిన పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. కొత్తగా వస్తున్న పరిశ్రమలలో తెలంగాణ వాసులకు ఉపాధి కల్పించడం లేదు.

విలీనానికి ముందు తెలంగాణ ప్రజలకు కల్పతరువుల్లా ఉపయోగపడ్డ 'ఆజంజాహి మిల్స్, ఉస్మానియా కెమికల్స్, నిజాం షుగర్స్, తాజ్‌గ్లాస్ ఫ్యాక్టరీ, ప్రాగాటూల్స్, సిరిపూర్ పేపర్ మిల్స్, సింగరేణి కాలరీస్, హైదరాబాద్ ఆస్‌బెస్టాస్' లాంటి ప్రముఖ పరిశ్రమలు మూసివేతకు గురైనాయి. నిజాం కాలంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ ల్యాబ్‌ను-ఆర్.ఆర్.ల్యాబ్‌గా మార్చేసి ఆంధ్రులతో నింపేశారు. 1956కు ముందున్న పరిశ్రమలన్నింటిలో తెలంగాణ వాసులే ఉద్యోగులు కాగా నేడు అవి స్థానికేతరులకే స్థావరాలైనాయి. పరిశ్రమలన్నీ తెలంగాణలోనే వుండగా నిరుద్యోగులు కూడా ఇక్కడే అధికంగా వుండడం పక్షపాత పాలనకు తార్కాణం. **ఆనాడు రైస్‌మిల్లులు తప్ప మరే పరిశ్రమలు లేని ఆంధ్రప్రాంతంవారు నేడు పారిశ్రామికంగా ముందంజలో ఎందుకున్నారో గమనించాలి.**

ఆంధ్రులు పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం కొరకే స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్‌లను ప్రభుత్వం సృష్టించినట్లు అవి అందించిన రుణాలను, పొందిన వ్యక్తులను పరిశీలించినప్పుడు అర్థమవుతున్నది.

పరిశ్రమలలో అధికభాగం తెలంగాణ జిల్లాల్లోనే ఉన్నాయి. కానీ పరిశ్రమలను స్థాపించినవారిలో తెలంగాణేతరులే ఎక్కువ. పరిశ్రమల స్థాపనకు తెలంగాణ వ్యవసాయ భూములను, నీటిని, తక్కువ ధరకే విద్యుత్తును ప్రభుత్వాలు అందించాయి. పైగా రోడ్డు సౌకర్యాలు, ఫోను సౌకర్యాలు కలుగజేశాయి. పెట్టుబడుల మీద 20% వరకు సబ్సిడీలను అనుమతించారు. సేల్స్‌టాక్స్‌లో మినహాయింపునిచ్చారు. ఇంతా చేస్తే ఏ కులంవారి పరిశ్రమలలో ఆ కులంవారే ఉద్యగులు, ఏ ప్రాంతంవారి పరిశ్రమలలో ఆ ప్రాంతం వారికే ఉద్యోగులు

రెడ్డి ల్యాబ్స్‌లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన రెడ్లకే అధిక ఉద్యోగాలు లభించగా సిరీస్ కంపెనీలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన రాజులకు ఉద్యోగాలు లభించాయి అలాగే కమ్మకులంవారి కంపెనీలలో ఆ కులస్తులే ఉద్యోగాలను పొందగలిగారు

**జన్మభూమి పేరుతో నెత్తికెత్తాడు తట్ట-చెప్పి తీరాల్సిందే సర్దుకోమని బుద్ధి**

వీటన్నింటివల్ల పారిశ్రామికంగా తెలంగాణ అభివృద్ధి చెందుతున్నా ఉద్యోగ వసతి మాత్రం లభించడం లేదు. ఆంధ్రుల పరిశ్రమలన్నీ హైదరాబాద్ చుట్టూ ఉన్నా రంగారెడ్డి జిల్లాకే పరిమితమవుతుండగా కోస్తాంధ్ర జిల్లాల్లో కొత్త కొత్త పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. తెలంగాణ ఇతర జిల్లాల్లో ఉన్న పరిశ్రమలు కూడా ఊడిపోవడమే బాధాకరమైన విషయం రాష్ట్రంలోని మొత్తం సిమెంటు కంపెనీలలో 90% వరకు తెలంగాణ ప్రాంతంలోనే ఉన్నాయి. పరిశ్రమలను స్థాపించేవరకు తెలంగాణవాసులను భవన నిర్మాణ కూలీలుగా పనిచేయించిన ఆంధ్ర పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ప్రారంభించిన రోజు నుండి తెలంగాణ వాసులను గేటుదాటి లోపలకు రానీయటం లేదు విదేశాలకు ఎగుమతి చేయబడుతున్న గ్రానైట్ కంపెనీలకు ముడిసరుకంతా తెలంగాణ ప్రాంతానిదే కాగా, పరిశ్రమల యజమానులు, ఉద్యోగులు మాత్రం తెలంగాణేతరులే. తెలంగాణలోని మొత్తం ప్రైవేటు పరిశ్రమలలో 23% మాత్రమే తెలంగాణ ఉద్యోగులున్నారు. ఇదే సమయంలో ఆంధ్రలోని పరిశ్రమలలోని తెలంగాణ ఉద్యోగులే లేకపోవడం గమనార్హం.

తెలంగాణలో అనేక చేనేత పరిశ్రమలు వందల సంవత్సరాల క్రితమే స్థాపించడబడి ప్రపంచానికే ఆశ్చర్యం కలిగించే రీతిలో వస్త్రాలను అందించాయి. అగ్గిపెట్టెలో దూరేంత అద్భుతమైన చీరలను నేసి, నిజాం నవాబునే ఆశ్చర్యానికి లోనుచేశారు అటువంటి చేనేత కళాకారులు నేడు ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు. దీనికంతటికీ ప్రధాన కారణంగా పాలకులు ఆ రంగానికి అనుకున్నంతగా సహాయం అందించకలేకపోయారనే చెప్పవచ్చు. ప్రభుత్వాలపై నమ్మకం ఉంచి మరింత మందిని పోగొట్టుకునేకన్న కనీసం మనప్రాంతంలో మన చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలను మనమంతా ధరించి వారిని ఆదుకోవడంలో, ఆ రంగాన్ని రక్షించడంలో తెలంగాణ వాసులు కట్టుబడి ఉంటే కలకాలం వారి జీవితాల్లో వెలుగలందించవచ్చు.

ఆంధ్రులే పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచారని ఓ వితండ వాదాన్ని తెలంగాణ జనంలోకి వదిలారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే ఆంధ్ర ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేని రోజుననే హైదరాబాదు రాష్ట్రంలో **200** ఫ్యాక్టరీలుండేవి. విలీనం తర్వాత ఆంధ్ర అధికారుల 'చేతివాటం' వల్ల అందులో చాలా వరకు నష్టాలలో మునిగిపోయాయి. కొన్ని మూసివేతకు గురైనాయి. తద్వారా తెలంగాణకు చెందిన ఉద్యోగులు రోడ్డుపై పడ్డారు. మూతపడిన పరిశ్రమల స్థానంలో ఆంధ్రులు నూతన పరిశ్రమలను స్థాపించి వాటిల్లో ఉద్యోగాలన్నింటినీ ఆంధ్రులకే కట్టబెట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే లాభాలు – ఉద్యోగాలు ఆంధ్రులకు దక్కగా, కాలుష్యం మాత్రం తెలంగాణకు మిగిలింది.

**చేస్తాడట రాష్ట్రంలో జపాన్ రూట్లు–చేశాడుగా మూడెకరాలు మున్నూరు కోట్లు**

## గృహ నిర్మాణంలో వివక్ష

రాజధాని నగరంలో విచ్చలవిడిగా ఎన్‌క్లేవ్‌లు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు పుట్టుకొస్తున్నాయి. హైటెక్ సిటీ, మెగాసిటీ పేర్లతో పురాతన సంస్కృతి మాయమౌతున్నది. సగటున తెలంగాణ వాసుల ఇళ్ళ స్థలాలకన్నా నాలుగు రెట్ల వైశాల్యంతో ఆంధ్రుల మేడలు పెరుగుతున్నాయి ఫలితంగా లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు వలసవాదుల గృహ నిర్మాణానికే వినియోగింపబడుతున్నాయి. హైదరాబాద్ జిల్లా నూరుశాతం గృహ నిర్మాణానికే వినియోగింపబడగా రంగారెడ్డి జిల్లాలో సగం భూములు గృహ నిర్మాణానికి అర్పించబడ్డాయి. జనాభా లెక్కల్లో కాకుండా ఇళ్ళ స్థలాల ఆధీనాన్ని బట్టి చెప్పాలంటే హైదరాబాద్‌లో 60% ఆంధ్రులదే అని చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది.

గృహ నిర్మాణ రంగం వేగం పుంజుకున్నదని చెప్పడంకన్నా తెలంగాణేతరుల గృహాలు శరవేగంతో పెరుగుతున్నాయని చెప్పడం వాస్తవికతకు దగ్గరగా వుంటుంది. తెలంగాణేతరుల గృహ నిర్మాణాలకు ఇళ్ళస్థలాల పేరున ఇటుకలు తయారు చేసే నెపంతో వ్యవసాయ భూములు తగ్గుతుండగా, ఇసుక తరలింపుతో భూగర్భ జలాల మట్టం తగ్గిపోయి వ్యవసాయం దెబ్బతింటున్నది. రాజధాని నగరం చుట్టూ వందకిలోమీటర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారుల వశమైపోయింది. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు వలసవాదులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు గూండాలుగా, గూండాలు రాజకీయ నాయకులుగా మారుతుండడంతో రాజకీయాలు కూడా కలుషితమై పోయాయి.

| | |
|---|---|
| రాష్ట్రమంత్రా ఆంధ్ర ఊదలు | మన ప్రజలకు కనిపించదం లేదు దారి |
| అదరగొడుతున్నాయి వారి మేడలు | దిక్కుతోచక ఎంచుకుంటున్నారు గోదారి |
| మాయమవుతున్నాయి మన జాడలు | విడదీసి చూస్తే మనది కూడా రాదారి |
| ఇంకెప్పుడొదులుతాయి ఈ పీడలు | ఉద్యమిస్తే ప్రత్యేక రాష్ట్రం రాదామరి! |

రాజధాని నగరంలో అన్ని ప్రాంతాలవారు ఉన్నప్పటికీ ఆంధ్ర-తెలంగాణ వాసులు మాత్రం గిర్ర గీసినట్లుగా ఎవరికి వారే విడిపోయినట్టుగా ఉన్నారేకాని, కలిసి ఉన్నట్లు లేదు. పెరిగిన నగరం పాతబస్తీ, కొత్తబస్తీలుగా విడిపోగా, కొత్తబస్తీలో ఆంధ్ర-తెలంగాణలుగా విడదీసినట్లు కాలనీలు తెలియజేస్తున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సంజీవరెడ్డినగర్, వెంగళరావునగర్, కూకట్‌పల్లి, వనస్థలిపురం లాంటివి ఆంధ్రుల స్థావరాలుగా గుర్తింపు పొందగా, అడ్డగుట్ట, జగత్‌గిరిగుట్ట, నామాలగుండు, బతుకమ్మకుంట లాంటివి తెలంగాణ వాసులకు చెందినవిగా గుర్తింపు పొందాయి. లక్డీకాపూల్, టప్పాచబూత్ర, ఫలక్‌నామా

> అప్పట్లో చేశారు రాష్ట్రాన్ని జపాన్-ఆంధ్ర నేటి జపాన్-తెలంగాణ నాటి జపాన్

వంటి ముస్లిం పేర్ల స్థానంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ లాంటి పేర్లు చోటు చేసుకుంటున్నాయి. ఎంత అభివృద్ధి జరుగుతున్నా తెలంగాణ వాసుల జాడలు మాత్రం నీలినీడలుగానే మిగిలిపోతున్నాయి.

గృహ నిర్మాణ రంగంలో 1956లో ప్రారంభమైన దోపిడీ 1969నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పుట్టకతో పరాకాష్టకు చేరుకున్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముగిసిన వెంటనే పథకం ప్రకారం దోపిడీ మొదలైంది. రాజధాని నగరంపై క్రమంగా పట్టు సాధించడానికే హుడా, హౌసింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. హౌసింగ్ బోర్డు ద్వారా హైదరాబాద్ చుట్టూ కొత్త కొత్త కాలనీలను ఏర్పాటు చేసి ఆంధ్రులకు ధారాదత్తం చేశారు. అలాంటివే 'భరత్‌నగర్, బాగ్‌లింగంపల్లి, ఎస్.ఆర్.నగర్, వెంగళరావు నగర్, మలక్‌పేట, వనస్థలిపురం, మౌలాలి, గచ్చిబౌలి, విజయనగర్ కాలనీ, మెహిదీపట్నం'లలో నిర్మించిన కాలనీలు. ఉదా. ఆసియాలోకెల్లా అతిపెద్దదైన కూకట్‌పల్లి కాలనీలో **97% ఇళ్ళను ఆంధ్రులే కైవసం చేసుకోవడం పక్షపాత పాలనకు నిదర్శనం.** ఇప్పటివరకు ప్రభుత్వం, హుడా, హౌసింగ్‌బోర్డు, లేబర్ డిపార్ట్‌మెంట్ నిర్మించిన మొత్తం గృహాలలో 90% ఆంధ్రులే చేజిక్కించుకుని హైదరాబాద్‌ను చుట్టుముట్టారు.

ఇలా వుండగా మరికొన్ని రకాల మోసాల ద్వారా కూడా ఆంధ్రులే లాభపడేలా ప్రభుత్వాలు సహకరించాయి. 1970లో జూబ్లీహిల్స్ హౌస్‌బిల్డింగ్ సొసైటీకి ఎకరాకు వందరూపాయల నామమాత్రం ధరకు 1,398 ఎకరాలను ధారాదత్తం చేశారు. **అక్కడ ఉన్న తెలంగాణ పేదప్రజలను, గిరిజనులను తరిమికొట్టి ఆ సొసైటీకి ధారాదత్తం చేసిన భూమి విలువ ప్రస్తుత ధరల్లో వేల కోట్ల రూపాయల ప్రజాధనం నష్టపోయినట్లు తెలుస్తున్నది. తీరా చూస్తే ఆ సొసైటీలో అధికశాతం ఆంధ్రులే సభ్యులు.**

రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వశపరుచుకున్న భూములను వారు ప్లాట్లుగా చేసి ఎకరానికి చెల్లించిన ధరలలో గజాలను అమ్ముతున్నారు. తెలంగాణవాసులు తమ సంతతికి 50 గజాల స్థలాలను కొనిపెట్టలేనంతగా ధరలు ఆకాశాన్నంటాయి. చెరువులు, కుంటలు కూడా బూటకపు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆకలికి ఫలహారమైపోతున్నాయి. అటవీ ప్రాంతాలు, బంజరు భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సిరులు పండిస్తున్నాయి. పారిశ్రామికవాడల పేరున తెలంగాణ పేదప్రజల భూములను సేకరించి సబ్సిడీ ధరలకు పొందిన భూములను అధిక లాభాలకు అమ్ముకున్నా పట్టించుకునే నాథుడే లేదు.

## ఆంధ్ర పాలకులకు వంత పాడుతున్న మీడియా

అసత్యాలను, అర్ధసత్యాలను సత్యాలుగా మార్చడానికి కొన్ని దినపత్రికలు పోటీ పడుతున్నాయి. చదువురాని వారిని బోల్తా కొట్టించడానికి ఇదేపనిని కొన్ని టెలివిజన్ ఛానళ్ళు చేపట్టాయి. పాలమూరు జిల్లాలోని 24లక్షల జనాభాలో 14లక్షల జనం వలస పోయినా ఈ పత్రికలకు గుర్తుకు రాలేదు కానీ, తెలంగాణ ముఖ్యమంత్రులను దించేయడంలో ప్రతిరోజూ మొదటిపేజీ వార్తలే. ఏకంగా ఓ తెలంగాణ ముఖ్యమంత్రినే బఫూన్‌గా చిత్రిస్తూ కార్టూన్‌లను ప్రతిరోజూ ప్రచురించాయంటే మీడియా ఆధిపత్యం ఎలా కొనసాగుతున్నదో అంచనా వేయవచ్చు.

పత్రికా రంగంలో అసమానతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. విలీనానికి ముందు తెలంగాణ ప్రాంతంలో ఉన్న పత్రికలన్నీ ఆంధ్ర పాలకుల వివక్షకు గురై కాలగర్భంలో కలిసిపోయాయి. తెలంగాణ దినపత్రికలలో గోల్కొండ పత్రిక, ఆంధ్ర పత్రికలు మూతపడగా కృష్ణా పత్రిక ఉనికిని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నది. ఆంధ్ర భూమి ఏనాటి తెలంగాణ వారి నుండి చేజారి పోయింది. ఫలితంగా పత్రికా రంగంలో ఆంధ్రుల గుత్తాధిపత్యానికి ఎదురే లేకుండా పోయింది. పాలకులు అస్మదీయ పత్రికలకే ప్రకటనలు, సబ్సిడీలు, గ్రాంట్లను మంజూరు చేస్తూ కొన్ని దినపత్రికలను తమ పార్టీ కరపత్రాలుగా మార్చుకుంటున్నారు. ఫలితంగా వార్తల్లో పక్షపాతం కనిపిస్తున్నది.

మీడియా మొత్తం ఆంధ్రుల గుప్పిట్లోనే ఉన్నందున తెలంగాణ కష్టనష్టాలు ప్రభుత్వం దృష్టికిగానీ, బయటి ప్రపంచం దృష్టికిగానీ తెలియనీయడం లేదు. తెలంగాణ పేరు వింటేనే కొన్ని పేపర్లకు కంపరం పుట్టుకొస్తున్నట్లు కనిపిస్తున్నది చిన్న చిన్న సంఘటనలను పతాక శీర్షికలుగా ముద్రించి పెద్దపీట వేస్తున్న దినపత్రికలు, ఉవ్వెత్తున లేచిన తెలంగాణ ఉద్యమ వార్తలు ప్రాముఖ్యత లేనివిగా లోపలి పేజీలకే పరిమితం చేశారు. ఉద్యమాన్ని విజయవంతం చేయాలంటే ప్రస్తుతమున్న దినపత్రికలను, ప్రసార సాధనాలను మాత్రమే నమ్ముకుంటే సరిపోదు. పక్షపాత ధోరణి చూపిస్తున్న మీడియాపై కూడా ఉద్యమం నడిపించాల్సిన అవసరముంది. కనీసం ప్రభుత్వాల తప్పులను ఒప్పులుగా చిత్రిస్తున్న బ్రోకర్లను ఏరివేయాల్సిందే.

దినపత్రికలలో దక్కన్ క్రానికల్, ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి, విశాలాంధ్ర మొదలైనవన్ని ఆంధ్రులకు చెందినవే కాగా, తెలంగాణ వారికి చెందిన దినపత్రిక ఒక్కటి కూడా లేదు. టెలివిజన్ ఛానల్స్‌లో ఈటీవీ, మాటీవీ, టీవీ-9, విస్సా, సిటీ ఛానల్ మొదలైనవన్నీ ఆంధ్రులకు చెందినవి కాగా తెలంగాణకు చెందిన ఒక్క టీవీ ఛానల్ కూడా లేదు.

**సిద్దిపేటలో మన గెలుపు - ఉద్యమానికే కొత్త మలుపు**

## సినిమా రంగంతో తెలంగాణ సంస్కృతికి అవమానం

సినిమా రంగంలో లైట్ బాయ్ నుండి హీరో వరకు మొత్తం ఆంధ్రులే తెలంగాణ సంస్కృతిని నాశనం చెయ్యడానికి సినిమా రంగం నడుం బిగించినట్లు కనిపిస్తున్నది. ఇక్కడి యాసను, భాషను, సంస్కృతిని సినిమాల ద్వారా అవమానపరుస్తున్నారు. రౌడీ వేషధారులకు, హాస్యనటులకు తెలంగాణ యాస పేరుతో భాషను తగిలిస్తున్నారు. ఈ విధంగా చూపిస్తున్న భాష కూడా తెలంగాణలో ఎక్కడా కనిపించదు. నిజాం కాలంలో ఉర్దూ పదాల కలయికతో తెలుగును సంకరం చేసి మాట్లాడేవారు తెలంగాణలో ఒక్క శాతం కూడా లేరు

సినిమా రంగమంతా 99శాతం ఆంధ్రులకే చెందినందువల్లనో ఏమోకాని సినిమా రంగానికి ఇబ్బడిముబ్బడిగా సబ్సిడీలను ప్రకటించడంలో పోటీపడుతూ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగ పరుస్తున్నది రామోజీ ఫిలింసిటీ, సినిమా స్టూడియోలను, సినిమారంగంలో ఉన్న వారికి సబ్సిడీ ధరలకు ఇళ్ళస్థలాలను కేటాయించడం విడ్డూరం. సినిమావారు అలా గ్రహించిన భూములను తప్పుదారి పట్టించినప్పుడు కూడా అడిగిన వారు లేరు రామకృష్ణా స్టూడియో ఇప్పటికే వ్యాపార సముదాయంగా మారింది. రామోజీ ఫిలింసిటీ పేరుతో వేలాది ఎకరాలు ధారాదత్తం చేయబడినాయి.

సినీ స్టూడియోలలో రామోజీ ఫిల్మ్‌సిటీ, సారధి స్టూడియో, అన్నపూర్ణ సినీ స్టూడియో, రామకృష్ణ సినీ స్టూడియో, పద్మాలయ స్టూడియో, రామానాయుడు స్టూడియోలతోపాటు ఇతర అనుబంధ సంస్థలన్ని ఆంధ్రులకు చెందినవే కావడం గమనార్హం.

### ఇతరాలు

చిట్స్, ఫైనాన్సెస్, టూర్స్ అండ్ ట్రావెల్స్, ప్రింటింగ్, కన్‌స్ట్రక్షన్స్, రియల్ ఎస్టేట్స్ లాంటి వాటిలోకూడా ఆంధ్రులదే పూర్తి ఆధిపత్యం, గ్రంథాలయాలు, పంచాయితీ శాఖలు, అగ్నిమాపక కేంద్రాలు, ఆర్.టి.సి. బస్‌లు, పోస్టాఫీసులు, టెలిగ్రాఫ్ ఆఫీసులు, టెలిఫోన్ ఎక్స్‌ఛేంజీలు ఇలా ఏ విభాగాన్ని తీసుకున్నా అన్నింటిలోను ఆంధ్రలోకన్న తెలంగాణ ప్రాంతం తక్కువగా ఉన్నాయి.

ఇవిగాక అన్ని రంగాలలో అడుగడుగునా తెలంగాణకు అన్యాయమే జరిగింది. రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లాగా ముద్ర నెత్తినెత్తుకున్న మహబూబ్‌నగర్‌కు నాలుగు శాతం తెల్లకార్డులను కేటాయించి అగ్రస్థానంలో ఉన్న తూర్పుగోదావరికి 7 శాతం తెల్లకార్డులను కేటాయించడం శోచనీయం. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (ఐ ఆర్ డి.పి) క్రింద కేటాయింపులలో చిత్తూరుకు మొదటి స్థానం దక్కగా ఆ తర్వాత స్థానాలను తూర్పుగోదావరి, గుంటూరులు దక్కించుకున్నాయి. తెలంగాణ శాసనసభ స్థానాలలో అక్కడక్కడ ఆంధ్రులే సీట్లను దక్కించుకున్నారు. తెలంగాణ కోటాలో అలా గెలిచిన పలసవాదులు మంత్రి పదవులను కూడా దక్కించుకుంటున్నారు.

**తెలంగాణకి ఆకలి తాపం – ఆంధ్రుల పాలనదే ఈ పాపం**

# తెలంగాణపై వివిధ రాజకీయ పార్టీలు




## కాంగ్రెస్ పార్టీ

ఏ ఎండ కాగొడుగు పట్టే వారిలో కాంగ్రెస్ వారే అగ్రేసరులని అందరికీ తెలిసిన విషయమే మొగున్ని కొట్టి మొత్తుకున్నట్లు తెలంగాణ కష్టాలకు అసలు కారకులు కాంగ్రెస్ వారే కాగా, కొంగ జపంలా తెలంగాణ వెనుకబాటుపై ఇతర పార్టీలను విమర్శించడంలో మాత్రం ముందుంటారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటు నుండి ఏకధాటిగా 26 సంవత్సరాలు అధికారంలో వున్నది కాంగ్రెస్ పార్టీయే. అంతేగాకుండా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌ను విలీనం చేశారు. విలీన ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరు ప్రాంతాల నాయకులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారే. కాంగ్రెస్ పక్షపాత పాలనకు వ్యతిరేకంగానే 1969లో తెలంగాణ ప్రజలు ఉద్యమించారు. అదే కాంగ్రెస్ హయాంలోనే కాంగ్రెస్ వారే జైఆంధ్రా ఉద్యమాన్ని నడిపించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి హయాంలో సుమారు 400 మంది తెలంగాణ యువకులు నేలకొరిగారు. సుమారు 8 దశాబ్దాల చరిత్రను కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీని 1971 నాటి పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఛీకొట్టారు ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ ప్రజాసమితికి ఓటు వేసి తమ ప్రత్యేక రాష్ట్ర కోరికను వెలిబుచ్చినా, ప్రజాభిప్రాయాన్ని పాతరలో పెట్టింది కేంద్రంలోనున్న ఆనాటి కాంగ్రెస్ పార్టీయే.

'కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్టు' ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించినప్పుడల్లా తెలంగాణ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు 'గుంపులో గోవింద' అన్నట్లు తెలంగాణ నినాదాన్ని అందుకొని తమ ఉనికిని కాపాడుకోవాలనే తాపత్రయంతో ఉద్యమానికి తూటు పొడవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇదే తంత్రంలో భాగంగా ఇటీవల తూతూ మంత్రాలతో తెలంగాణ కాంగ్రెస్ ఫోరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఫోరం అరుపులు అధిష్టానం చెవికి సోకక పోవడమే కాదు, పిసిసి అధ్యక్షుల వారికే శాపనార్థాలుగా వినిపించినట్లు పరిస్థితులు తెలియజేస్తున్నవి. తెలంగాణ మీద అభిమానం ఉన్న ఒక కాంగ్రెస్ నాయకుడు కూడా తన వ్యక్తిగత లాభాలను ఫణంగా పెట్టడానికి సిద్ధపడడం లేదు.

'అయితే ఆడబిడ్డ, లేకపోతే మగబిడ్డే' అనేదే అసలు సూత్రం కాగా, కాంగ్రెస్ పార్టీలోని నాయకులే సమైక్య రాష్ట్రమే ఉండాలని కొందరు, ప్రత్యేక రాష్ట్రమే కావాలని

**కలిసుండాలనేది బూటకం - కాజేయాలన్నదే అసలైన నాటకం**

మరికొందరు వాదిస్తూ ఆ పార్టీపై చులకన భావం కలిగిస్తున్నారు. ఇదిలా ఉండగా, అత్యధిక శాసనసభా స్థానాలు కోస్తా ఆంధ్రలో ఉండగా, మూడింట ఒకవంతు మాత్రమే తెలంగాణ శాసనసభ్యులతో ఏ ముఖ్యమంత్రి పదవికీ ఎదురుదెబ్బ తగిలే అవకాశం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రిని దించడానికి కాంగ్రెస్ పార్టీలోనే కుట్రలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ ఏక కుటుంబం పార్టీగా ఎదిగినందున ఆ పార్టీకి తెలంగాణ వ్యక్తులకు ముఖ్యమంత్రి పదవులను కట్టబెట్టలేకపోయింది. దించే అవకాశమే దక్కలేదు.

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచి, హింసాత్మకంగా మారి, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడినప్పుడు కూడా ఆంధ్ర ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిని కొనసాగించారు. కానీ మూడు నెలల జైఆంధ్ర ఉద్యమం ఫలితంగా ఒక వ్యక్తి కూడా మరణించకపోయినా, తెలంగాణ ముఖ్యమంత్రిని దించేసింది కాంగ్రెస్ పార్టీయే.

## కమ్యూనిస్టులు

అధినాయకత్వంలో ఉన్న ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులకు ఎదురు చెప్పే నాయకులు తెలంగాణ కమ్యూనిస్టులలో లేనందున కమ్యూనిస్టు పార్టీ ఎంచుకున్న విశాలాంధ్ర వాదానికి ఎటువంటి అడ్డంకి ఎదురుకాలేదు. నిజాం మీద వీరోచిత పోరాటం సాగించిన కమ్యూనిస్టులకు విశాలాంధ్ర నినాదం ఆ గొప్పతనానికి గుర్తింపు లేకుండా చేసింది ఈనాటికి కమ్యూనిస్టులు గుణపాఠం నేర్చుకోకపోవడమే విచిత్రం. ఇంకా చెప్పాలంటే కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా కాకుండా పొట్టి శ్రీరాములు మరణంతోనే సమైక్య రాష్ట్ర వాదం ఊపందుకున్నదని ఇంకొందరు వాదిస్తారు. తెలంగాణ విముక్తి కొరకు గాని, సమైక్య రాష్ట్రం కొరకు గాని వీరు చేసిన పోరాటం ప్రజల హృదయాలను చేరుకోలేక పోయింది. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు తెలంగాణ కమ్యూనిస్టు కార్యకర్తలను జెండాలను, తుపాకులను మోసే వారుగానే భావించారుగాని, ఏనాడు భావ ప్రకటన స్వేచ్ఛకుగాని, కలం పట్టుకునే అవకాశానికి గాని స్థానమీయలేదు.

తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణ త్యాగం చేశామని ఈనాటికీ జపంలా వల్లిస్తున్నారు. కానీ ఏ పార్టీ వారైనా ఆనాడు చనిపోయింది కూడా తెలంగాణ వాసులే అని మర్చిపోరాదు. ఆరోజు పోరాడిందానికి ఆనాడే గౌరవం చూపించి కమ్యూనిస్టులకు తెలంగాణ ప్రజలు పెద్దపీట వేశారు. ఆ వాసనే ఇంకా తెలంగాణలో కమ్యూనిస్టులను బ్రతికిస్తున్నది. కమ్యూనిస్టు అధినాయకత్వం తీసుకున్నవన్నీ తప్పుడు చర్యలే అయినందువల్ల ఆ పార్టీ కనుమరుగై పోవడంలో తెలంగాణ ప్రజలను నిందించడం భావ్యం కాదు. నాయకత్వంలో ఆంధ్రులకే పెద్దపీట వేస్తూ రాధాకృష్ణమూర్తి, బోడేపూడి వెంకటేశ్వరరావు, పువ్వాడ నాగేశ్వరరావు, రాయల సుభాష్ చంద్రబోస్, తమ్మినేని వీరభద్రం, బి.వి.రాఘవులు, నారాయణ వీరంతా ఆంధ్రులే కావడం గమనార్హం.

నీటి వనరులన్నీ కోస్తాకే పారు - కేటాయింపులన్నీ ఆంధ్రాకే సుమారు

ప్రత్యేక రాష్ట్ర వాదంపట్ల కమ్యూనిస్టులు సైంధవునిలా అడ్డుపడుతున్నారు. కష్టపడి 'ఇల్లుకట్టి కల్లుతాగి తగులబెట్టినట్లు' విప్లవాలతో నిజాం నిరంకుశత్వం నుండి తెలంగాణను విడిపించడానికి ప్రాణత్యాగాలు చేశామని గొప్పగా చెప్పుకుంటూ విలీన సమయంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించి తెలంగాణను కసాయి చేతిలో పెట్టడం వైపే మొగ్గు చూపారు. వీరి అనాటి నిర్వాకం వల్ల రాష్ట్రంలో గడచిన 45ఏళ్ళ నుండి అధికారపు దరిదాపుల్లోకి రాలేకపోయారు దీంతో తెలంగాణ కోసం వారు చేసిన త్యాగాలన్ని బూడిదలో పోసిన పన్నీరయింది సమైక్య రాష్ట్ర ఏర్పాటు మంచి నిర్ణయమే అయివుంటే ఈనాటికి ఏనాడో వారికి రాష్ట్ర అధికారం దక్కి ఉండేది. సమైక్య రాష్ట్ర ఏర్పాటును ప్రోత్సహించి కొంత ఉనికిని కోల్పోగా, మరోసారి ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తూ ఉన్న కాస్త ఉనికిని కూడా ఊడ్చుకున్నారు. తెలంగాణ ప్రజల ఈనాటి శాపనార్థాలకు మరో నూరేళ్ళ వరకు కమ్యూనిస్టులకు రాష్ట్ర పగ్గాలు దక్కే అవకాశాలు లేవు భాష ఒక్కటైనందున కలిసుండాలని కాకి గోల చేస్తున్న కమ్యూనిస్టులు వారి పార్టీలో మాత్రం కలిసుండలేక కుక్కలు చింపిన విస్తరిలా ముక్కలు ముక్కలుగా విడిపోయారు. కమ్యూనిస్టుల చీలికల వల్ల పుట్టినన్ని పార్టీలు దేశంలో మరే పార్టీ నుండి కూడా పుట్టలేదంటే ఆశ్చర్యం లేదు.

కోస్తా పెద్దలకు జంట వాయిద్యంగా మారి సమైక్యతా రాగాన్ని వినిపిస్తూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని ప్రగల్భాలు పలుకుతూ ఆంధ్ర పాలకుల వివక్షను నిలువరించడంలో విఫలమై వీరు పిచ్చి చూపులు చూస్తున్నారు. తెలంగాణ ప్రాంతీ బోర్డును తెలుగుదేశం అధినేత రద్దుపరచిన రోజున కానీ, 610 జీవో విషయంలో కాని ఒక పేపర్ స్టేట్మెంట్‌తో తెలంగాణ ప్రజలకు సంతోషం కలిగించినా, తెలంగాణ వాసులు కమ్యూనిస్టులను అక్కున చేర్చుకొని ఉండేవారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటులో అత్యుత్సాహం చూపించి ఉండకపోతే హైదరాబాదు రాష్ట్రంలో కాంగ్రెస్‌కన్నా ముందు కమ్యూనిస్టులే అధికారాన్ని చేజిక్కించుకుని ఉండేవారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటు తరువాత వాస్తవ దృక్పథాన్ని ప్రదర్శించిన కేరళకన్నా ముందే ఇక్కడ అధికారాన్ని చేజిక్కించుకోగలిగి ఉండేవారు. తమ పార్టీలో తాము విడిపోవడం నేరం కాదంటూనే రాష్ట్ర విభజన మాత్రం తగదని 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' మాట్లాడుతున్నారు.

'ఈనగాచి నక్కల పాలు చేసినట్లు' వీరోచిత పోరాటాలతో నిజాం చెరనుండి విడిపించి హైదరాబాదును సమైక్య రాష్ట్రం పేరుతో విలీనం చేసిన పాపంలో కాంగ్రెస్ తర్వాతి పెద్ద పాపం వీరిదే. ఈ పరిస్థితులలో తెలంగాణ వాసులు కమ్యూనిస్టులను నమ్ముకోవడం 'గొడ్డుటావుకు పాలు పితికినట్టు'గానే ఉంటుంది

# తెలుగుదేశం పార్టీ

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాకే తెలంగాణ కష్టాలు రెట్టింపయ్యాయి. ఆంధ్రుల ఆధిపత్యం మరింత పెరిగింది. కమ్మ కులస్తుల పార్టీగా చెప్పుకునే స్థితికి తెలుగుదేశం దిగజార్చబడ్డది. తెలుగుదేశం అధినేత రామారావుకు రాజకీయ పరిజ్ఞానం లేకపోవడం వల్ల, ఆయన ఆంధ్ర అధికారులపైనే ఎక్కువగా ఆధారపడినందున ఆయన తీసుకున్న చర్యలన్నీ తెలంగాణకు నష్టమే కలిగించాయి. ప్రాంతీయాభివృద్ధి బోర్డు రద్దు మొదటి వివక్ష కాగా, శ్రీరాంసాగర్ దిద్దుకున్న తెలుగుగంగ పథకంతో తెలంగాణ నిధులకు కోత పడింది. వీరి పాలనా కాలంలో స్థాపించబడ్డ విశ్వవిద్యాలయాలన్నీ ఆంధ్ర, రాయలసీమ, రాజధాని ప్రాంతాలకే పరిమితమైనాయి. అప్పటికే రాజధానిలో ఉన్న వైద్య విద్యాలయాన్ని విజయవాడ వైద్య విధాన పరిషత్తులో భాగంగా మార్చారు. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేశారు. నల్గొండలో ఏర్పాటు చేయ సంకల్పించి, ప్రారంభించిన ఓపన్ యూనివర్సిటీని రాజధానికి తరలించారు.

తెలుగుదేశం కుటుంబ పాలనకు శ్రీకారం చుట్టినందున ఆ పార్టీ తెలంగాణ వ్యక్తులకు ముఖ్యమంత్రి పదవులను గత 23 ఏళ్ళ నుండి కట్టబెట్టలేక పోవడమే కాక, తెలుగుదేశం పార్టీ ఉన్నంతవరకు కట్టబెడుతుందన్న గ్యారంటీ లేదు. మామా అల్లుళ్ళు భాగాలను పంచుకొని 17 ఏళ్ళ కాలాన్ని పాలించి ఒకరిని మించి ఒకరు తెలంగాణాకు జరిగే నష్టంలో పోటీపడ్డారు. రామారావు, చంద్రబాబుల నాయకత్వంలో ఆంధ్ర, రాయలసీమలకు వడ్డింపులు పెరిగాయి. ఆంధ్ర ఉద్యోగుల స్థానంలో తెలంగాణ వారిని నింపాల్సిన పరిస్థితి తలెత్తినప్పుడు "నేను కొట్టినట్లు నటిస్తా, నీవు ఏడ్చినట్లు నటించు" అన్నట్లు క్షంటి తుడుపుగా 610 జీవోను విడుదల చేసి రామారావు చేతులు దులుపుకోగా, దాన్ని అమలు చేయకుండా అడ్డుకోవడంలో తొమ్మిదిన్నరేళ్ళపాటు చంద్రబాబు విజయం సాధించాడు. ఆంధ్ర సంస్కృతిని రుద్దే ప్రయత్నం కూడా తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలోనే అధికంగా పెరిగింది.

తెలుగుదేశం పార్టీ కాలంలో తెలంగాణకు దక్కింది శంఖుస్థాపన రాళ్ళే. ఒక పథకం కూడా కార్యరూపం దాల్చలేకపోయింది. ఆంధ్ర, రాయలసీమలకు చెరో విశ్వవిద్యాలయాన్ని కట్టబెట్టిన తెలుగుదేశం పార్టీ తెలంగాణకు మాత్రం ఎందుకు కట్టబెట్టలేకపోయిందో ఇక్కడి ప్రజలు ఆలోచించాలి. మారుమూల ఉన్న కుప్పంలో ఏకంగా ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని చంద్రబాబు స్థాపించి పక్షపాత పాలనలో ఆ పార్టీని పరాకాష్ఠకు చేర్చాడు.

**టిడిపికి ఓటేస్తే మారు మారు - తెలంగాణకు తప్పదు బ్రతుకు పోరు**

## భారతీయ జనతా పార్టీ

జనసంఘ్‌గా ఉన్నప్పుడు సమైక్య రాష్ట్ర ఏర్పాటును బహిరంగంగా విమర్శించి ఈ పార్టీ తెలంగాణ బాసటగా నిలిచింది ఆనాడు జనసంఘ్ నేతగా ఉన్న అటల్ బిహారి వాజ్‌పాయ్ హైదరాబాదును ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని, దేశంలోని మరిన్ని చిన్న రాష్ట్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈనాటి వరకు కుండబద్దలు కొట్టినట్లు చెబుతూ వచ్చాడు. భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందిన తర్వాత కూడా చిన్న రాష్ట్రాలను ఏర్పాటుకు కట్టుమడినట్లు ఆ పార్టీ ప్రకటించింది. 'ఒక ఓటు రెండు రాష్ట్రాలు' అని చిలుక పలుకులు పలికిన బిజెపి గద్దెనెక్కిన తర్వాత 'ఒకే పార్టీ – రెండు విధానాలు' అన్నట్టుగా ప్రవర్తించింది. తన పాలనా కాలంలో దేశంలో మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి, తెలంగాణ వాసుల్లో ఆశలు రేపింది. తమ పార్టీ కాకినాడలో ప్రత్యేక తెలంగాణ కొరకు తీర్మానం చేశామని చెప్పుకుంటూ, తెలంగాణను ఏర్పరచడానికి ఎలాంటి ప్రయత్నం చేయకుండానే ఆరేళ్ళ అధికారాన్ని వెలగబెట్టారు. అయితే, సంకీర్ణ ప్రభుత్వంలో పూర్తిగా తెలుగుదేశం పార్టీపై ఆధారపడి ఉన్నందున తెలంగాణ అంశాన్ని పక్కన పెట్టాల్సి రావడం ఇక్కడి ప్రజల దురదృష్టమే. 2004 వరకు తెలంగాణ అంశం ఎత్తలేమని బిజెపి జాతీయ నాయకులు ఆదేశించడంతో రాష్ట్ర బిజెపి మూగబోయింది 2004 తర్వాత బిజెపి తన ఉనికినే కోల్పోయినందున ప్రత్యేక రాష్ట్రం కొరకు పోరాడేశక్తి లేదని తెలుస్తున్నది అయినా ఒకసారి తెలంగాణ అంశం మీద ఇక్కడి ప్రజలకు నమ్మకం లేకుండా చేసినందున మరోసారి ఆ పార్టీ తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టినా, నమ్మే అవకాశం అంతగా ఉండకపోవచ్చు. ఏదో ఒక పార్టీ ఆసరాతో రాష్ట్రంలో నెట్టుకొస్తున్న ఈ పార్టీని నమ్ముకుంటే తెలంగాణ సాధ్యమయ్యేది కాదు.

రాష్ట్రంలో బిజెపి ఉనికికి సహకరించిన మూలస్తంభంగా పేరు గడించిన నరేంద్ర ఇప్పటికే ఆ పార్టీకి దూరమయ్యాడు. ఇక మిగిలిందల్లా కోస్తా నాయకులు, తెలంగాణ ఓటర్లతో మినుకు మినుకు మంటున్నది. అధికారంలో ఉన్ననాడు ఏమీ చేయలేని ఈ పార్టీ అధికారం పోయిన తర్వాత ఏదో చేస్తానంటే నమ్మలేని స్థితి. త్వరలోనే నాయకులు మాత్రం ఉండి కార్యకర్తలు లేని పార్టీగా మిగలబోయే బిజెపిని నమ్ముకోవడం తెలంగాణ రాష్ట్రసాధనలో అత్యాశే అవుతుంది.

## తెలంగాణ రాష్ట్ర సమితి

ఏప్రిల్ 21, 2001న తెలుగుదేశం ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేస్తున్న కల్వకుంట చంద్రశేఖర్‌రావు చంద్రబాబు నాయుడుపై తిరుగుబాటు బావుటాను ఎగురవేస్తూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకై 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని స్థాపించాడు 1972 తర్వాత పుట్టిన తెలంగాణ పార్టీలలో టీఆరెస్సే అతి పెద్ద పార్టీ అని

చెప్పుకోవచ్చు. పుట్టీ పుట్టగానే సంచలన విజయాలను సాధించి, ఆ పార్టీ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది ఇక్కడి ప్రజలు కూడా మిగతా తెలంగాణ పార్టీలకన్నా, ఆ పార్టీని అధికంగానే ఆదరించి, అక్కున చేర్చుకున్నారని, అప్పట్లో జరిగిన స్థానిక ఎన్నికలు రుజువు చేశాయి డిప్యూటీ స్పీకర్ పదవికి శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి, ఎంతో కొంత త్యాగం చేసిన చంద్రశేఖర్ రావును ప్రజలు నమ్మడం న్యాయమే 'ఉద్యమం నుండి విరమించుకుంటే రాళ్ళతో కొట్టి చంపే హక్కును తెలంగాణ ప్రజలకిస్తున్నా'నని ఆయన బాహటంగా చెప్పిన పలుకులు ఇక్కడి ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. ఈ ప్రకటన 1969నాటి ఉద్యమంలో 'బానిస బ్రతుకు కన్న చావే మేలు' అనే నినాదంతో ఆనాడు ప్రజలను మేల్కొలిపిన కె.వి.రంగారెడ్డి ప్రకటనను గుర్తుకు తెస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర సమితిలో బిజెపి నుండి రాజీనామా చేసి బయటకు వచ్చిన నరేంద్ర చేరటంతో ఆ పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచింది. అడపా, దడపా మానవ సహజమైన తప్పులతో, కొన్ని తప్పుడు నిర్ణయాలతో ఈ పార్టీ తెలంగాణ సాధనలో ఎగుడు దిగుడులను ఎదుర్కొంటున్నా ఇంకా చిత్తశుద్ధితోనే పని చేస్తున్నదని ప్రజలు నమ్ముతున్నారు. గత నాలుగేళ్ళ నుండి ప్రత్యేక తెలంగాణ సమస్యను ఆరిపోనీకుండా రావణకాష్టంలా రగిలిస్తూ వస్తున్న టీఆర్ఎస్ మంటలకు తలో సమిధను ఇక్కడి ప్రజలు సమర్పించగలిగితే ప్రత్యేక రాష్ట్రం మరింత వేగంగా ఏర్పడుతుందనడంలో సందేహం లేదు

గత సాధారణ ఎన్నికల్లో గొర్రెను కసాయిని నమ్మినట్లు కాంగ్రెస్ పార్టీని నమ్మి, ఆ పార్టీతో కలిసి పోటీ చేసి, అధికారాన్ని పంచుకొని, ఉద్యమాన్ని వెనుకంజ వేయించారనడంలో సందేహం లేదు. అయితే, తమ తప్పును తొందరగానే తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుండి తెరాస వైదొలగి ఉద్యమానికి జవజీవాలు కల్పించారు తర్వాత జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా ముందు చేసిన తప్పును గుర్తించి ఒంటరిగా పోటీ చేయదానికి సంకల్పించడంతో మళ్ళీ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మేలుకొంది. ఉద్యమ పంథాను మార్చే ఉద్దేశ్యంతో ఆ పార్టీ నాయకులు 'తెలంగాణ జాగరణ సేన'ను సృష్టించడం మరో మేలిమలుపు అని చెప్పక తప్పదు. ఇక భవిష్యత్ ఉద్యమమంతా టిజెఎస్ మార్గదర్శకత్వంపైనే ఆధారపడి ఉండొచ్చని విశ్లేషకులంటున్నారు

భారతీయ జనతా పార్టీలో గుర్తింపు పొంది, తెలంగాణకు అనుకూలంగా మొదటినుండి మాట్లాడుతున్న విజయశాంతి 'తల్లి తెలంగాణ' పార్టీని రిజిష్టరు చేయడం కూడా ఉద్యామానికి టానికు లాంటిదే. అయితే 'విభజించు-పాలించు' అనే పద్ధతివైపు ఉద్యమం సాగే పరిస్థితి ఉన్నందున విజయశాంతి తన నిర్ణయాన్ని పునరాలోచించుకొని తెరాసతో చేతులు కలిపితే ఉద్యమం మరింత బలపడుతుందని ఆశించవచ్చు.

ప్రత్యేక రాష్ట్రంలో బ్రతుకులు మారి తీరు [redacted] చూడొచ్చు మారుతీరు

## పిచ్చిమొక్కగా ఎదుగుతున్న తెలంగాణ కాంగ్రెస్ ఫోరం

"దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరందాకా తన్ని తరుముతాం
ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోటే పాతర బెడతాం" - కాళోజి

కాళోజి పైన చెప్పినట్లుగా తెలంగాణ ప్రత్యేక ఉద్యమానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోని తెలంగాణ నాయకులు ఆనాటి నుండి కంటిలో నలుసులా తయారయ్యారు. 1969 నాటి ఉద్యమం కూడా కాంగ్రెస్ నాయకుల చేతుల్లోకి పోయిన తర్వాతే లక్ష్యానికి దూరమైపోయింది. తెలంగాణ ఉద్యమం పుట్టినప్పుడల్లా కాంగ్రెస్‌లోంచి ఓ పిచ్చి మొక్కలా 'తెలంగాణ కాంగ్రెస్ ఫోరం' పుట్టుక రావడం ఆనవాయితీ అయింది. ముందుగా ఈ పిచ్చి మొక్కను పీకివేయలేకపోతే ఆ పిచ్చి మొక్క ఎప్పటికైన ప్రత్యేక రాష్ట్ర లక్ష్య సాధనకు 'క్యాన్సర్' లాంటిదే.

ఉద్యమాలను పుట్టించి, వాటిని మధ్యలోనే విడిచిపెట్టి, అధికార పదవులను దక్కించుకోవడానికే కాంగ్రెస్ నాయకులు నాటి నుండి నేటివరకు ఉపయోగించిన పద్ధతిలో భాగమే ఈ 'ఫోరాలు'. రాయలసీమ విమోచన కొరకు ఉద్యమాలను నడిపించిందే కానీ, పదవులను దక్కించుకున్నారే తప్ప రాయలసీమ విమోచన కలిగించలేకపోయారు. జైఆంధ్రా ఉద్యమం కాంగ్రెస్ నీడలోనే ఎదిగి, చిల్లర రాజకీయ నాయకులను అందలం ఎక్కించడానికే తోడ్పడింది ఇంకో విచిత్రమేమిటంటే, ఓవైపు తెలంగాణ ఉద్యమాన్ని, మరోవైపు జై ఆంధ్ర ఉద్యమాన్ని ఏకకాలంలో నిర్వహించిన ఘన చరిత్ర ఒక్క కాంగ్రెస్ పార్టీదే. ఆ తర్వాత రెండు ఉద్యమాలను గాలికి వదిలి కలిసి అధికారం పంచుకున్నది కూడా అదే.

కాంగ్రెస్ అధిష్ఠానం రెండోసారి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘాన్ని నియమించాలని సోనియాగాంధీ కోరడం, దానిని తెలంగాణ కాంగ్రెస్ ఫోరం బలపర్చడం 'నిజమైన స్టంట్'గా భావించాలి. 1956 తర్వాత దేశంలో ఎన్నో రాష్ట్రాల ఏర్పాటుకు ఎటువంటి ఎస్సార్సీ అవసరం లేకపోయినా, తెలంగాణ ఏర్పాటుకు మరో ఎస్సార్సీ అవసరమే అని తెలుపడం తెలంగాణ కాంగ్రెస్ ఫోరం ఆడుతున్న నాటకం. ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపించాలన్నా, సమైక్యవాదులను ఎదుర్కోవడం కన్నా ముందు తెలంగాణ కాంగ్రెస్ ఫోరం వారిని కనుమరుగు చేయడమే ఉత్తమం అని ఉద్యమాన్ని నడిపిస్తున్నవారు గుర్తించాలి. 1969లో ఏకంగా ఉద్యమం పేరును ఆసరా చేసుకొని 1972 ఎన్నికల్లో పార్లమెంటు ఎన్నికల్లో గెలిచిన వారిలో అందరూ కాంగ్రెస్ పదవులను అనుభవిస్తూ, ఆనాటి లక్ష్యాన్నే మరిచిపోయి ప్రవర్తిస్తున్నారు. ఈనాడు సమైక్య రాష్ట్రానికి బాగా ఊదుతున్న వెంకటస్వామి, సత్యనారాయణరావు లాంటివారు ఆనాడు తెలంగాణ ప్రజాసమితి ద్వారా రాజకీయాల్లోకి వచ్చినవారే. ఇంతకాలం కళ్ళు మూసుకుని కూర్చుని ఇప్పుడు అదే నాయకులు తెలంగాణ కాంగ్రెస్ ఫోరంతో మరోసారి మోసం చేయజూస్తున్నారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ, తెలంగాణ కొరకు పోరాడుతామని చెప్పే ఈ ఫోరం వారిని 'శల్యుడు' కర్ణునికి సారథ్యం వహించినట్లే భావించాలి

**భారతీయ జనతా నోరుజారు - కాంగ్రెస్ పార్టీ కాలుజారు**

# గత రెండున్నరేళ్ళలో వై.ఎస్.ఆర్. పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలు

"చంద్రబాబునాయుడును గద్దె దించితే తెలంగాణ రాష్ట్రం వచ్చేసినట్లే" అని భావిస్తున్న తరుణంలో శాసనసభకు ముందస్తు ఎన్నికలు రావటం, ఆ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం కొరకు పోరాడుతున్న తెలంగాణ రాష్ట్ర సమితి కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేయడం, ఎన్నికల్లో చంద్రబాబు చిత్తు చిత్తుగా ఓడిపోవడం లాంటివి ప్రత్యేక రాష్ట్రం కొరకు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజల కళ్ళలో కాంతిరేఖలు నింపాయి. కాని ఆ సంతోషం వాస్తవరూపం దాల్చకుండా నూతన ముఖ్యమంత్రిగా వచ్చిన డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అడుగడుగునా సైంధవునిలా అడ్డుకుంటున్నారు. రామేశ్వరం పోయినా శనేశ్వరం పోలేదన్నట్లు చంద్రబాబు పోయి రాజశేఖరరెడ్డి వచ్చినా తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇంకా చెప్పాలంటే తొమ్మిదేళ్ళ పాలనలో చంద్రబాబు చేసిన నష్టంకన్న రెండున్నరేళ్ళలో వై ఎస్.ఆర్. ఎక్కువ నష్టాన్ని కలుగజేశాడు. అయిదూళ్ళు ఇవ్వమన్నా ఇవ్వనని మొండికేసిన దుర్యోధనుని పాత్రను పోషిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు. రాయలసీమ ప్రాంతానికే చెందిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిలు ఒకరిని మించి మరొకరు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యేక రాష్ట్ర ఆశయాన్ని కొరకరాని కొయ్యలా మార్చాలని కలలు కంటున్నారు.

గత 50 సంవత్సరాలలో ఈయన కన్న ముందు పరిపాలించిన ఆంధ్రా ముఖ్యమంత్రులు ఇక్కడి నీటివనరులను, ఉద్యోగాలను గుండుగుత్తగా కొల్లగొట్టిన దానిని రాజశేఖరరెడ్డి కూడా కొనసాగించడానికే కంకణం కట్టుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత ముఖ్యమంత్రి పదవీ కాలంలో తెలంగాణకు జరిగిన నష్టాలను స్థూలంగా పరిశీలిద్దాం.

★ ఉద్యోగాలు : చంద్రబాబు నుండి వారసత్వంగా సంక్రమించిన 610జీవో సమస్యను రాజశేఖరరెడ్డి కూడా పరిష్కరించకుండా మీనమేషాలను లెక్కిస్తూ పబ్బం గడుపుతున్నాడు. తెలంగాణలో రెండున్నర లక్షల మంది ఆంధ్రులు పనిచేస్తుండగా, గిర్‌గ్లాని కమిషన్ ప్రకారం వారిని స్వస్థలాలకు పంపించాలని మంత్రివర్గం నిర్ణయించినప్పటికీ ఎటువంటి చర్య తీసుకోకుండా నానుస్తున్నారు. జీవోను అమలు చేయాల్సిన సందర్భం

ఎదురైనప్పుడల్లా దానిని దాటవేయడానికి అవసరమైన జిమ్మిక్కులు సృష్టిస్తున్నాడు. ఈ జీవోను అమలు చేయడానికి మరో జీవో విడుదలకు ఆరు మాసాలు, అలా విడుదల చేసిన జీవోను రద్దు చేయడానికి మరో ఆరుమాసాలు, మంత్రివర్గ ఆమోదానికి ఇంకో ఆరుమాసాలు, కమిటీల పేరుతో మరికొంత కాలం ఇలా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ రోమ్ నగరం తగలబడిపోతుంటే పిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో చక్రవర్తిని తలపింపజేస్తున్నాడు. జీవో అమలుపై మరీ ఒత్తిడి వచ్చినప్పుడు ఆంధ్రా, రాయలసీమ శాసనసభ్యులతో అవాకులు-చెవాకులు పేల్పిస్తూ నాటకలాడాలని చూస్తున్నాడు

★ ప్రభుత్వ ఉద్యోగాలలో అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి రాబోయే ఉద్యోగాలన్నింటిని ఆంధ్రా, రాయలసీమ వారికే కట్టబెట్టాలని కుయుక్తులు పన్నుతున్నాడు. ఇప్పటికే కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల పేరుతో ఇరవై వేల ఉద్యోగాలను అస్మదీయులకు కట్టబెట్టారు. అటెండర్లు, డ్రైవర్లు లాంటి పోస్టుల్లో తెలంగాణవారు అధికంగా ఉన్న కారణంచే ఆ పోస్టులనే రద్దు చేయాలని అంటున్నారు ఇదే స్థానంలో అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలను నింపే ప్రయత్నం చేస్తున్నారు. సింగరేణి, ఆర్టీసి లాంటి వాటిని ప్రైవేట్ పరం చేయడానికి ఇటీవలే జీవో 5ను విడుదల చేసి తన నైజాన్ని చాటుకున్నాడు. తద్వారా ఆంధ్రా, రాయలసీమ కాంట్రాక్టర్లకు, ప్రైవేట్ మోటారు ఆపరేటర్లకు లాభం కలిగించాలని చూస్తున్నాడు.

★ **పోలవరం ప్రాజెక్టు :** తెలంగాణ జిల్లా అయిన ఖమ్మంకు చెందిన లక్షలాది ఆదివాసుల, పేద ప్రజల ఆర్తనాదాలను లెక్కచేయకుండా వందలాది గ్రామాలను ముంపుకు గురిచేస్తూ ఆంధ్రా ప్రాంతానికి నీళ్ళందించే పోలవరాన్ని నిర్మించి తీరతానని రోజుకో ప్రకటన గుప్పిస్తున్నారు

★ **పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ :** విద్యుత్ ఉత్పాదన కొరకు నిర్మించబడ్డ శ్రీశైలం ప్రాజెక్టు నుండి మద్రాసు నగరానికి మంచినీటిని అందించే నెపంతో ఆ ప్రాజెక్టుకు గండికొట్టి రాయలసీమ రైతాంగానికి ఈయనకన్న ముందున్న పాలకులు పంచిపెట్టగా, ఈయన ఏకంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కుల నుండి నలుబది నాలుగువేల క్యూసెక్కులకు పెంచుతూ రహస్యంగా జీవోను జారీ చేశాడు. తన స్వంత జిల్లా కడపకు లాభం కలిగించడానికి మూడు కోట్ల తెలంగాణా వాసులను నట్టేట్లో ముంచడానికే సిద్ధమయ్యాడు. తద్వారా కృష్ణానదిపై తెలంగాణలో

నిర్మించాలనుకున్న ఎత్తిపోతల పథకాలను ఎత్తివేయబోతున్నానని చెప్పకనే చెప్పినట్లయింది. అంతేగాక ఈ స్వార్థపూరిత చర్య వల్ల భవిష్యత్తులో రాజధాని నగరప్రజలకు త్రాగునీరు కూడా లభించకపోయే ప్రమాదముంది.

★ పులిచింతల ప్రాజెక్టు : కృష్ణా నదిలో ఇప్పటికే మొత్తం నీటిని వినియోగించుకుంటూ రెండు పంటలు పండించుకుంటున్న కృష్ణా డెల్టాను అదనంగా ఒక ఎకరా ఆయకట్టు లేనప్పటికి ముచ్చటగా మూడవ పంట పేరుతో పులిచింతలను నిర్మిస్తానంటున్నాడు. తద్వారా నల్గొండ జిల్లాలోని ఎన్నో భూములు, సాగర్ ఆయకట్టు గ్రామాలు, కోట్ల విలువైన సున్నపురాయి నిక్షేపాలు మునిగిపోతాయని తెలుస్తున్నా ఖాతరు చేయడం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ఎత్తిపోతలకుగాని, భవిష్యత్తులో నిర్మించబోయే ప్రాజెక్టులకు నూకలు చెల్లినట్లే.

★ రాజోలిబండ డైవర్షన్ స్కీం : మహబూబ్‌నగర్ వ్యవసాయానికి దక్కాల్సిన నీటిని రాజోలిబండ డైవర్షన్ స్కీం నుండి రాయలసీమ నాయకులు అక్రమంగా, దౌర్జన్యంగా కొల్లగొట్టుకొని తీసుకుపోతున్నా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాగే రాజశేఖరరెడ్డి కూడా ధృతరాష్ట్రుని పాత్రనే పోషిస్తున్నాడు.

★ ఆంధ్రాలో నిర్మించిన ప్రాజెక్టులతో ఒక టి.ఎం.సి. నీటికి మూడువేల ఎకరాల పారకమని, తెలంగాణలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల క్రింద ఒక టిఎంసికి ముప్పై మూడువేల ఎకరాల పారకమని నిర్ధారించడం తెలంగాణ అభివృద్ధికి వైఎస్ఆర్ ఇస్తున్న వికృత నిర్వచనం.

★ ప్రభుత్వ, పేద రైతుల భూముల అమ్మకం : హైదరాబాద్ చుట్టుప్రక్కల ఉన్న మూడు నాలుగు జిల్లాల్లోని ప్రభుత్వ, పేద, దళిత రైతుల భూములన్నింటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నాడు. రైతులకు నామమాత్రపు ధర చెల్లించి భూములను కైవసం చేసుకుంటూ మధ్య దళారీల ఆసరాతో ప్రభుత్వమే (హుడా) రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నది. గద్దెనెక్కిన వెంబడే జలయజ్ఞం పేరుతో ఏకకాలంలో 38 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, నిధులన్నింటిని కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అవినీతికి తలుపులు బార్లా తెరిచాడు. ఈ డబ్బును రాజధాని నగరం చుట్టూ ఉన్న భూములను కొనుగోలు చేయడానికి వినియోగిస్తూ సామాన్యునికి అందుబాటులో లేనంతగా భూమి ధరలను పెంచుతున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు అస్మదీయులకు లాభం చేకూర్చే ఉద్దేశ్యంతో అవుటర్

రింగ్‌రోడ్డును ప్రారంభించి, తనవారి భూములను తప్పిస్తూ, పేదల భూములను కృష్ణార్పణం చేస్తూ, అవుటర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంటును గంట గంటకు మారుస్తూ గారడీ చేస్తున్నాడు.

★ ప్రైవేటు కంపెనీలకు ఉదారంగా భూములు ధారాదత్తం : ఫ్యాబ్‌సిటీ, ఐ.టి.పార్కు, హార్డ్‌వేర్ పార్కులనే పేరుతో ఆయా కంపెనీలకు తెలంగాణ ప్రజల నుండి బలవంతంగా భూములను సేకరిస్తూ, ఆ కంపెనీలకు అవసరమైన దానికన్నా అధికంగా భూములను కట్టబెడుతున్నారు. అదే భూమితో తరువాత కాలంలో ఆ కంపెనీలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాయి.

★ మెట్రోపాలిటన్ సిటీ : వివిధ పథకాల పేరుతో ఇప్పటికే తెలంగాణకు చెందిన రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్ నగరంలో కలపడమే కాకుండా కొత్తగా మరికొన్ని జిల్లాలను కూడా హైదరాబాద్ నగరం క్రిందకు తేవాలని ప్రయత్నిస్తున్నాడు. అందులో భాగంగా ఇటీవలే మెట్రోపాలిటన్ సిటీగా మార్చే హైదరాబాద్‌లో మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలోని కొన్ని మండలాలను కూడా కలుపుతున్నట్లు ప్రకటించాడు. అంటే భవిష్యత్తులో హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతంగా మార్చి తెలంగాణ వాసులకు గండి కొట్టాలని చూస్తున్నారు.

★ విద్య : నాలుగు జిల్లాలున్న రాయలసీమ ప్రాంతంలో ఇప్పటికే జిల్లాకు ఒకటి కన్న ఎక్కువ యూనివర్సిటీలు. ఉన్నప్పటికీ ఇటీవల ప్రకటించిన మూడు యూనివర్సిటీలలో మరో యూనివర్సిటీని ప్రకటిస్తూ, పది జిల్లాల తెలంగాణ ప్రాంతానికి ఒకే యూనివర్సిటీని కేటాయించారు. గురుకుల విద్యాలయాలలో కూడా తెలంగాణాకు అన్యాయమే చేసారు. ఏకంగా కడప జిల్లాలో ప్రభుత్వ రంగంలో వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించాలని నిర్ణయించడం వై.ఎస్.ఆర్. పక్షపాత పాలనకు నిలువెత్తు సాక్ష్యం.

> తెలంగాణ ప్రాంత ప్రజల వెనుకబాటు తనం దూరం అయ్యేవరకు ప్రత్యేక రాష్ట్ర వాదం కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఆందోళనను ఆపగలిగే శక్తి ఎవరికి లేదు. వీలైతే తమ సహాయాన్ని అందించాలి. వీలుకాకపోతే ఒకళ్ళు చేసే ప్రయత్నాలకు అడ్డురాకపోవడం మంచిది.
>
> – కాళోజీ.

**తెలంగాణ అభివృద్ధిని కోరుకోరు – ఎద్దు పుండునే కదా కాకి కోరు**

# సందేహాస్పద అంశాల విశ్లేషణ

## ప్రకృతిపరంగానే తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కాదు

ప్రకృతిపరంగా తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కానేకాదు. వెనుకకు నెట్టీయబడిన ప్రాంతం మాత్రమే. ప్రకృతిపరంగానే తెలంగాణ వెనుకబడినదైతే నిజాం నవాబు రాయలసీమ కోస్తాంధ్రలను ఈస్టిండియా కంపెనీకి ధారాదత్తం చేసే బదులు తెలంగాణనే ధారాదత్తం చేసి ఆంధ్ర ప్రాంతాన్ని ఉంచుకునేవాడు. విలీనం రోజున తెలంగాణ ఆంధ్రకంటే వెనుకబడి వుండలేదు (ఒక్క అక్షరాస్యతలో తప్ప). ఇక్కడ ఆనాడే మిగులు బడ్జెట్ ఉండేది. తుపానుల తాకిడికి తల్లడిల్లిన ఆంధ్రులను ఆదుకోగలిగారు ఇక్కడి మిగులు బడ్జెట్, ఇక్కడి సంపదతోనే సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి పరిచారు. కోస్తాంధ్రలోని అభివృద్ధి చిహ్నాలన్నీ సమైక్యరాష్ట్ర ఏర్పాటు తర్వాతే రూపొందగా, తెలంగాణ అభివృద్ధి చిహ్నాలేమైనా వుంటే అది సమైక్య ఏర్పాటుకు ముందు రూపు దిద్దుకున్నవే.

సకల సంపదలు కలిగిన తెలంగాణ నేడు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకన్నా తెలంగాణ జిల్లా అయిన మహబూబ్‌నగర్‌లోనే అత్యధిక సాగుభూమి వుంది. ఖమ్మం జిల్లాలో అత్యధిక అటవీ సంపద వుంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఎనలేని బొగ్గు నిక్షేపాలున్నాయి. రాష్ట్రంలో పేరుగాంచిన ప్రధాన నదులైన కృష్ణ, గోదావరి నదులకు స్వాగతం పలుకుతున్నది తెలంగాణ ప్రాంతమే. అయినా ప్రకృతిపరంగా తెలంగాణ వెనుకబడిన ప్రాంతమని తెలంగాణేతరులు చెబుతుంటే గొర్రె కసాయి వాడిని నమ్మినట్లుగా మనమంతా తలూపుతున్నాం.

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' అన్నట్లు తెలంగాణకు అన్నీ ఉన్నా కరువే. త్రాగడానికి నీళ్ళులేని ప్రజలు తెలంగాణలోనే ఉన్నారు. తినడానికి తిండిలేనివారు మనవారే. ఉండడానికి ఇల్లులేనిది మన ఊర్లే. చదవడానికి తగినన్ని విద్యాసంస్థలు లేవు. చదివిన వారికి కొలువులు లేవు. వ్యవసాయానికి సాగునీరు లేదు. నీరు ఉంటే కరంటు ఉండదు. పైగా తెలంగాణ ప్రజలకు మోసాలు చేసే కుయుక్తి తెలియదు. మోసాల నుండి రక్షించుకునే యుక్తి తెలియదు. పర్యవసానంగా తెలంగాణవాసులు తరతరాలుగా అష్టకష్టాలనే వంశ పారంపర్య ఆస్తిగా తమ భావితరాలకు అందజేస్తున్నారు. తెలంగాణ వెనుకబాటుకు కారకులుగా నిజాం నవాబును చూపించి ఇంతకాలం ఆంధ్ర పాలకులు పబ్బం గడిపారు. కానీ వాస్తవానికి ఆంధ్ర పాలకులను కారకులుగా చేస్తేనే తెలంగాణ వెనుకబాటుకు

నిజమైన కారకులెవరో తెలుస్తుంది. కృష్ణా, గోదావరిల నుండి నీటిని, సింగరేణి నుండి బొగ్గును, తెలంగాణ ప్రాంతంలోని సున్నపురాయిని ఆంధ్రులు కొల్లగొట్టడం వల్లనే తెలంగాణ ప్రాంతం వెనుకబడి పోయిందనేది వాస్తవం. తెలంగాణలో ఏమీ లేకుంటే ఈ శతాబ్దం ఆరంభంలో చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రపంచంలోనే అందరికన్నా ధనవంతుడుగా ఎలా గుర్తించబడ్డాడు? ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయ్యేనాటికే తెలంగాణలో విమానాశ్రయాలుండేవి. ఇదే కాలంలో ఆంధ్రలో ఒక్క విమానాశ్రయం కూడా లేదనే విషయాన్ని గమనించాలి.

ప్రకృతిపరంగా తెలంగాణ వెనుకబడిన ప్రాంతమని చేస్తున్న గోబెల్స్ ప్రచారమంతా బూటకం. తుఫానువల్లగాని, భూకంపాల వల్లగాని ఎలాంటి ప్రమాదంలేని సురక్షితమైన ప్రాంతం మన తెలంగాణ.గత ఏబది ఏళ్ళలో ఆంధ్రులు నలుబది నాలుగు (44) ఏళ్ళు పరిపాలించారు పాలకులు వారుకాగా పాలితులం మనం. దోపిడీదారులలో అధికులు వారుకాగా, దోపిడీకి గురిచేయబడుతున్న వారిలో అధికులు తెలంగాణ వాసులు. డబ్బుకొరకు ఏమి చేసినా తప్పులేదనే స్వభావంతో వారు ఎదుగగా, మానవ సంబంధాలను పటిష్టపరచుకోవడమే స్వభావంగా ఇక్కడి ప్రజలు ఎదిగారు. ఏ ప్రాంతాన్ని వశపరుచకోవాలన్నా ముందుగా వారి సంస్కృతిని నాశనం చేయాలనే సూత్రాన్ని అక్షరాల పాటిస్తూ, క్రమక్రమంగా మన సంస్కృతిని సర్వనాశనం చేస్తూ మనపై పట్టు సాధించి మనలను స్వంత రాష్ట్రంలోనే పరాయివారిగా మార్చారు ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలను, వేషభాషలను అసహ్యించుకుంటున్నారు ఫలితంగా అనాదిగా వస్తున్న ఇక్కడి ఆచారాలు మంట కలిసిపోతున్నాయి. దేశంలో పాశ్చాత్య సంస్కృతి వ్యాపించినట్లుగానే, తెలంగాణలో ఆంధ్ర సంస్కృతినే నిజమైన సంస్కృతిగా భావించి, వంటబట్టించుకోవడం విచారకరం. తెలంగాణవాసులు తమ పండుగలను జరుపుకోవడంలో కూడా ఆంధ్రులను అనుకరించాల్సిన దుస్థితి దాపురించింది ఇది ఇలాగే కొనసాగితే త్వరలోనే మన రాష్ట్రంలో మన ప్రాంతాన్ని ఎడారిగా చెప్పుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే పక్షపాతంతో కూడిన పాలన ఫలితంగా ఆకలి చావులు, ఆత్మహత్యలు ఇక్కడి ప్రజల జీవితంలో భాగమైపోయాయి.

***నక్సలిజం వల్లనే తెలంగాణ వెనుకబడిందా?***

వెనుకబాటుతనం వల్లే 1972లో తెలంగాణ ప్రాంతంలో నక్సలిజం పుట్టుకురాగా నక్సలైట్ల వల్లే తెలంగాణ వెనుకబడిపోయిందని అధికారంలో వున్నవారు వాదించడం బూటకమే తీవ్రవాదులు ఉన్నంతకాలం అభివృద్ధికి అడ్డంకే అని సాకులు చెప్తుంటారు మన పాలకులు. అభివృద్ధి లేకపోతే తీవ్రవాదం పుట్టక తప్పదని తరతరాల చరిత్ర తెలియజేస్తున్నది. తెలంగాణకు అన్యాయం జరిగినందువల్ల, పేదరికం పెరగడం వల్ల, నిరుద్యోగం విజృంభించడంతోనే నక్సలిజం పుట్టి

వేళ్లూనుకుంది. తెలంగాణలోని ఈ సమస్యను శాంతిభద్రతల సమస్యగా చిత్రిస్తూ పాలకులు పబ్బం గడుపుతున్నారు ప్రాంతాలన్నీ సమాంతరంగా అభివృద్ధి చెందివుంటే, పాలనలో వివక్ష లేకుంటే ఏనాడో నక్సలిజం జాడలు లేకుండా పోయేవి అయినా ముందుగా నక్సలైట్ ఉద్యమాన్ని పుట్టించిన కొండపల్లి సీతారామయ్య, పైలా వాసుదేవరావు, చంద్రపుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి మొదలైన వారు తెలంగాణేతరులే! ఎన్‌కౌంటర్లలో మరణించినవారంతా తెలంగాణవారే కాగా, నక్సలిజాన్ని పుట్టించిన మహాత్ములు మాత్రం లొంగిపోయి దొడ్డిదారిన నజరానాలు అందుకున్నారు

వెనుకబాటుకు నక్సలిజమే కారణమైతే మహబూబ్‌నగర్‌లో తక్కువ స్థాయిలో నక్సలిజం ఉన్నప్పటికీ ఆ జిల్లా అత్యధికంగా వెనుకబడి వున్న విషయం గమనించాలి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో నక్సలిజం బలంగా ఉన్నప్పటికీ ఆ జిల్లాలు తెలంగాణలోనే మెరుగైన స్థితిలో ఉన్నాయి కోస్తాంధ్రలోని విశాఖపట్నం జిల్లాలో నక్సలిజం మొదటి నుంచీ బలంగా ఉండగా, దేశంలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పట్టణాలలో ఒకటిగా విశాఖపట్నం ఎదిగింది!

నక్సలైట్లు దేశభక్తులని అందరికన్నా ముందుగా ప్రకటించింది తెలుగుదేశం వ్యవస్థాపకుడైన రామారావే. తెలుగుదేశం ప్రతిపక్షంగా ఉన్న రోజుల్లో ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలను కూడా నడిపింది. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని నక్సల్స్ ఎన్నోసార్లు ప్రకటించారు. సంపద కేంద్రీకృతమవడాన్నే వారు వ్యతిరేకిస్తున్నారు నక్సల్స్‌తో మూతపడిన సంస్థలకన్నా ప్రభుత్వాలు మూసివేసిన సంస్థలే అధికం మూతపడిన పరిశ్రమలను తెరిపించాల్సిందిగా నక్సలైట్లు అనేకసార్లు డిమాండ్ చేశారు. నక్సల్స్ ఉద్యమం తీవ్రంగా ఉన్న తెలంగాణలోనే అత్యధిక పరిశ్రమలు విజయపథంలో నడుస్తున్నాయి. నక్సల్‌బరీ ఉద్యమం పుట్టుకకు ముందు మాత్రం తెలంగాణాను అభివృద్ధి పరచాలని ప్రయత్నించారా?

ప్రస్తుతం నక్సలిజం వల్ల తెలంగాణ ప్రజలు ఇబ్బందుల నెదుర్కొంటున్నారు. ఎన్‌కౌంటర్లకు సాక్ష్యమైనా, పోలీసులకు అనుమానం వచ్చినా సామాన్య ప్రజలే కష్టాలను ఎదుర్కొంటున్నారు. నక్సలైట్లకు ఆశ్రయమిచ్చారని కొన్ని గ్రామాలకు గ్రామాలే వేధింపులకు గురవుతున్నాయి నక్సలైట్ల భయానికి ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, హోంమంత్రులే ప్రత్యేక రక్షణను కల్పించుకొని తిరుగుతున్న నేటి పరిస్థితుల్లో సాధారణ ప్రజలు నక్సలైట్లకు ఆశ్రయం ఇవ్వలేమని ఎదిరించి చెప్పగలరా? తప్పనిసరి పరిస్థితులలో ఇష్టం లేకపోయినా తమ ప్రాణరక్షణ కొరకు కొన్నిసార్లు నక్సలైట్లకు సహకరించాల్సే వస్తున్నది. చర్య–ప్రతిచర్య అనే పద్ధతిలో పోలీసులు – నక్సలైట్ల మధ్య సాధారణ ప్రజలు నలిగిపోతున్నారు నానాటికీ తెలంగాణ పల్లెలు ఖాళీ అవుతున్నాయి పోలీసులు తమ కార్యదక్షతను

ప్రదర్శించడానికి, నక్సలైట్లు తమ ఉనికిని నిరూపించుకోవడానికి పడుతున్న తంటాలలో చివరికి తెలంగాణ ప్రాంతమే తల్లడిల్లి పోతున్నది. తెలంగాణ ప్రాంతం వేరయితే నక్సలిజం దానంతటదే సమసిపోతుందనేది నిర్వివాదాంశం. నక్సల్స్ ఉద్యమం మంచిదా, చెడ్డదా అనేది అప్రస్తుతం. అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రాణాలను ఫణంగా పెట్టేవారు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు ఉద్యమాలు కొన్నిసార్లు గతితప్పడంలో మానవ మేధస్సుదే వైఫల్యం అని చెప్పుకోక తప్పదు. సమాచారం లోపం వల్ల నక్సల్స్ కూడా కొన్ని తప్పులు చేసే ఉంటారు తప్పులు చేయనివారు ఈ భూ ప్రపంచంలోనే ఉండే అవకాశం లేదంటారు వివేకానందస్వాములవారు.

### హైదరాబాద్ అభివృద్ధికి ఆంధ్రులు కారణం కాదు

ఆంధ్రుల వల్లనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని ఓ బూటకపు వాదాన్ని వారు ముందుకు తెస్తే దానికి తెలంగాణ వాసుల్లో కొందరు 'డూడూ బసవన్న'ల్లా తలూపుతున్నారు. వాస్తవానికి ఇందులో ఆంధ్రుల పాత్ర నామమాత్రమే. భారతీయుల వల్లనే అమెరికా అగ్రరాజ్యంగా ఎదిగిందంటే అర్థమేమైనా వుందా? బ్రతకలేక మనవారు అమెరికాకు వెళ్ళినట్లే, పొట్టచేత పట్టుకొని ఆంధ్రులు హైదరాబాద్‌కు వచ్చి వుండొచ్చు. ఫలితంగా అమెరికాలో భారతీయులు బాగుపడ్డట్లే, ఇక్కడ ఆంధ్రులు ఆర్థికంగా ముందంజలో వుండొచ్చు. తద్వారా తెలంగాణకు ఒరిగిందేమీ లేదు అయినా కట్టుబట్టలతో వచ్చిన ఆంధ్రులు హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధిపరిచి వుంటారో వివరించాలి

విశాలాంధ్ర ఏర్పాటుకు ముందు కరువు కాటకాల సమయాల్లో మన పల్లె జనాలకు ఈ నగరం కామదేనువులా జీవనోపాధిని కల్పించింది. అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్న ఈ నగరం నేడు తెలంగాణ పల్లె ప్రజలను నిరాశకే గురి చేస్తున్నది. నగరం నిండా ఏ అడ్డ మీద చూసినా తెలంగాణ కూలీలు పనుల కొరకు పరుగులు పెడుతున్నారు. వారానికి ఒకసారి కూడా పనిదొరకని పరిస్థితి ప్రత్యక్షంగా కనిపిస్తున్నది. పెరుగుతున్న పలు అంతస్తుల భవనాలు తెలంగాణ ప్రజలకు ఆశ్రయం ఇవ్వలేకపోతున్నాయి ఫలితంగా ఎక్కడ చూసినా ఖాళీ ప్లాట్లలో గుడిసెలు వెలుస్తున్నాయి. మూసీ నదికి ఇరువైపుల మురికిలో జీవిస్తున్న వారంతా తెలంగాణ వారేనని మరిచిపోరాదు. నిరుద్యోగంతో యువకులు రోడ్లవెంబడి తిరుగుతున్నారు దిక్కుతోచని మరికొందరు అడవులు పట్టుకుని తిరుగుతున్నారు బ్రతుకుతెరువులో భాగంగా కొందరు వ్యభిచారాన్నే వృత్తిగా మార్చుకుంటున్నారు. అవినీతి రాజ్యమేలుతున్నది. కాలుష్యంతో కంపరం పుట్టుకొస్తున్నది. ఇదేనా హైదరాబాద్ అభివృద్ధి?

పలు అంతస్తుల భవనాలు, విశాలమైన కాలనీలు విస్తరించడమేనా అభివృద్ధి అంటే? కోట్లకు పడగలెత్తినవారు ఓవైపు, కూటికి లేనివారు మరోవైపు వుండడమేనా

**ఉద్యోగుల్లో ఆంధ్రుల అధికారం - తెలంగాణ ప్రజలకు అంధకారం**

అభివృద్ధి? చేతకాని ప్రభుత్వాల వల్లనైతేనేమి, పక్షపాతపు పరిపాలన వల్లనైతేనేమి కొందరు ఉద్యోగులు, కొందరు కాంట్రాక్టర్లు అవినీతితో ప్రజాధనాన్ని దోచి, పెద్దపెద్ద భవనాలు నిర్మించుకున్నంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లా? జనాభా పెరగడంగానీ, భవనాలు పెరగడం గానీ అభివృద్ధికి ప్రామాణికం కాదు ప్రజలకు వసతులు పెరిగితే, జీవనోపాధి పెరిగితే, జీవన ప్రమాణాలు పెరిగితే నిజమైన అభివృద్ధి జరిగినట్లు చెప్పుకోవాలి. ప్రపంచమంతటా జనాభా పెరిగిపోతున్నట్లే హైదరాబాద్‌లోనూ పెరిగింది. పల్లెటూళ్లలో కూడా కాంక్రీట్ భవనాలు చోటు చేసుకుంటున్నట్లే హైదరాబాద్‌లో భవనాల అంతస్తులు పెరిగాయి ఇదంతా ఆంధ్రుల వల్లనే జరిగిందంటే ఎలా? చార్మినార్, కోటీ, ఆబిడ్స్‌లు ప్రాధాన్యతను కోల్పోయి - కూకట్‌పల్లి, వనస్థలిపురం, మాదాపూర్, ఫిలింసిటీ లాంటివి ప్రాధాన్యతను సంతరించుకుంటే అభివృద్ధి చెందినట్లా?

అమాటకొస్తే ఇప్పటికీ హైదరాబాద్‌లో ప్రముఖమైన గండిపేట చెరువు, హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, నెహ్రూ జంతు ప్రదర్శన శాల, సాలార్‌జంగ్ వస్తు ప్రదర్శన శాల, అసెంబ్లీ భవనం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఉస్మానియా ఆస్పత్రి, సెక్రెటేరియట్, గోల్‌కొండ కోట లాంటి అభివృద్ధి చిహ్నాలన్నీ ఆంధ్రుల ప్రమేయం లేకుండానే సమైక్య రాష్ట్రానికి ముందే ఇక్కడ సంతరించుకున్నాయి. ఎవరికీ అందుబాటులో లేని హైటెక్ సిటీ, సబ్సిడీలతో ఎమ్మెల్యే కాలనీలు, సినిమా స్టూడియోలు, కార్పొరేట్ ఆస్పత్రులు లాంటివే ఆంధ్రుల పాలనలో అభివృద్ధి చెందాయి.

అభివృద్ధి గురించి చెప్పాలంటే నగరంలోని ఉద్యోగాలన్నీ ఆంధ్రులే వశపర్చుకుని, వారే అభివృద్ధి చెందినమాట వాస్తవసం. పాలకులు కల్పించిన వసతుల ఆధారంగా ఆంధ్రులే పరిశ్రమలను స్థాపించుకుని, లాభాలను గడించారన్నది నిజం. పాత హైదరాబాద్ నగరం చుట్టూ వలసవాదులు అందమైన కాలనీలు నిర్మించుకున్న మాట సత్యమే. కానీ, ఈ అభివృద్ధి అంతా తెలంగాణ నష్టానికే దారితీసింది. 'మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన' అన్నట్లు తెలంగాణేతరుల వలసల వల్ల సహజ వనరుల పంపకంలో తెలంగాణ నష్టపోయింది ఒక్కమాటలో చెప్పాలంటే 'తెలంగాణ పప్పును, ఆంధ్ర పొట్టును కలుపుకుని అందరం కలిసి ఊదుకుని తింటున్నామని మరిచిపోరాదు.'

గోల్కొండ రాజులు, నిజాం పాలకులు పన్నుల రూపంలో ప్రజలను దోచి హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశారు. వారు కూడా మనపై ప్రేమతో అభివృద్ధి చేయకపోయినా, అదృష్టవశాత్తు ఆ అభివృద్ధి మాత్రమే నేడు మిగిలింది మనకు. ఇదిలా వుంటే ఒకవైపు తెలంగాణ నిధులతో రాజధానిని అభివృద్ధి చేస్తూ, మరోవైపు అభివృద్ధి ఫలాలను అందరికీ దక్కేలా 'ఆరుసూత్రాల పథకం'తో హైదరాబాద్ అందరిదీ (ఫ్రీజోన్) అని చెపుతున్నారు. 1956నాటి హైదరాబాద్ (పాతబస్తీ) ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోగా, వలసవాదుల అడ్డాలు మాత్రమే (కొత్తసిటీ) అభివృద్ధి చెందాయి అనేది అబద్ధం కాదు.

## అంధకారంలో ఆంధ్రులదే పట్టు - తెలంగాణకు మిగిలింది పొట్టు

### తెలంగాణ ప్రత్యే రాష్ట్రమైతే ముస్లింల రాజ్యంగా మారదు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైతే ముస్లింల రాజ్యమైపోతుందని, అవగాహన లేని కొందరు మూకుమ్మడి ప్రచారం చేస్తుంటే, మరికొందరు 'తందాన' పాత్ర పోషిస్తున్నారు ఇదంతా అవగాహనా రాహిత్యమే కాని, ఇందులో ఎటువంటి వాస్తవం లేదు కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ముఖ్యమంత్రులను తొలగించాలనే దురుద్దేశ్యంతో ఆంధ్రుల కుత్సితాల వల్లనే రాజధానిలో మతకలహాలు జరిగినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

తెలంగాణలో ఎంతో కాలం నుండి హిందూ ముస్లింలు సహజీవనం సాగిస్తున్నారు. ముస్లిం పండుగలైన మొహరం జహంగీర్‌పీర్ దర్గా జాతరలను సైతం హిందువులు జరుపుకుంటున్నారు. తెలంగాణలోని హిందూ–ముస్లింలను తోలుబొమ్మలను చేసి, ఆంధ్ర పాలకులు నాటకమాడుతున్నారు. అమాటకొస్తే ఇప్పటివరకు జరిగిన మతకలహాలలో ముస్లింల నుండి తెలంగాణ హిందువులను రక్షించడానికి ఆంధ్ర హిందువులు ఏనాడైనా ముందుకు వచ్చారా? అలాగే తెలంగాణ ముస్లింలను రక్షించడానికి ఆంధ్ర ముస్లింలు ప్రాణాలొడ్డారా? కలిసి జీవించడాన్ని గురించి ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు. ఈ విషయంలో ఆంధ్రులను చూసి నేర్చుకోవాల్సిన అవసరం లేదు.

### భాష ఒక్కటైతే కలిసి వుండాలా?

ప్రపంచంలో ఒకేభాష మాట్లాడే వారికి, ఒకే మతాన్ని పాటించే వారికి అనేక దేశాలున్నాయి. దేశంలో ఒకే భాషను మాట్లాడే వారికి వేరువేరు రాష్ట్రాలున్నాయి. అంటే కలిసి వుండడానికి మతంకాని, భాష కాని ప్రాతిపదిక కాదని తెలుస్తున్నది. భాషా నినాదంతో ఏ ప్రాంతం కలిసి వుండలేదు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సమానత్వాలే ప్రాంతాలను, ప్రజలను కలిపి వుంచగలుగుతాయి. అసమానత కారణంగా ఒకే మతాన్ని పాటించే పాకిస్తాన్ చీలిపోయింది. అరబ్ భాషనే మాట్లాడే పశ్చిమాసియాలో అనేక దేశాలున్నాయి. భాషతో కలిసి వుండాలనడం భావ్యం కాదు. కలువాల్సింది భావాలే కాని, భాష కాదు. కలిపింది ప్రాంతాలనే కాని, మనసులను కాదు. నీటిలో నూనె కలిసినట్లు కలిశామేతప్ప, పాలు నీళ్లలా కలువలేకపోయాం. మనసులు కలువని భార్యాభర్తలే వేరు కాపురాలెంచుకుంటుండగా, పరస్పర విరుద్ధమైన భావాలతో కలిసుండేదెందుకు?

అయినా భాష ఒక్కటే అన్న విషయాన్ని కూడా ఆంధ్రులు అంగీకరించినట్లు దాఖలాలు లేవు. మన భాషను, యాసను ఏనాటినుండో తమ సినిమాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. తెలుగు భాషను రక్షించడానికి చర్యలే చేపట్టకపోగా, విద్యారంగాన్నంతా ఆంగ్లంతో నింపి, తెలుగును కనుమరుగు చేశారు. నిజమైన తెలుగును మాట్లాడేవారు రాష్ట్రంలోనే ఒక శాతానికి మించి కనిపించరు. ఉర్దూ, ఇంగ్లీషు పదాల కలయిక లేనిదే భావాలను సరిగా వ్యక్తీకరించలేని కూడలిలో ఉన్నాం. ఇంకా భాషను పట్టుకొని కలిసి ఉండాలనడం దేనికి? అమాటకొస్తే

తెలంగాణ ప్రజలది సరైన తెలుగు కాదని గేలి చేస్తుంటారు కాని భారతాన్ని ఆంధ్రీకరించిన తిక్కన, భాగవతాన్ని ఆంధ్రీకరించిన పోతనలు తెలంగాణ ప్రాంతంవారే అని చరిత్రకారులు అంటున్నారు ఇంకా చెప్పాలంటే జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి, కాళోజి నారాయణరావులు, దాశరథి సోదరులు, యశోదారెడ్డి ప్రస్తుత కాలంలోనే తెలుగు భాషలో గుర్తింపును పొందినవారే అని గుర్తుంచుకోవాలి.

భాషా ప్రాతిపదికతోనే రాష్ట్రాలను ఏర్పాటు చేయాలనుకుంటే దేశంలో ప్రస్తుతమున్నాయని చెబుతున్న సుమారు 250 భాషలకు 28 రాష్ట్రాలే ఎందుకున్నాయి. "భాష ఒక్కటని కలుపుకున్నాం కదా? మళ్ళీ విడిపోవడం దేనికి" అని కొందరంటుంటారు. కానీ 'ఎత్తుకున్న పిల్లని పిర్ర గిచ్చితే ఏడువకుండా ఊరుకుంటుందా? సంకలోనే వుండాలని ఆశిస్తుందా?'

### రాష్ట్రాలు విడిపోవడం జాతీయవాదానికి దెబ్బకాదు

అభివృద్ధికి చిన్న రాష్ట్రాలే దోహదపడుతున్నట్లు పరిస్థితులు తెలియజేస్తున్నాయి తెలంగాణకన్న పెద్ద రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లు వెనుకబడి ఉన్నాయి. చిన్న రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌లు తెలంగాణకన్నా ముందున్నాయి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత ఎన్నో రాష్ట్రాల నేర్పరచుకున్నాం. పంజాబ్, హర్యానాలు విడిపోయాయి ఇటీవలే హిందీ మాట్లాడే రాష్ట్రాల నుండే ఉత్తరాంచల్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్‌లు పుట్టుకొచ్చాయి. ఈశాన్య ప్రాంతంలో ఎన్నో రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. దేశంలోనున్న 28 రాష్ట్రాలు భాషాపరంగా కానీ, జనాభా పరంగా కానీ, వైశాల్యపరంగా కానీ ఏర్పరిచినవి కాదు. లక్షల్లో జనాభా వున్న రాష్ట్రాలు ఒకవైపు, కొన్ని దేశాలకన్నా ఎక్కువ జనాభా వున్న రాష్ట్రాలు మరొకవైపు ఈ దేశంలోనే వున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైనా జనాభా పరంగా చూసినా, వైశాల్యపరంగా చూసినా దేశంలో ఇప్పుడున్న సగం రాష్ట్రాలకన్నా పెద్దదే అవుతుంది.

వైశాల్యపరంగా అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవా, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్, పంజాబ్, సిక్కిం, త్రిపుర, జమ్మూకాశ్మీర్, ఉత్తరాంచల్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఏర్పాటు కాబోయే మన తెలంగాణ కన్న చిన్నవే.

## తెలంగాణ ఉద్యమం వేర్పాటు వాదం కాదు

ప్రస్తుత ఉద్యమానికన్నా ముందే 1952లోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి వేర్పాటు కొరకు ఉద్యమాలు నడిపి ప్రత్యేక "ఆంధ్ర రాష్ట్రం" ఏర్పరచుకున్నది ఆంధ్రులే ప్రస్తుతం తెలంగాణ ఉద్యమాన్ని జాతి వ్యతిరేక ఉద్యమంగా చిత్రీకరిస్తున్న చంద్రబాబు, వెంకయ్యనాయుడు, రాజశేఖరరెడ్డి లాంటివారు 'ముల్కి' నిబంధనలు చెల్లుబాటవుతాయని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినరోజున 'జైఆంధ్రా' ఉద్యమంలో నాయకులే 'వయసులో వ్యభిచరించి ముసలితనంలో పాతివ్రత్య మహిమ'ను వర్ణించినట్లు

విద్యార్థి నాయకులుగా ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని సమర్థించి, అధికారం దక్కాక చిలుక పలుకులు వల్లిస్తున్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కొరకు పొట్టి శ్రీరాములు ఆనాడు చేసింది గొప్ప కార్యమే అయితే తెలంగాణ వాసులు నేడు నడిపిస్తున్న ఉద్యమం కూడా గొప్ప కార్యమే.

| | |
|---|---|
| సమైక్య నినాదపు ఊకదంపుడు ప్రచారం | మనగల్లీ గల్లీ పునాది రాళ్ళొచ్చే |
| ప్రత్యేక రాష్ట్రాన్ని కోరినప్పుడల్లా ఇదే ఆచారం | కాగితాలపై కళాశాలలొచ్చే |
| తెలంగాణ వాసుల్లో కొందరు తలూపడమే విచారం | మంత్రుల మాటల్లో ఉద్యోగాలొచ్చే |
| ఇలా ఉంటే మారేదెలా మన గ్రహచారం | ఇదంతా చూస్తుంటే ఊసరవెల్లే గుర్తొచ్చే |

ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమాన్ని నడిపిస్తున్నంత మాత్రాన తెలంగాణ ప్రజల దేశభక్తిని శంకించాల్సిన అవసరం లేదు జాతీయ వాదానికి ప్రతీకలైన హోళి, రాఖీపూర్ణిమ వంటి జాతీయ పండుగలు దేశ ప్రజలకు ధీటుగా తెలంగాణ వాసులు జరుపుకుంటుండంగా ఈ రెండు జాతీయ పండుగలకు ఆంధ్ర ప్రాంతంలో అనవాలే లేని విషయాన్ని గమనించాలి

***హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని కోరే అధికారం వారికి లేదు***

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైతే హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని తలా–తోక లేని ఆలోచనలను కొంతమంది ప్రజల్లోకి వదిలారు హైదరాబాద్ ఆంధ్రుల సొత్తు కాదు. విలీనానికి ముందు ఎనిమిదేళ్ళపాటు హైదరాబాద్ ఏకంగా ఓ రాష్ట్రం అనాడే దేశంలోని పేరున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి. ఆంధ్ర–హైదరాబాద్ రాష్ట్రాలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పరచిన రోజున హైదరాబాద్ తెలంగాణలోనిదే. అయినా కలిసి వుండాలా, విడిపోవాలా అన్నదే సమస్య తప్ప కేంద్రపాలిత ప్రాంతం అనే అంశానికి తావే లేదు. తెలంగాణ విడిపోవడానికి అంగీకరించాలనుకుంటే తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా వుంటే ఆంధ్రులకు వచ్చే నష్టం ఏమిటి? హైదరాబాద్‌లో స్థిరపడ్డవారికి వచ్చే నష్టం ఏమిటి? రాజ్యాంగం ప్రకారం దేశవాసులు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా బ్రతకడానికి అవకాశం వుంది కదా!

తెలంగాణలోని హైదరాబాద్‌ను విడదీసి మిగిలిన తెలంగాణను ఇస్తామంటే 'తల నరికి మొండెం ఇచ్చినట్లు' కాదా? విలీనానికి ముందే తెలంగాణతో కలిసి వున్న హైదరాబాదును, విభజనతో వేరు చేయాలని కోరేవారు విలీనం తర్వాత జరిగిన అభివృద్ధిని వదులుకోగలరా? అయినా ఇవ్వడానికి, వద్దనడానికి హైదరాబాద్ ఆంధ్రుల సొత్తా? హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే నష్టపరిహారంగా నాగార్జున సాగర్‌ను, దానిక్రింద వ్యవసాయ భూములను వదులుకోగలరా? విలీనం తర్వాత ఆంధ్రలో జరిగిన అభివృద్ధిని తెలంగాణకు బదిలీ చేస్తారా? బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా దండుకున్న అధిక మొత్తాన్ని తిరిగి ఇవ్వగలరా?

**వరదల్లో వారికి ఉపకారం – కరువుల్లో మనకు వారి అపకారం**

## పారిశ్రామికాభివృద్ధికి ఆంధ్రులు కారణం కాదు

ఆంధ్ర ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేని రోజుననే ఇక్కడ రెండొందల పరిశ్రమలుండేవి. విలీనం తర్వాత ఆ పరిశ్రమలన్నీ అసమర్థులైన, అవినీతిపరులైన ఆంధ్రా అధికారుల చేతివాటం వల్లనే మూసివేతకు గురైనాయి. ఉదా॥నిజాం కాలంలో ఏర్పాటైన సెంట్రల్ ల్యాబ్ ఆర్.ఆర్.ల్యాబ్‌గా మార్చి ఆంధ్రుల స్థావరంగా మార్చారు రైస్‌మిల్లులు తప్ప మరే పరిశ్రమలులేని ఆంధ్ర ప్రాంతం వారు పారిశ్రామికంగా ముందంజలో వుండటానికి స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ లాంటి ప్రభుత్వ సంస్థల సహకారంతో పెట్టుబడుల మీద సబ్సిడీలు, విద్యుత్‌లో సబ్సిడీలు, స్థలాల కొనుగోళ్ళలో మినహాయింపులు పొంది ఆ తర్వాత అదే పరిశ్రమల స్థానంలోనే ఆంధ్రులు నూతన పరిశ్రమలను ఏర్పరచుకున్నారు.

వడ్డించే స్థానంలో ఆంధ్ర పాలకులుండగా, తెలంగాణవాసులకు పరిశ్రమలను స్థాపించుకునే అవకాశమే చిక్కడం లేదు అన్నిరకాల పరిశ్రమలకు ముడిసరుకులు తెలంగాణలో అందుబాటులో వుండగా, ఆంధ్రుల గొప్పతనాన్ని వర్ణించడంలో అర్థమే లేదు ఆంధ్ర ప్రాంతంలో పరిశ్రమలను పెట్టుకునే వాతావరణంగానీ, వసతులుగానీ లేకపోవడం వల్లనే ఆంధ్రులు తెలంగాణలో పరిశ్రమలను స్థాపించారే తప్ప తెలంగాణ ప్రాంత అభివృద్ధిపై అభిమానంతోగాని, రాజధాని నగర అభివృద్ధిపై ప్రేమతోగాని కానేకాదు. అయినా వారు పెట్టిన పరిశ్రమల ద్వారా కూడా లాభాలు, ఉద్యోగాలు ఆంధ్రులకే లభించగా, కాలుష్యం మాత్రం తెలంగాణకు దక్కింది.

### *1969 తెలంగాణ ఉద్యమం ఏమీ సాధించలేదా?*

ఆనాటి ఉద్యమం అనుకున్న లక్ష్యాన్ని సాధించలకపోయినా విజయం చెందిందని చెప్పుకోవడానికి అనేక ఉదాహరణలున్నాయి. ఈ ఉద్యమం తర్వాతే మొదటిసారిగా తెలంగాణ వ్యక్తికి (పి వి నరసింహారావు) ముఖ్యమంత్రి పదవి లభించింది ఆ తరువాతే మర్రిచెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య లాంటి వారికి ముఖ్యమంత్రి పదవులు దక్కాయి. కేటాయింపులలో కూడా కొద్దిపాటి పెరుగుదల ప్రారంభమైంది అఖిలపక్ష ఒప్పందం, ఆరుసూత్రాల పథకాలు ముందుకు వచ్చాయి. అయితే వీటన్నింటివల్ల తెలంగాణకు ఒరిగిందేమిటని ప్రశ్నించేవారు కూడా లేకపోలేదు వివిధ కారణాల వల్ల ఈ చర్యలు తెలంగాణ కష్టాలను తగ్గించలేకపోయి వుండవచ్చు. కాని, ఆనాటి నుండే తెలంగాణ ప్రాంతానికి గుర్తింపు లభించి, తెలంగాణ పేరు వింటేనే రాజకీయ నాయకుల్లో వణుకు పుట్టే పరిస్థితులు ఎదురయ్యాయి

తెలంగాణ విడికాకుంటే - అంతా ఆంధ్రుల దాసులమే
తెలంగాణ విడిపోకుండే - ఇతరుల దృష్టిలో నీచులమే
పిరికిపందలై వెనుదిరిగామా - ఒరులిక కొరగానివ్వరురా
నూరేళ్ళయినా తెలంగాణీయుల - నోళ్ళకు తాళం వేతురురా
- డా॥ అనుముల శ్రీహరి (1969)

ఆ ఉద్యమమే జరుగకుండా ఉంటే ఇప్పుడు జరిగిందని చెప్పుకుంటున్న నష్టంకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ నష్టం జరిగి వుండేది. అవమానాలు మరింత పెరిగేవి చెన్నారెడ్డి సత్యనారాయణరెడ్డి లాంటి వారికి గవర్నర్ పదవులు దక్కేవి కావు. ఉద్యమ పుట్టుకొచ్చినందు వల్లనే పి వి., శివశంకర్, మల్లికార్జున్, వెంకటస్వామి, అంజయ్యలకు కేంద్రంలో మంత్రి పదవులు దక్కాయి. ఒకవేళ నాటి ఉద్యమం ఏమీ సాధించలేదని చెప్పుకుందామన్నా ఈనాటి ఉద్యమానికి ఆ ఉద్యమమే ప్రేరణ అని అంగీకరించక తప్పదు.

ఆనాటి ఉద్యమం విఫలమైందని నిరాశ చెందాల్సిన పనిలేదు కొద్దిమంది స్వార్థం వల్ల, కేంద్ర ప్రభుత్వం పిడివాదం వల్ల చేసిన బాసలను నమ్మడంవల్ల, ప్రజా తీర్పును హేళన చెయ్యడం వల్ల అనుకున్న ఫలితం దక్కలేదు. ఒకమారు ఉద్యమం ఫలితాన్ని సాధించనంత మాత్రాన ఉద్యమాలను నిలిపివేయాల్సిన పనిలేదు. మొదటి స్వాతంత్ర్య సమరంతోనే దేశానికి స్వాతంత్ర్యం దక్కలేదు. స్వాతంత్ర్యం సిద్ధించేవరకు నిరంతరం ఉద్యమాన్ని కొనసాగించినట్లే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేవరకు రావణకాష్ఠంలా ఉద్యమాన్ని నడిపిస్తూనే వుండాలి. గజనీ మహమ్మద్ అనేకసార్లు దండయాత్ర చేసిన తర్వాతే విజయం లభించిందని మర్చిపోరాదు

***ఉద్యమం ఊహించినంతగా ఎదగడం లేదా?***

అన్నిసార్లూ గెలిచినసీట్ల సంఖ్యే ఉద్యమం ఊపందుకున్నది అనటానికి ప్రమాణం కాదు. తెలంగాణలోని రెండు జిల్లాల్లోనే టిఆర్ఎస్ ఆధిక్యత చూపించినందున ఉద్యమం ప్రభావమే లేదని హేళన చేసేవారు కూడా లేకపోలేదు. అయితే 1969నాటి ఉద్యమం మొదటి రెండు నెలల్లో ఈమాత్రపు సంచలనాన్ని కూడా కలిగించలేదనే విషయాన్ని మరిచిపోరాదు. రెండేళ్ళలోనే తెలంగాణలోని ప్రతి పల్లెకు ఆ ఉద్యమం వ్యాపించగలిగింది. ఫలితంగానే 11మంది పార్లమెంటు సభ్యులు గెలిచారు. తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించిన రెండు నెలల్లోనే 116యేళ్ళ కాంగ్రెస్‌తో, వందేళ్ళ కమ్యూనిస్టులతో, 20యేళ్ళ బిజెపితో, 20యేళ్ళ టిడిపితో పోటీపడి ఆ పార్టీలను బెదిరించే స్థాయికి ఎదగడమే ఉద్యమం విజయం సాధించిందనటానికి తార్కాణం అధికారంలో నున్న తెలుగుదేశానికి బిజెపి మిత్రపక్షంగా ఉన్నప్పటికి, తెలుగుదేశం పార్టీ,ఆధిక్యత చూపించలేకపోవడం తెలంగాణ ఉద్యమ ఫలితమే

నీడుల పంపకాలలో కోతి తీరు - దింపుడుకళ్ళం వద్ద ఆశ తీరు

తెలంగాణ వాదం వేగంగా విస్తరించలేకపోయిన కారణంచే మారుమూలల జిల్లాలయిన మహబూబ్‌నగర్, ఆదిలాబాద్‌లలో చెప్పుకోదగ్గ ప్రభావం చూపించలేకపోయింది గాంధీ, నెహ్రూల పేర్లతో కాంగ్రెస్, ఎన్టీఆర్ పేరుతో తెలుగుదేశం, వాజ్‌పాయి పేరుతో బిజెపి తెలంగాణ పేరే మంత్రంగా, సర్వ రోగ నివారిణిలా పనిచేసి మొదటి ప్రయత్నంలోనే ఈమాత్రం ఓట్లను దక్కించుకోవడం గొప్ప విజయంగానే చెప్పుకోవాలి తెలంగాణ రాష్ట్రవాదం నాగస్వరనాదంగా మారి బుసలు కొడుతున్న బూటకపు నాయకులకు ఆట నేర్పే కాలం అతి దగ్గరలోనే ఉందని గుర్తు చేసే సదవకాశాన్ని వినియోగించుకోవాలి.

***ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం రాజకీయ నిరుద్యోగుల సృష్టి కాదు***

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర నినాదం రాజకీయ నిరుద్యోగులు పుట్టించారనే పుకార్లలో వాస్తవం లేదు. ప్రజాబలం లేనిదే ఏ ఉద్యమమూ నిలదొక్కుకోలేదని ప్రపంచ చరిత్ర ఎన్నోసార్లు రుజువు చేసింది అన్యాయాలు జరుగకపోతే ప్రజలకు ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ఉద్యమాలలో పాల్గొనరనేది అక్షర సత్యం. జీవనానికే గడ్డు పరిస్థితులున్న మనదేశంలాంటి దేశాలలో ప్రత్యేకించి ఆకలి చావులకు నిలయమైన తెలంగాణ వంటి ప్రాంతాలలో పనులను విడిచిపెట్టి ఉద్యమాలలో పాల్గొనడం సాధ్యంకాని పని ప్రజా ఉద్యమంగా రూపు దిద్దుకున్న కారణం చేతనే 1969లో 11మంది ఎంపిలు గెలిచారు. గెలిచినవారు ఏం చేశారన్నది ఇక్కడ అప్రస్తుతం ప్రజలు తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించారు. వివిధ కారణాల వల్ల ఉద్యమం ఫలితం సాధించి ఉండకపోవచ్చు, అంతమాత్రాన ఉద్యమాన్నే విడిచి పెట్టాలనడం న్యాయం కాదు

1969లో విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమం రాజకీయ నిరుద్యోగుల చేతికి చిక్కినందువల్లనే చివరిదశలో నీరుగారిపోయింది. ప్రస్తుతం పదవిని త్యాగం చేసిన రాజకీయ నాయకుని ఆధ్వర్యంలో ఉద్యమం పుట్టుకొచ్చింది డిప్యూటీ స్పీకర్ ఇచ్చినందున కినుక వహించి తెలంగాణ వాదాన్ని నెత్తికెత్తుకున్నాడని చంద్రశేఖర్‌రావును విమర్శించేవారు లేకపోలేదు అమాటకొస్తే అసలు ఏ పదవీ దక్కని అధికార తెలంగాణ శాసనసభ్యులు ఎందరో వుండగా, ఒక్కరు కూడా ఎందుకు స్పందించలేకపోయారు? వీరితో పోల్చి చూసినప్పుడు చంద్రశేఖర్‌రావు తన శాసన సభ్యత్వాన్నే త్యాగం చెయ్యడంతో రాజకీయ నిరుద్యోగం అనే ప్రశ్న తలెత్తడం లేదు

ఇప్పటికే ఈ ఉద్యమానికి తెలంగాణకు చెందిన ఉద్యోగులు బాహాటంగానే తమ మద్దతును ప్రకటించారు. రాజకీయాలతో సంబంధంలేని మేధావులు, సామాన్య ప్రజలు విద్యార్థులలో అత్యధికులు ప్రత్యేక రాష్ట్రాన్ని సమర్థిస్తున్నారు. వివిధ రాజకీయ

**అభివృద్ధికి నక్సలిజం పేరు – అలా చెప్పడమే రాజనీతి తీరు**

పార్టీలలో భాగమైనందున ఆయా పార్టీల నిర్ణయాలకు తలొగ్గడంతో అతి తక్కువమంది తెలంగాణ వాసులు మాత్రమే తెలంగాణను బాహాటంగా సమర్థించలేకపోతున్నారు

***తెలంగాణ సాధనకు రెండవ ఎస్సార్సీ అవసరమా?***

అప్పుడెప్పుడో స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో అంటే ఏభై సంవత్సరాల క్రితం 1956లో మొదటి ఎస్సార్సీ ఏర్పాటుచేసి భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు ఓసారి స్వాతంత్ర్యం వచ్చిన దేశానికి మరోసారి స్వాతంత్ర్య పోరాటం చేస్తామన్నట్లు మొదటి ఎస్సార్సీ ఉంది కావున రెండో ఎస్సార్సీ కూడా ఉండాల్సిందే అన్నట్లు అవగాహన లేమితో అభిప్రాయాలు గుప్పిస్తున్నారు గత ఏబది ఏండ్ల నుండి రెండో ఎస్సార్సీయే రాలేదు. అయినా 1956నాటి 16 రాష్ట్రాలు నేటికి 28కి చేరుకున్నాయి **కొత్తగా పుట్టుకొచ్చిన 12 రాష్ట్రాలకు అవసరంలేని రెండవ ఎస్సార్సీ ఇప్పుడెందుకు అవసరమో కోరుతున్నవారే వివరించాలి.** రాష్ట్రానికి ఓ ఎస్సార్సీని స్థాపించివుంటే మన తెలంగాణకు పదో ఎస్సార్సీ, పదకొండో ఎస్సార్సీ అవసరముండేది ఎస్సార్సీ అనేమాటనే మరిచిపోయిన స్థితిలో దానికి మళ్ళీ బూజు దులిపి, పదునుపెట్టి తెలంగాణపైకి వదలడానికి కుయుక్తులు పన్నుతున్నారు. ఎస్సార్సీ లేకుండా ఎన్డీఏ ఏర్పాటు చేసిన 3 కొత్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో కాంగ్రెసు పార్లమెంటులో తన మద్దతును ఎలా తెలుగలిగింది? ఆంధ్ర లాబీ మంత్రదండాన్ని చేతబుచ్చుకొని తెలంగాణను ఎంతకాలమైనా వేధించగలమని కలలు కంటున్నట్టుంది పిడుగుకు, బియ్యానికి ఒకే మంత్రం పనిచేయదనే సత్యాన్ని ఇప్పటికైనా గుర్తించాలి మానసిక వైషమ్యాలతో కలకాలం ఏ జాతి కలిసి ఉండలేవనే సత్యం మరువరానిది 1948 నుండి 1956 వరకు రాష్ట్రంగా ఉండిన తెలంగాణను మళ్ళీ రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి ఎస్సార్సీ ఎందుకవసరమో బూటకపు రాజకీయ నాయకులే చెప్పాలి తెలంగాణను కలుపడానికి ఓ ఎస్సార్సీ, విడదీయడానికి మరో ఎస్సార్సీ అనేవి మాయమాటలే కాదా? 400 సంవత్సరాల పాటు ఓ సంస్థానంగా మనగలిగిన హైదరాబాదు రాష్ట్రానికి మళ్ళీ రాష్ట్రమయ్యే హోదా లేదా? జార్ఖండ్, చత్తీస్ఘడ్, ఉత్తరాంచల్‌ల మాదిరిగా తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి అడ్డంకులెక్కడున్నాయి? భాష ఒకటే అనేదే ప్రామాణికమైతే పై మూడు రాష్ట్రాలు కూడా ఒకే భాష నుండి విడిపోయినవే కదా ప్రజాభిప్రాయానికన్న ఎస్సార్సీ గొప్పది కాదు. గత ఏబదేళ్ళ నుండి తెలంగాణ వాసులు ప్రత్యేక రాష్ట్రాన్నే కోరుకుంటున్నారు. అందరూ ప్రత్యేక రాష్ట్రం కొరకే పోరాడుతున్నట్లు నటించడంచే ప్రజాభిప్రాయం స్పష్టంగా ప్రస్ఫుటమవడం లేదు అయినా 1972 ఎన్నికల్లో ఇచ్చిన ప్రజాభిప్రాయానికి మాత్రం విలువిచ్చారా మొదటి ఎస్సార్సీ తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని అభిప్రాయపడినందున ఇప్పుడు ప్రత్యేకంగా మరో ఎస్సార్సీ అవసరం లేదు.

**వలసల జిల్లాగా పాలమూరు - జిల్లాలో పత్తాలేదు సాగునీరు**

***తెలంగాణ ఏర్పడాలంటే అసెంబ్లీ తీర్మానం చేయాలా?***

నూతన రాష్ట్రాలను ఏర్పాటు చేయడానికి, రాష్ట్రాలను కలుపడానికి, రాష్ట్రాల పేర్లు మార్చడానికి పార్లమెంటుకే సంపూర్ణ అధికారాలున్నట్లు రాజ్యాంగం ఆర్టికల్–3లో పేర్కొంటున్నది మహారాష్ట్ర నుండి గుజరాత్‌ను వేరుచేసిన సందర్భంలో అసెంబ్లీ తీర్మానం అవసరం లేకుండా పార్లమెంటు తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టులో వాదోపవాదాలు జరిగాయి ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తన తీర్పులు "కొత్త రాష్ట్రాల ఏర్పాటుపై అసెంబ్లీలో మెజార్టీ సభ్యులు వ్యతిరేకించినా పార్లమెంటు ఆ విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు నూతన రాష్ట్ర ఏర్పాటు విషయాన్ని మాత్రం అసెంబ్లీకి తెలియపర్చాలి. ఈ విషయంపై అసెంబ్లీ మూడు నెలల్లోగా అనుకూలంగా లేదా ప్రతికూలంగా స్పందించినా లేదా తటస్థంగా ఉన్నా పార్లమెంటు తన నిర్ణయాన్ని రాష్ట్రపతికి పంపి నూతన రాష్ట్ర ఏర్పాటుకు మార్గం ఏర్పరచుకోవచ్చు" అని స్పష్టంగా పేర్కొన్నది 294 మంది సభ్యులు గల రాష్ట్ర అసెంబ్లీలో 187 మంది పూర్వపు ఆంధ్ర రాష్ట్రానికి చెందినవి ఉండగా 107 మంది తెలంగాణ ప్రాంతపు శాసన సభ్యులలో అసెంబ్లీ ఆమోదం ఏనాటికైనా సాధ్యపడుతుందా?

***తెలంగాణ ప్రజలకు సంస్కృతి తెలుసు***

తెలంగాణ ప్రజలకు సంస్కృతి తెలియదని, ఆంధ్రుల చాలా సంస్కారవంతులని తమకు తాము కితాబులిచ్చుకుంటుంటారు. అమాయకులైన తెలంగాణ వాసులు ఆత్మన్యూనతా భావంతో ఇది నిజమేనేమోనని భావిస్తూ, ఎదిరించలేకపోతున్నారు. నిఖార్సయిన సంస్కృతి తెలంగాణది కాగా, ఆంధ్రులను చూసి నేర్చుకోవాల్సిన అవసరం లేదు ఏనాటి నుండో చిలకలూరిపేట, పెద్దాపురాలు ఏ సంస్కృతిలో భాగంగా ఎదిగాయో, కారంచేడు, చుండూరు, పదిరికుప్పంలు రాష్ట్ర చరిత్రలో ఎందుకు ఎక్కాయో గమనిస్తే అంధ్రుల సంస్కృతి గొప్పదేమీ కాదు. తెలంగాణలో కులవివక్ష, అస్పృశ్యత, అత్యాచారాలు లేవనికాదు కాని, అవి కారంచేడు, చుండూరు, పదిరికుప్పంలలో జరిగిన సంఘటనలంత తీవ్రంగా లేనందున సంతోషించాల్సిన విషయమే

మనకు భాష తెలియదన్నారు, బువ్వను అన్నం అనాలట, నాగలిని అరక అనాలట, గొడ్డును పశువు అనాలట. బ్యూటీపార్లర్లు, క్లబ్బుల్లాంటి పాశ్చాత్య సంస్కృతి మనకు తెలియదనేది నిజమే. ఒసేయ్ అనే పదం ఆంధ్ర సంస్కృతిలోనిదే అయినా దాన్ని మనకు అంటగట్టే ప్రయత్నం చేయజూస్తున్నారు. కులాలకతీతంగా వరుసలు పెట్టుకొని పిలిచే తెలంగాణ సంస్కృతిని ఎద్దేవ చేయడం నీచాతినీచమైన సంస్కృతిలో భాగం కాదా!

**అకలి చావులకు మరోపేరు పాలమూరు**

బ్రతుకు దెరువులేక వలసలు పోవడం సహజం కానీ. ధనవంతుల నుండి మరింత ధనవంతులుగా ఎదగడానికే ఆంధ్రులు తమ వలసలను వినియోగించుకున్నారు. ఈ వలసలు కూడా 1947 నుండే ప్రారంభం కావడం విచిత్రం. తెలంగాణ యాసను, భాషను వెక్కిరించారు. తెలంగాణవాసులకు సంస్కారం లేదని, వారిని ఉద్ధరించడానికి వచ్చిన సంస్కరణవాదులుగా చిత్రించుకొని స్వంత డబ్బా కొట్టుకున్నారు 1952లోనే రెండు ప్రాంతాల కలయికను నాన్-ముల్కీ ఉద్యమం ద్వారా వ్యతిరేకించారంటే, వారి సంస్కృతి ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. వారు మనకు క్రైస్తవ సంస్కృతిని తెచ్చి పంచిపెట్టారు మన రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల తర్వాత క్రైస్తవ మతాన్ని ఎంచుకున్నవారు అత్యధికులు కమ్మ కులస్థులే ఆ తర్వాత స్థానాన్ని ఆంధ్ర, రాయలసీమ రెడ్లు దక్కించుకున్నారు సంస్కృతి రక్షణలో వారికి ఏపాటి నిబద్ధత ఉందో వేరే చెప్పాలా?

***తెలంగాణ ప్రజలకు తెలివిలేదా?***

తెలంగాణ ప్రజలకు పుట్టుకతోనే తెలివి లేదన్నట్లుగా ఆంధ్రులు అవహేళన చేస్తుంటే తెలంగాణ ప్రజలు త్రిప్పికొట్టలేకపోతున్నారు తెలంగాణ ప్రజలకు మందిని ముంచే తెలివి లేదన్నది సత్యం. తమ సంపదను ఇతరులు దోచుకుంటున్నా అడ్డుకునే తెలివిని ఇక్కడి ప్రజలు ప్రదర్శించలేదన్నది వాస్తవం చదువులను, కొలువులను, నీటివనరులను, వ్యవసాయ భూములను దోచుకుంటున్నా తెలంగాణ ప్రజలు కిమ్మనకుండా నోరుమూసుకోవడం వల్ల ఆంధ్రులకు తెలంగాణవారు తెలివిలేని వారుగానే కనిపించే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రజలు తెలివి లేకుండానే అమెరికాకు వెళ్ళగలుగుతున్నారా? సంపద చేజిక్కించుకున్నవారే నిజమైన తెలివికలవారా? ఏరికోరి కష్టాలనెంచుకున్న బమ్మెర పోతన వారసత్వాన్ని పునికి పుచ్చుకొన్న తెలంగాణ వాసులను చూసినప్పుడు ఆంధ్రులకు వారు తెలివిలేని వారుగా కనిపిస్తే ఆ దోషం తెలంగాణ ప్రజలది కాదు

***తెలంగాణ ఏర్పడితే ఇక్కడి ప్రజలకు దక్కే ప్రయోజనాలేమిటి?***

- ★ కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదుల్లో తెలంగాణ కొరకు కేటాయించిన నీటిని వినియోగపర్చుకుని రైతులు లాభం పొందుతారు
- ★ తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌తో వ్యవసాయానికి 24 గంటలపాటు సరఫరా చేయవచ్చు
- ★ సుమారు రెండు లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారుతారు.
- ★ తెలంగాణ సంస్కృతి, భాషలు రక్షించబడుతాయి. భాష సంస్కృతుల అవమానానికి స్థానముండదు
- ★ నక్సలిజం తగ్గుముఖం పడుతుంది.

రాష్ట్రంలోనే లేబర్‌గా గొప్పపేరు పాలమూరు

- తెలంగాణ వనరుల వినియోగం కొంతమేరకు తగ్గే అవకాశం ఉన్నందున వాటిని భావితరాలకు పదిలపరచవచ్చు
- విద్యార్థులకు విద్యావకాశాలు పెరుగుతాయి

*తెలంగాణకు చరిత్ర లేదా?*

వాస్తవానికి తెలంగాణకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది స్వాతంత్ర్య పోరాటానికి ధీటుగా నిజాంపై నడిపించిన పోరాటం, స్థానికేతరులకు వ్యతిరేకంగా నడిపించిన ముల్కి ఉద్యమం, సమైక్య రాష్ట్ర ఏర్పాటు నాటి నుండి ఆంధ్రులకు వ్యతిరేకంగా నడిపిస్తున్న పోరాటాలన్ని నిజమైన వీరత్వానికి ప్రతిరూపాలే కాని తెలంగాణ చరిత్రను కాలరాయడానికి పాలకులు చేసిన వికృత చేష్టలవల్ల ఈనాటి ప్రజలకు ఆ పోరాటాలు ప్రత్యక్షంగా కళ్ళముందు కన్పించకుండా మాయమైనాయి చరిత్రలో విజయగాదలు మాత్రమే నిలిచి ఉంటాయనేది ఒక సత్యం కాగా, విజయం సాధించలేకపోయిన తెలంగాణ పోరాటాలు క్రమక్రమంగా కనుమరుగై పోతున్నాయి తమ పూర్వీకుల విజయంగాధలను పుస్తక రూపంలో తేవడానికి తెలంగాణ వానులు ప్రయత్నించకపోవడం ఒక సాధారణ కారణం కాగా, లేని చరిత్రను తెలంగాణ ప్రజలపై పాలకులు బలవంతంగా రుద్దిన కారణంచే తమ చరిత్రను మరిచిపోయారు. శాతవాహనుల నుండి కాకతీయల దాకా ఇక్కడి ప్రజలకు చెక్కు చెదరని చరిత్ర ఉంది. పోరాటాలన్ని విషాదాంతంగానే ముగిసినందున పీడకలగా మిగిలిపోయింది ఉద్యమాలకే ఆటనేర్పించిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి చరిత్రే లేకపోవడం ఇక్కడి రచయితలు సిగ్గుతో తలదించుకోవాల్సిన అంశం వాస్తవానికి 1969నాటి ఉద్యమంలో పదినెలల పాటు ప్రాణాలను, కర్ఫ్యూను లెక్కచేయకుండా ఇక్కడి అన్ని వర్గాల ప్రజలు కదం తొక్కారు. ఎధురులేకుండా కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీని దేశంలోనే మొదటిసారి ఇక్కడి ప్రజలు ఛీకొడుతూ ప్రత్యేక తెలంగాణ వాదానికి జేజేలు పలికారు. పోలీసు కాల్పులకు ఎదురొడ్డి 360మంది ప్రాణ త్యాగం చేశారు ఆత్మహత్యలు చేసుకున్న వారిపేర్లను సహితం పదిలంగా పదికాలాలపాటు దాచే ప్రభుత్వాలు, తెలంగాణ అమరవీరుల పేర్లను కూడా మాయం చేయడం క్షమించరాని నేరమే ఆధిపత్యాలు చలాయించే జాతులు వెనుకబడ్డవారి చరిత్రను పైకి రానీయరని ఆర్యుల కాలంనాటి నుండే జరుగుతున్నది. ఇంతటి ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఆపాదించలేకపోయినా ఫరవాలేదు కాని సంకుచితత్వంతో దాన్ని వేర్పాటు వాదంగా చిత్రించడం చూస్తుంటే ప్రతి తెలంగాణ పౌరునిపై తేల్లు, జెర్రులు పాకినట్లు అవుతున్నది ఆంధ్రా ఆధిపత్యంతో నడిచిన పత్రికలన్ని ఆ ఉద్యమానికి వక్రభాష్యమే చెప్పడం వల్లనే ఈ దౌర్భాగ్యస్థితి నెలకొన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రస్తుత ఉద్యమాన్ని కూడా ఇదే విధంగా కనుమరుగు చేసే అవకాశాలున్నందున ప్రజలు, ఉద్యమకారులు ఏమరుపాటుతో మెలగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## కనుమరుగవ్వుతున్న తెలంగాణ

ఆల్విన్ మూసివేతతో 15వేల మంది రోడ్డున పడ్డారు ఎపి స్కూటర్స్, సర్‌సిల్క్, ఆజంజాహి మిల్స్ ఇప్పటికే మూతపడ్డాయి నాటి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ మూసివేతకు సిద్ధమైంది, గాంధీ ఆస్పత్రి తరలించబడింది హైదరాబాద్ రాష్ట్రానికి అక్షరభ్యాసం చేసిన చాదర్‌ఘాట్ హైస్కూల్ అమ్మకానికి ఎదురుచూస్తుంది. సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు దెబ్బకు ఒకనాడు తెలంగాణకు వెలుగులు అందించిన చిహ్నాలు ఒక్కొక్కటే కనుమరుగైపోతున్నాయి. సురవరం ప్రతాపరెడ్డి వార్డెన్‌గా, రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి ఆధ్వర్యంలో స్థాపించబడ్డ, రావి నారాయణరెడ్డి లాంటి వజ్రాలను అందించిన రెడ్డి హాస్టల్ ఉనికిని కోల్పోతున్నది ఐన్‌చాయ్, బిర్యానీల స్థానాన్ని ఇడ్లీ సాంబార్‌లు ఆక్రమించాయి. నిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడిన తెలంగాణ అమరవీరులు ఎవరో తెలంగాణ ప్రజలకు తెలియకుండా చేయడంలో ఆంధ్ర పాలకులు సఫలీకృతం అయ్యారు కొమురం భీం, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల కమలాదేవి, దొడ్డికొమురయ్య, బద్దం ఎల్లారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, సంగెం లక్ష్మీబాయి, సురభి సరస్వతిదేవి, సురభి రాజేశ్వరిదేవి, జిగినేపల్లి రాధాబాయి, ఓబుల్‌రెడ్డి రంగమ్మ, భాగ్యరెడ్డివర్మ, ఆదిలక్ష్మీదేవమ్మ లాంటి తెలంగాణ ప్రముఖులను చరిత్రకెక్కని వారుగా మలచడంలో విజయం పొందారు పొట్టి శ్రీరాములు, టంగుటూరిప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డి, ఎన్టీరామారావు, చంద్రబాబునాయుడు, రాజశేఖరరెడ్డి లాంటి వారే ఆంధ్రప్రదేశ్ రూపకర్తలని వేనోళ్ళ పొగుడుతున్నాం. కొమురంభీంను మరిచిపోయి పొట్టి శ్రీరాములును గుర్తుంచుకున్నాం. మన ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావును, మొట్టమొదటి హరిజన క్యాబినెట్ మంత్రి మహేంద్రనాథ్‌ను మరిచిపోయి బెజవాడ గోపాల్‌రెడ్డి, నీలం సంజీవరెడ్డిలను వేనోళ్ల పొగడుతున్నాం ఆంగ్ల పాలనను వంటబట్టించుకున్న ఆంధ్రుల కుయుక్తుల కారణంగానే ఇదంతా జరిగిందని చెప్పినా నమ్మేస్థితిలో మనవారు లేరు మదరాసు రాష్ట్రం నుండి విడిపోవడానికి పోరాటం సలిపిన ఆంధ్రులకు క్రమం తప్పకుండా జయంతులు, వర్ధంతులు జరిపిస్తూ ఇక్కడి పోరాట వీరులకు ఎలాంటి జయంతులు, వర్ధంతులు జరిపించలేకపోయారు.

తెలంగాణకు సంబంధమే లేని టంగుటూరి, పొట్టి శ్రీరాములు, ఓబుల్‌రెడ్డి విగ్రహాలు తెలంగాణలో సంతరించుకోవడం విచిత్రం. తెలంగాణ ప్రజలను పిట్టలను కాల్చినట్టు కాల్చేసిన కాసు బ్రహ్మానందరెడ్డిని నగరం నడిబొడ్డులో విగ్రహాలు, పార్కులు నెలకొల్పడం, ఆయన పేరుతో కాలనీలు స్థాపించడం తెలంగాణ ఆత్మగౌరవానికే తలవంపులు తెస్తున్నది ఆంధ్ర ముఖ్యమంత్రి ఎన్టీరామారావు చావుకు పదెకరాల స్థలాన్ని కేటాయించగలిగిన పాలకులు తెలంగాణ ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావుకుగాని, తెలంగాణ ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి గాని

ఇక్కడే ప్రవహిస్తుందట కృష్ణానీరు - పంటలకు ఆధారం వాననీరు

ఎకరం భూమి కేటాయించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. తెలంగాణ వ్యవసాయానికి గాని, తెలంగాణ భూ పోరాటాలకు గాని, సంబంధమే లేని ఎన్జీరంగా పేరును వ్యవసాయ విశ్వవిద్యాలయానికి తగిలించగా, తెలుగు భాషకు ఎటువంటి సేవలందించని పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి తగిలించారు.

నగరంలో టాంక్‌బండ్‌పై నెలకొల్పిన విగ్రహాలు ,ఆంధ్ర సంస్కృతికి అద్దం పడుతూ, తెలంగాణ సంస్కృతిపై దాడి చేసినట్లుగా ఉంది. విగ్రహాలకు సంబంధించిన వ్యక్తుల పేర్లుగాని, వారెప్పుడు ఏం చేశారు అనిగాని, ఎన్నో ఏండ్ల నుండి నివాసముంటున్న విద్యావంతులే తెలియదంటున్నారు. ట్యాంక్‌బండ్‌పైకి వెళితే పరాయి గడ్డమీదకు పోయినట్లుంటుంది. రెండు మూడు విగ్రహాలుతప్ప మొత్తం ఆంధ్రుల విగ్రహాలే ఓవైపు ఎన్టీఆర్ గార్డన్, మరోవైపు హైదరాబాదుకు ఎన్నడూ రాని పొట్టిశ్రీరాములు విగ్రహం, మధ్యలో విగ్రహారాధనను బహిష్కరించిన బుద్ధుని విగ్రహం తెలంగాణ చరిత్రను అవహేళన చేస్తున్నట్లుంది.

## ప్రస్తుత కర్తవ్యం

1971 మహా విద్రోహం తర్వాత తిరిగి జవజీవాలను నింపుకొని ఉద్యమించడానికి మళ్ళీ ఇంతకాలం పట్టింది అఖిలపక్ష ఒప్పందం, ఆరుసత్రాల పథకం బుట్టదాఖలవడంతో సంజయ, దౌమ్య రాయబారాలు విఫలమైనట్లయింది. ఆఖరికి చంద్రశేఖరరావు తిరుగుబాటుతో శ్రీకృష్ణరాయబారం కూడా విఫలమైనట్లే అయింది. అరణ్యవాసాలు, అజ్ఞాతవాసాలు, అవమానాలు అన్నీ భరించాకే మరో గత్యంతరం లేకనే, ఇక ఏమాత్రం భరించే శక్తి లేకపోవడం వల్లనే తెలంగాణ సర్వ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక రాష్ట్రమే సరైనదని గుర్తించి చివరి ఉద్యమానికి ఉపక్రమించాల్సి వస్తున్నది

| | |
|---|---|
| | వారంటారు... |
| అగకుండా సాగుతున్నాయి మోసాలు | ఆంధ్రుల గౌరవం నిలబెట్టు |
| కల్లబొల్లి కబుర్లతో కపట వేషాలు | అవసరమైతే తెలంగాణ తాకట్టు పెట్టు |
| ఏమైపోయాయి తెలంగాణ వాసుల రోషాలు | ఇంకెంతకాలం మన ఈ'ఊ'కొట్టు |
| మెలివేయక తప్పదు మన మీసాలు | ఇప్పటికైనా మేల్కొని 'ఛీ' కొట్టు |

తెలంగాణ ప్రజల భాష, యాసల అవమాన ఫలితమే - పక్షపాత పాలన అంతం కొరకే 'చివరి ఉద్యమం' ప్రారంభమైంది. తెలంగాణ ప్రజల కడుపు మంట రాష్ట్ర విభజననే కోరుకుంటున్నది పద్మవ్యూహంలో చిక్కుకు పోయిన తెలంగాణ ప్రజలు ఆ వ్యూహాన్ని ఛేదించడానికి పట్టువదలని విక్రమార్కుల్లా ఉద్యమించాలి. భగీరథుడు గంగను తెచ్చినట్లుగా, తెలంగాణను సాధించేవరకు విశ్రమించరాదు పాలకుల నక్కజిత్తులను ఈ 'చివరి ఉద్యమం' అనే బ్రహ్మాస్త్రంతో చిత్తుచేయక తప్పదు.

**ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రజలు కోరతారు - కలిసుండాలని వారు కోరుకోరు**

ఎటొచ్చీ 'కుంభకర్ణుని నిద్ర'లో ఉన్న తెలంగాణ ప్రజలను మేల్కొలుప వలసిన ఆవశ్యకత అన్నిటికన్నా ముందున్నది

'మూలుగులు మునుపటిలాగే – భోజనాలు ఎప్పటిలాగే' అన్నట్లు 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తర్వాత కూడా పాలకుల వివక్ష తగ్గలేదు ఆ తర్వాతే పక్షపాత పాలన విశ్వరూపాన్ని సంతరించుకుంది సమైక్య రాష్ట్రం ఏర్పాటు సమయంలో కలిసికట్టుగా కష్టించి పనిచేసి ఫలితాలను చెరిసగం పంచుకుందామన్నారు. ఈ మాయమాటలను నమ్మి పెద్దమనుషులు ఒప్పందం కుదుర్చుకున్నారు తరువాత జరిగిన పరిణామాలు విచిత్రమైన మలుపులు తిరిగాయి సమైక్య రాష్ట్రంలో మొక్కజొన్న చేను పెట్టి ముందుగా చెప్పినట్లే 'సగం వారుంచుకుని సగం తెలంగాణకు' పంచి ఇచ్చారు. కాకపోతే 'తెలంగాణకిచ్చింది కింది సగభాగం కాగా, ఆంధ్రులు పై సగభాగం వుంచుకున్నారు'. తెలంగాణలో ప్రాజెక్టులు నిర్మించి ఆంధ్రాకు పారించుకున్నారనేది ఈకోవకు చెందిందే.

దీనితో కింది సగభాగం వల్ల తెలంగాణకు కష్టనష్టాలే తప్పమిగిలిందేమీ లేదని గ్రహించి 1969లో ఉద్యమానికి ఉపక్రమించారు ఈ ఉద్యమాన్ని చల్లార్చే దురుద్దేశంతో 'క్రింది సగభాగాన్ని తాముంచుకుంటామని, పై సగభాగాన్ని తెలంగాణ వారికి కేటాయించి జరిగిన నష్టాన్ని సరిచేస్తామన్నారు' అఖిలపక్ష ఒప్పందం, ఆరుసూత్రాల పథకాలు ఈ కోవలోకి చెందినవే దీంతో తెలంగాణకు లాభం జరుగుతుందని ఎగిరి గంతేసి ఉద్యమానికి తూట్లు పొడిచారు. కానీ ఆంధ్ర పాలకులు తమ తెలివి తేటలను, కుతంత్రాలను, అధికారాన్ని ప్రదర్శించి ఈసారి పంటను మార్చారు. 'మొక్కజొన్న స్థానంలో వేరుశెనగ పంట వేశారు' ఫలితం తెలంగాణకు మళ్ళీ చెత్తే మిగిలిందని గ్రహించడానికి మూడు దశాబ్దాల కాలం పట్టింది

నివురుగప్పిన నిప్పులా తెలంగాణప్రజల గుండె మంటలు ఇంతకాలం కనిపించకుండా అణగివున్నాయి చంద్రశేఖర్‌రావు తిరుగుబాటుతో ఉద్యమం ఒక్కసారిగా భగ్గుమన్నది. అన్యాయాలను దిగమింగే ఓపికలేక, దాచుకునే స్థానంలేక, ఉద్యమాలను నడిపే స్థోమతలేక దిక్కుతోచని స్థితిలోనున్న తెలంగాణ ప్రజలకు చంద్రశేఖర్‌రావు రాకతో వెదకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లయింది రావణాసురుని గుట్టు విభీషణుడు రట్టు చేసినట్టు పాలకుల కుయుక్తులను చంద్రశేఖర్‌రావు బట్టబయలు చేశారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్టు ఉద్యమం పుట్టుకతోనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రసమితికి ఊహించని విజయాలు దక్కాయి. దీనితో అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఉద్యమం మరింత ఊపందుకుంది జనమేజయుని సర్పయాగంలో సర్పాలు నశించినట్లు ఈ 'ఉద్యమ మంటల్లో బూటకపు రాజకీయ నాయకుల చరిత్రలు మసైపోతున్నాయి ఇంతింతై వటుడింతైనట్లు ఈ ఉద్యమం మహోద్యమంగా మారి తీరుతుంది.

**మోసాలను చూస్తూ ఊరుకోరు – పాలకులంతా ఒట్టి దగాకోరు**

ఆంధ్ర ప్రాంతం అభివృద్ధి కొరకు తెలంగాణను ఫణంగా పెడుతున్నారనేది పచ్చి నిజం. ఇక ఎంతమాత్రం అలా జరగడానికి అవకాశం కల్పించరాదు. ఇకపై తెలంగాణలో ఆకలిచావులు, నిరుద్యోగం, దారిద్ర్యం కనిపించడానికి వీలుండరాదు గోదావరి, కృష్ణా, మూసీ, మానేరు, మంజీర, భీమా లాంటి నదులు ప్రవహించే ఈ పుణ్యభూమి నుండి రైతన్నలు పొట్ట చేతబట్టుకొని వలస కూలీలుగా పోవడానికి వీలుండరాదు అందుకే ఆంధ్రుల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యాన్ని అరికట్టి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఉద్యమిద్దాం పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళుతప్ప అన్నట్లు తెలంగాణ కొరకు పోరాడటంలో లాభమేతప్ప ఎటువంటి నష్టం లేదు . పడినా దెబ్బ తగలనంతటి దిగువ స్థాయిలో తెలంగాణ వాసులున్నారు పోయేదేమైనా వుంటే ఆంధ్రుల పక్షపాత పాలన, అవినీతి అధికారులు, ఆంధ్రుల ఆధిపత్యమే తప్ప మరొకటి కాదు

***కలిసివుండే పరిస్థితులు లేవు!***

**"చదువులుండి నీతిలేకపోతే అవినీతిపరులవుతారు లేదా రాజకీయ నాయకులౌతారు. చదువుతోపాటు నీతివుంటే చిరుద్యోగులౌతారు లేదా నిరుద్యోగులౌతారు. కండలుండి నీతి లేకపోతే కరుడుగట్టిన రౌడీలవుతారు, కండలతోపాటు నీతి వుంటే బండలుకొట్టే కూలీలౌతారు."** ఈ సూక్తి అక్షర సత్యమేనని తెలంగాణలోని నిరుద్యోగులు, చిరుద్యోగులు, బండలు కొట్టే కూలీలు రుజువు చేస్తుండగా, కోస్తాంధ్రకు చెందిన అవినీతి ఉద్యోగులు, అవినీతి నాయకులు - వారి ఆస్తులు రుజవు చేస్తున్నాయి.

పరుగు పందెంలో ఆంధ్రులు పూలబాటలో పరుగెడుతూ తెలంగాణకు ముళ్ళబాటను చూపించారు. తెలంగాణకు చందమామను చూపిస్తూ ఆంధ్రులు గోరుముద్దలు తింటున్నారు కబేళాలు తెలంగాణకు చూపించి కళాశాలలు ఆంధ్రులకంటున్నారు తెలంగాణ కష్టాలు, కన్నీళ్ళు ఆంధ్రులకు వినోదమే కలిగిస్తున్నాయి తెలంగాణ కరువు కాటకాలు ఆంధ్రులను కదిలించలేకపోయాయి. కోస్తాంధ్రను తైవాన్‌ను, జపాన్‌గా, సింగపూర్‌గా మార్చడానికి ప్రయత్నించినా మేమభ్యంతరం చెప్పేవారం కాదు. కానీ తెలంగాణను మెక్సికోగా, బ్రెజిల్‌గా మార్చినందుకే అభ్యంతరం చెప్పక తప్పడం లేదు ఇంకేమాత్రం ఆలస్యం చేసినా తెలంగాణ ప్రాంతం మరో సోమాలియా కాకతప్పదు సంపదలో తెలంగాణకన్న ఎక్కువ -నీతి నిజాయితీలలో తెలంగాణకన్నా తక్కువ అయినవారితో కలిసుండే కష్టాలుతప్పవు. నూనెతో పత్తి స్నేహం చేసినట్లు తెలంగాణ సహజ వనరులతో ఆంధ్ర పాలకులు, అధికారులు వతితలా కలిసిపోయి మాయలు చేస్తున్నారు. నూనె అయిపోయింతర్వాత పత్తి ఆరిపోయి తనను తాను రక్షించుకుంటుదని తెలిసిందే. ఇక్కడి వనరులను చేజిక్కించుకున్న తరువాత తెలంగాణను విడిచిపెడతామన్నా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు ఇప్పటికే ఒకసారి జైఆంధ్ర ఉద్యమాన్ని చవిచూశాం కదా! అయినా ఉప్పుతో నిప్పుకు స్నేహమేమిటి?

విలీనంతో వెనకబాటు మోరు - ఎత్తిపోతల పథకాలకు నిధులు లేక

***కలిసి ఎంతకాలమున్నా మేలు జరిగే అవకాశం లేదు***

ఎంతకాలం కలిసి ఉన్నా తెలంగాణకు మేలు జరిగే అవకాశం లేదు ఇప్పటికే కృష్ణానదిలో తెలంగాణ వాటా అందకుండా చేసి ఆంధ్ర వాటాకన్నా అదికంగా వినియోగించుకున్నారు. ఇంకొంతకాలం కలిసివుంటే గోదావరి నదీ జలాలను కూడా పూర్తిగా వారికే చదివించాల్సి వస్తుంది జాతీయ విపత్తు నిధికింద అందుతున్న నిధులన్నీ తుఫాన్ పీడిత ప్రాంతాలకే వెచ్చిస్తున్నారేతప్ప కరువు పీడిత ప్రాంతాలకు అందదం లేదు. తుఫాన్‌లో కొబ్బరిచెట్లపై చూపించినంత శ్రద్ధ తెలంగాణ రైతుల ఆత్మహత్యల సమయంలో చూపించడం లేదు.

ఆంధ్ర ప్రాంతంతో కలిసి ఉన్నంతకాలం తెలంగాణ నాయకులకు తెలంగాణ అభివృద్ధి గుర్తుకు రాదు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అభివృద్ధి తప్ప మరో లక్ష్యం వుండే అవకాశం లేదు తెలంగాణ రాజకీయ నాయకుల స్వార్థపూరిత చర్యలకు తెలంగాణ మొత్తం నష్టపోతున్నది అందుకే ఇప్పటికిప్పుడు తెలంగాణ వ్యక్తికే ముఖ్యమంత్రి పదవి ఇస్తామన్నా కలిసి వుండే వీలులేదని ఘంటాపథంగా చెప్పాల్సిన అవశ్యకత వుంది.

నీలం సంజీవరెడ్డి తన పదవిని రక్షించుకునే నేపథ్యంలో తన ప్రాంతమైన అనంతపూర్‌ను మరిచిపోయాడు రెండుసార్లు ముఖ్యమంత్రి పదవి, ఒకసారి రాష్ట్రపతి పదవిలోనున్న సంజీవరెడ్డి తన సొంత జిల్లాను దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాగా మిగిల్చాడు నీరు పల్లానికే ప్రవహిస్తుంటుంది రాజకీయాలను ధనమే ప్రలోభ పెడుతుంటుంది. ఆర్థికంగా అగ్రస్థానంలో వున్న ఆంధ్ర రాజకీయ నాయకులకు తెలంగాణ, రాయలసీమ నాయకులు లొంగిపోతున్నారని పరిస్థితులు తెలియజేస్తున్నాయి. పాలిచ్చే బర్రెకే పచ్చిగడ్డి వేసినట్లు అన్నివిధాలా అభివృద్ధి చెందిన కోస్తాంధ్రకే అధిక నిధులు కేటాయిస్తున్నా ప్రశ్నించేవారు మచ్చుకైనా కనిపించడం లేదు. కోడిపిల్లను రక్షించాలంటే గ్రద్దకు దూరంగా, కప్పను రక్షించాలంటే పాముకు దూరంగా వుంచక తప్పదు. అదేవిధంగా తెలంగాణను రక్షించాలంటే ఆంధ్ర నుండి వేరుచేయక తప్పదు.

***అంతర్గత కలహాలొద్దు***

ప్రత్యేక తెలంగాణను సాధించడానికి తెలంగాణ వాసులంతా ఒక్కటవ్వాలి అంతర్గతంగా ఎన్ని తగాదాలున్నా మరిచిపోక తప్పదు ఇతర దేశాలతో సమస్య తలెత్తినప్పుడు ఇక్కడి ప్రజలు కూడా భారతీయులే. ఇతర రాష్ట్రాలతో తగాదాలేర్పడితే తెలంగాణ ప్రజలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. కానీ ప్రత్యేక తెలంగాణ విషయంలో ఎటువంటి గందరగోళం లేకపోయినా తెలంగాణ వాసులలో గందరగోళం కనిపిస్తున్నందున పరస్పర చర్చలతో పట్టువిడుపులతో సమస్యను సానుకూలంగా పరిష్కరించుకొని ముందుకు వెళ్ళాలి. చిన్న చేపను పెద్ద చేప

మింగేస్తుంది పెద్ద చెట్టుకింద చిన్న చెట్టు ఎదగదు అనేది ప్రకృతి నేర్పిన పాఠం. ఆర్థికంగా ఎంతో ముందంజలో వున్న ఆంధ్రులతో ఎంతకాలం కలిసున్నా తెలంగాణ ప్రజలకు ఒరిగేదేమీ లేదు. అడుగడుగునా అవమానాలతో, పరస్పర అనుమానాలతో నిత్య అలజడులతో సమైక్య రాష్ట్రంలో సాధించగలిగేదేమీ మిగులలేదు. ఇప్పటికే తెలంగాణకు నిప్పంటుకున్నది. ఆలస్యం చేస్తే దక్కేదేమీ వుండదు త్వరలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం ఖాయం. తెలంగాణను సాధించడంలో మనమంతా భాగస్వాములం అనిపించుకోవాలంటే ఉద్యమంలో పాలుపంచుకొనక తప్పదు

**ఉద్యమాన్ని నీరుగార్చేవారు**

పిల్లలు ఏడ్చినప్పుడల్లా పీచుమిఠాయి కొనిచ్చినట్లు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముందుకొచ్చినప్పుడల్లా ఏదో ఒక తాయిలంతో ఉద్యమాన్ని చల్లార్చే ప్రయత్నాలను పాలకులు చేపడుతున్నారు. అందుకే ప్రస్తుత ఉద్యమాన్ని కూడా చల్లార్చే ప్రయత్నంలో భాగంగా దేవాదుల ఎత్తిపోతలకు శంకుస్థాపన వంటి బూటకపు పథకాన్ని ముందుకు తెచ్చారు. ఇప్పటివరకు పాలకులు వేసిన ఎరకు చేపలు దక్కినందున అదే ఆశతో మరోసారి గాలం వేశారు. ఈసారి ఎరను మింగి గాలానికి చిక్కకుండా చేప తప్పించుకునేలా తెలంగాణ ఉద్యమాన్ని నడిపించాలి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాదాన్ని తెలంగాణేతరులు వ్యతిరేకించడంలో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. తెలంగాణ వనరులతో భోగ జీవితాలు అనుభవిస్తున్నవారు సహజంగానే తెలంగాణను దూరం చేసుకోవాలని ఆశించరు. విడిపోతే దెబ్బతినేవారు కొందరుంటారు. ప్రస్తుతమున్న ప్రాజెక్టులకు నీరందదని భావించేవారు కొందరు. తెలంగాణ ప్రాంతంలో ఆస్తులను సంపాదించుకున్న ఆంధ్రులకు ఆందోళన కలిగే అవకాశముంటుంది. విచిత్రంగా తెలంగాణ వాసుల్లో కూడా కొందరు ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని వ్యతిరేకించడం విచారకరం. ధనవంతులు, అధికారంలో ఉన్నవారు, అధికారం వస్తుందని ఆశపడేవారు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు రాష్ట్రం విడిపోవడాన్ని అంగీకరించరు. కేవలం వ్యక్తిగత లాభాలతోనే ఉద్యమాన్ని వ్యతిరేకించే వారుంటారు. పెద్దదాని కొరకు చిన్నదాన్ని త్యాగం చెయ్యక తప్పదు మొత్తం తెలంగాణ ప్రజల బాగు కొరకు వ్యక్తిగత లాభాల పేరుతో ఉద్యమానికి గండి కొట్టాలని ప్రయత్నించడం భావ్యం కాదు. ఉద్యమంలో పాల్గొనకపోయినా, ఉద్యమాన్ని ప్రోత్సహించకపోయినా ఫరవాలేదు. కానీ ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నించడం ద్రోహమే.

సాహచర్య దోష ఫలితంగా అవినీతి, కపటం తెలంగాణలోని కొందరికి సంక్రమించి వుండొచ్చు అందుకే తెలంగాణ వాసుల్లో కొందరు సమైక్య రాష్ట్రాన్ని కోరుకుంటున్నారు కానీ సంపద శాశ్వతం కాదు పట్టాభిషేకం చేసుకోవాల్సిన రాముడు అడవులకు వెళ్ళాల్సి వచ్చిందని మరచిపోరాదు. చక్రవర్తిగా ఉన్న

హరిశ్చంద్రుడు కాటికాపరిగా ఉన్నాడని పురాణం తెలియజేస్తున్నది. ప్రస్తుత కాలంలో కోట్లకు పడగలెత్తిన వారిలో కొందరు కొద్దికాలంలోనే రోడ్డుమీదికి వస్తున్న సంఘటనలు ప్రత్యక్షంగానే గమనిస్తున్నాం. భావితరాలను దృష్టిలో పెట్టుకుని వారి బాగు కొరకు నేటితరం చిన్న చిన్న త్యాగాలను చేయకతప్పదు

ఇంతకుముందే శంకుస్థాపనలు జరిగిన పథకాలను పక్కకు పెట్టి కొత్త పథకాలకు శంకుస్థాపనలు చేస్తుంటే తెలంగాణ మంత్రులు అంతర్యాన్ని గ్రహించలేకపోతున్నారు కూటిలోని రాయిని తీయలేనివాడు ఏటిలోని రాయిని తీస్తానంటే నమ్మినట్టు కొద్దిపాటి ఖర్చుతో పూర్తి చేయగలిగిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించకుండా పక్కకు పెట్టి దేవాదుల పథకాన్ని పూర్తి చేస్తామంటే తెలంగాణ మంత్రులు అధికార మత్తులో నుండి తేరుకోలేకపోతున్నారు చెట్టును నరకాలంటే చెట్టుజాతికే చెందిన కట్టె కూడా గొడ్డలికి సహాయపడుతున్నట్టు తెలంగాణ వెనుకబాటుకు కూడా తెలంగాణకే చెందిన స్వార్థ రాజకీయ నాయకుల సహకారం పాలకులకు లభిస్తున్నది. సమైక్య రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలు కార్యరూపం దాల్చవని, అవి కథలుగా చెప్పుకోవడానికే పనికి వస్తాయని గత చరిత్ర తెలియజేస్తున్నది.

శాసన సభ్యులలో, మంత్రులలో తెలంగాణ నాయకులు కూడా ఉన్నారు కదా అని ఇంతకాలం వారిమీద నమ్మకం ఉంచాం. కళ్లు మూసుకుని పిల్లి పాలు తాగుతూ తనను ఎవ్వరూ చూడటం లేదని భావిస్తుందేమో కాని, తెలంగాణ నాయకులు మాత్రం ఇక్కడి ప్రజల కళ్ళు మూసి వారు పాలు తాగాలని చూస్తున్నారు వారిమీద నమ్మకంతో ఇంతకాలం గుండెలమీద చెయ్యి వేసుకుని గుర్రుపెట్టి నిద్రపోయాం. కళ్ళు తెరిచి చూసే సరికే సరిచేసుకోలేనంతగా వెనుకబడిపోయాం. పసలేని మంత్రి పదవులు అప్పగిస్తే సారంలేని బొక్కను కొరుకుతూ మైమరిచిన స్థితిలో మనలను మరిచిపోయారు. సమైక్య రాష్ట్రంలో మన రాజకీయ నాయకుల శక్తి సామర్థ్యాలను కళ్ళారా చూశాం. ఇక వారిపై భరోసా వుంచడానికి వీలులేకుండా పోయింది. అందుకే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాలు పంచుకోక తప్పదు.

## ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యం

ప్రస్తుత పరిస్థితులలో పతి ప్రాణంతప్ప మరేమీ అక్కర్లేదన్న సావిత్రిని ఆదర్శంగా ఎంచుకొని ప్రత్యే రాష్ట్రం తప్ప మరేమీ అక్కర్లేదని ఎలుగెత్తి చాటడమే మన ఏకైక లక్ష్యం.

చీకటిని నిందిస్తూ కూర్చోవడంకన్నా చిరుదీపాన్ని వెలిగించుకోవడమే వివేకవంతుల లక్షణం. మోసాలు దిగమింగడం కాదు, ఎదిరించడం నేర్వాలి. చెప్పిన ప్రతిదానికి తలూపడం కాదు, తప్పులను ఎత్తిచూపి ప్రశ్నించడం నేర్వాలి. సాయుధ పోరాటాలు జరిపి సాగిలపడిపోవడం కాదు, లక్ష్యం సిద్ధించేవరకు విశ్రమించకుండా సహనంతో పోరాటాన్ని కొనసాగించాల్సిన పట్టుదలను పెంచుకొనేలా నేర్వాలి, అమాయకంగా

ఉన్నంతకాలం అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ మీద భస్మాసుర హస్తాన్నే మోపాయి. ఇంతవరకు జరిగింది చాలు, ఇక బూటకపు రాజకీయ భస్మాసురులు తమ నెత్తులపైననే చేతులు పెట్టుకునేలా చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అడగందే అమ్మైనా పెట్టదట, ఉద్యమించకపోతే ఎన్నటికీ తెలంగాణ రాష్ట్రం దక్కదు. ఎప్పటికైనా ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించాల్సిందే! అదిప్పుడే ఎందుకు చేపట్టరాదు?

బ్రిటీష్‌వారు తమ ఆధీనంలోనికి తెచ్చుకున్న దేశాలమీద ఎల్లకాలం పెత్తనం చేయొచ్చని భావించినట్లే ఆంధ్ర పాలకులు కూడా తెలంగాణపై ఎల్లకాలం పెత్తనం సాగించవచ్చని పగటి కలలు కంటున్నారు. కానీ, రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యంలో రవి అస్తమించాడనే విషయం పాలకులు గుర్తుకు తెచ్చుకుంటే మంచిది

### *సమైక్య రాష్ట్రంలోనే ఉంటూ తెలంగాణను చక్కబరుచుకునే అవకాశం ఉందా?*

చేసుకున్న ఒప్పందాలన్ని బుట్టదాఖలైనాయి. రోజు రోజుకు మోసాలు పెరుగుతున్నాయి. తెలంగాణ ప్రజల జీవితాలు దిగజారుతున్నాయి. ముల్కీ ఉద్యమాన్ని స్వార్థపరులైన తెలంగాణ నాయకులే దెబ్బతీశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బూటకపు ఒప్పందాలను చూపించి ఉద్యమానికి ఫలితమే దక్కకుండా చేశారు. తీర ప్రాంతంలోని ప్రజలమీద చూపించే శ్రద్ధకన్న అధిక శ్రద్ధను పీఠభూమి మీద నివసించే ప్రజల మీద చూపించాల్సి ఉంటుంది కాని సమైక్య ఏర్పాటు రోజు నుండి కడుపు నిండిన వారికే వడ్డిస్తామంటున్నారు. నిధుల కేటాయింపుల్లో పక్షపాతమే చూపించారు కృష్ణా, నదీజలాలన్నింటిని కోస్తాంధ్రకే మళ్ళించారు. గోదావరి జలాలను వినియోగించే తెలంగాణ పథకాలను కాగితాలకే పరిమితం చేశారు. 1956 నుండి 1969 వరకు దక్కించుకున్న ఉద్యోగాలను రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా జీవో 36 అమలుకాకుండా అడ్డుపడ్డారు. 1969 నుండి 86 వరకు దక్కించుకున్న అధిక ఉద్యోగులను ఆంధ్రా ప్రాంతానికి పంపించి ఆ స్థానాలలో తెలంగాణ వారిని నింపాల్సిన 610 జీవో ఈనాటికి అమలుకాలేదు. అరు సూత్రాల ఒప్పందంలో ఆంధ్రులకు అనుకూలమైన నిబంధనలన్నీ అమలుకు నోచుకోగా తెలంగాణకు లాభం కలగాల్సిన నిబంధనలను అణగద్రొక్కారు. పెద్దమనుష్యుల ఒప్పందం, అఖిలపక్ష ఒప్పందం, 5 సూత్రాల పథకం, ఆరుసూత్రాల పథకం, 8 సూత్రాల పథకం లాంటివన్ని తెలంగాణకు ఎటువంటి న్యాయం చేయలేకపోయాయి. ప్రభుత్వం ఆదాయం తెలంగాణ నుండి అధికంగా ఉండగా, కేటాయింపుల్లో ఆంధ్రా ప్రాంతానికి అధికంగా ఉంటున్నాయి. విశ్వవిద్యాలయాలన్నీ ఆంధ్రా, రాయలసీమల్లోనే కేంద్రీకృతమైనాయి ఉన్న విద్యా సంస్థలనే కొనసాగించే అవకాశం లేదు. కొత్తవి స్థాపించే అవకాశాలు అసలే లేవు. స్థాపించినా గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు, అనంతపూర్, కడపలు ఎదురుచూస్తనే ఉన్నాయి తెలంగాణలో ఉన్న పరిశ్రమలన్ని ఇప్పటికే మూతపడ్డాయి

**తెలంగాణవారి పదవులు బొక్కతీరు - కంకినా ఫలితం లేదు కుక్కతీరు**

కొత్త పరిశ్రమలను కోస్తాంధ్ర జిల్లాల్లో నింపేస్తున్నారు. తెలంగాణలో బొగ్గు గనులుంటే ఆంధ్ర ప్రాంతంలో విద్యుత్ పరిశ్రమలను నెలకొల్పడం నగుబాటే బొగ్గుగనులు. సున్నపురాయి తగ్గిపోతున్నాయి. రాష్ట్ర అప్పులు పెరుగుతున్నాయి రాష్ట్ర అప్పుల్లో తెలంగాణ వాటా పెరుగుతున్నది. నిరుద్యోగులు పెరుగుతున్నారు. నిన్నటి రోజుకన్న ఈరోజు అధ్వాన్నంగా తయారైపోతున్న ముఖ్యమంత్రి పదవులు దక్కే అవకాశాలు లేవు. దక్కినా నిలుపుకునే అవకాశాలు అసలే లేవు. నిలుపుకున్నా తెలంగాణపై దృష్టిని సారించే పరిస్థితులు లేవు మూడింట రెండువంతుల మెజార్టీ శాసనసభ్యులు తెలంగాణ అభివృద్ధిని ఏనాడు కోరుకోరు అటువంటి సందర్భంలో ముఖ్యమంత్రి పదవి దక్కినా ఫలితమేమి ఉండదని తెలుస్తున్నది కోస్తాంధ్ర, రాయలసీమల్లోనే సుమారు రెండింట మూడువంతుల స్థానాలున్నందున కేవలం 107 స్థానాల తెలంగాణ వ్యక్తి ఏమీ సాధించలేడు ఇందులో హైదరాబాద్‌కు చెందిన 13 స్థానాలు ఎప్పుడు రాజధాని అభివృద్ధి మీద తప్ప తెలంగాణ అభివృద్ధి గురించికాని, ప్రత్యేక రాష్ట్రం కావాలని కాని కోరుకునే అవకాశాలు లేవు మిగిలిన 94 స్థానాలలో కూడా కనీసం 10 స్థానాలు తెలంగాణలో స్థిరపడ్డ ఆంధ్రులే చేజిక్కించుకున్నా ఇంకా 84 స్థానాలలో అధికార పార్టీకి చెందే శాసనసభ్యులు ఉలుకుపలుకు లేకుండా మూగవారిలాగా, చెవిటివారిలాగా మారిపోతారు. అధికారంలో ఉన్నరోజున ఏమీ చేయలేనివారు అధికారం లేని రోజున ఏమీ చేయలేరని చెప్పాల్సిన అవసరమేలేదు. ఇది గత 50 ఏళ్ళ నుండి జరుగుతున్న తంతే

పాలకుల వాగ్దానాలు కార్యరూపం దాల్చలేకపోయాయి. నాగార్జునసాగర్‌లో మోసం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు విషయంలో మోసమే చేశారు. మన ప్రాజెక్టులు అనుకున్న సమయంలో పూర్తి కాకపోవడాన్ని నిలదీసేవారు లేరు. తెలంగాణేతర ప్రాంతాలలో క్రొత్త ప్రాజెక్టులను ప్రారంభించి, చూస్తుండగానే పూర్తి చేసుకుంటున్నా ప్రశ్నించలేకపోతున్నారు. అయిదువేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ చాలని కమ్యూనిస్టులు కొత్తపాటను అందుకున్నారు. నికరంగా సంవత్సరానికి తెలంగాణ వాటాక్రింద 5వేల కోట్ల అప్పులు పెరుగుతుండగా కేవలం 5వేల కోట్లు ఇస్తే సరిపోతుందని అర్థంపర్థంలేని వాదనలను వారు ముందుకు తెచ్చారు ఇప్పటికే పాతాళంలోకి తెలంగాణ తోసివేయబడ్డది. దాన్ని గట్టెక్కించడానికి బ్రహ్మతరం కూడా కాదు. అంటే సమైక్య రాష్ట్రంలో బాగుపడే అవకాశాలు అసలే లేవు ఇక మిగిలిందల్లా విడిపోవడమే విడిపోతే మన నిధులతో మన అప్పులతో ఎన్నటికో ఒకనాటికి బాగుపడే అవకాశముంటుంది

అంతర్గత పరాయిపాలన నుండి విముక్తి కోసం తెలంగాణ మరో ఉద్యమానికి సిద్ధమైనది. ఈ ఉద్యమం ద్వారా ఏది మారినా, మారకపోయినా మన వనరుల మీద మనకే హక్కు లభిస్తుందనడంలో మాత్రం సందేహం లేదు స్వపరిపాలన, స్వయంపోషకత్వ రాష్ట్రంగా మన తెలంగాణను తీర్చిదిద్దటానికి ఎటువంటి త్యాగాలకైనా వెనుకాడబోమని మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం. □

**రాజధానిలో నివాసాలు వేరు వేరు – కొట్టొచ్చినట్లు ఇండ్ల తీరు వేరు**

ACC No. ......

# సహచర బుక్‌మార్క్

## తెలంగాణ క్యాసెట్ సెంటర్

ఎ.పి. హెచ్.బి. హెచ్.ఐ.జి. (ఓ.జి),
బ్లాక్ నెం. 5, షాప్ నెం. 29,
సుందరయ్య పార్కు పక్కన,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044
ఫోన్ : 040-27679998
సెల్ : 98483 48173.

మా వద్ద తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను తెలుపుతూ వ్రాయబడిన సాహిత్యం అనగా తెలంగాణ జీవన విధానం, కళలు, సంస్కృతి, చరిత్ర మొదలైన పుస్తకాలతోపాటు క్యాసెట్లు, సి.డీలు, క్యాలండర్లు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు, జెండాలు, కండువాలు మొదలైనవి లభించును. మరియు అభ్యుదయ, దళిత, మహిళా, జనరల్ సాహిత్యం లభించును.

## తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయం

తెలంగాణ భవన్, రోడ్‌నెం. 10,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034.
ఫోన్ : 040 - 23398873
ఫ్యాక్స్ : 040 - 23543388